


ESTD: 1999
www.voodayam.com

# వుదయం


కరీంనగర్ 04-09-2026 శుక్రవారం | సంపుటి : 14 | సంచిక :257 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on




## ఇది ఓల్డ్ సిటీ కాదు..

# ఒరిజినల్ సిటీ



### అసదుద్దీన్ ఏది అడిగితే అది ఇస్తా
### దేశభక్తి విషయంలో అందరం ఒక్కటే
### గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం) :** చంచల్‌గూడ సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూనే, హైదరాబాద్ నగర అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం కేవలం శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుందని, నిర్మాణానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు కేటాయించి పనులు పూర్తి చేసిందని స్పష్టం చేశారు. "నేను గతంలోనే చెప్పాను.. ఇది ఓల్డ్ సిటీ కాదు, ఒరిజినల్ సిటీ.. ఇక్కడి ప్రతీ గల్లీ నాకు తెలుసు" అని సీఎం పేర్కొన్నారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే మంజూరు చేయాలని ఈ వేదిక సాక్షిగా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బలాల కాలేజ్ అభివృద్ధి కోసం రూ. 20 కోట్లు కోరగా, దానిని రూ. 25 కోట్లకు పెంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నిధులు ఇవ్వడం తన బాధ్యతని, ఏడాదిన్నరలోగా పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత మాత్రం స్థానిక ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు. విద్యారంగానికి ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

దేశభక్తి అంశంపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఒవైసీ హిందుస్థాన్‌కు మద్దతుగా నిలిచి గొప్ప దేశభక్తిని చాటారంటూ ప్రశంసించారు. రాజకీయ సిద్ధాంతాలు వేర్వేరు కావొచ్చని, కానీ దేశభక్తి విషయంలో అందరం ఒక్కటేనని ఉద్ఘాటించారు. హిందూ, ముస్లింలు కలిసి నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. నగరంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా దూసుకెళ్తున్నామని సీఎం తెలిపారు. కేబుల్ బ్రిడ్జి చూడాలంటే దుర్గం చెరువుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, మీరాలం చెరువులో 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల నాటికి గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రోను పూర్తి చేసి, అదే మెట్రోలో వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతానని ధీమా వ్యక్తం చేశారు. అలాగే నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నామని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిని అడ్డుకోవాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని మండిపడ్డారు. మూసీని అభివృద్ధి చేసి నైట్ ఎకానమీని ప్రోత్సహించడం ద్వారా స్థానిక పేద ముస్లింలకు ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తుచేశారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు ఉండాలని, ఎన్నికలు ముగిశాక అభివృద్ధి ఒక్కటే తమ లక్ష్యమని పేర్కొంటూ, అందరం కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందమని పిలుపునిచ్చారు.

## ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తి

**దశాబ్దం క్రితమే మోదీ ఏఐ గురించి దూరదృష్టితో ఆలోచించారు**

**భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ హబ్‌గా ఎదగాలి: జెన్సన్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (ఏఎంఎస్)** ప్రపంచ ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో సరికొత్త టెక్నాలజీ వైపు దూసుకుపోతోందని ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దం క్రితమే ఎంతో దూరదృష్టితో ఆలోచించి ఏఐ గురించి మాట్లాడారని ఆయన గుర్తుచేశారు. నార్త్ కరోలినాలోని చాపెల్ హిల్‌లో జరిగిన జీ20 ఇన్నోవేషన్ మినిస్టీరియల్ సమావేశం సందర్భంగా హువాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ కంపెనీలు, స్టార్టప్‌లు కేవలం ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో సరిపెట్టకుండా, దాని అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. బలమైన ఏఐ ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవడానికి భారత్‌కు ప్రస్తుతం ఎంతో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానికి అనుగుణంగా దేశాలు కూడా మరింత వేగంగా ముందడుగు వేయాలని సూచించారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు

# మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (ఏఎంఎస్) :** రష్యా ఉక్రెయిన్ మధ్య నెలకొన్న భీకర యుద్ధానికి తెరదించేందుకు ఎలాంటి సహాయసహకారాలు అందించడానికైనా భారత్ సిద్ధంగా ఉందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ఇరు దేశాలు కనుక కోరితే శాంతి స్థాపన కోసం మధ్యవర్తిత్వం వహించడానికి కూడా వెనుకాడబోమని ప్రకటించారు. యుద్ధభూమిలో ఏ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించదనేదే తమ దేశం యొక్క స్పష్టమైన వైఖరి అని పునరుద్ఘాటించారు. కేవలం పరస్పర సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చల ద్వారానే ఈ సంక్షోభానికి ముగింపు పలకవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మూడు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు ఉక్రెయిన్, పోలాండ్ దేశాలలో జైశంకర్ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఉక్రెయిన్ రాజధానిలో ఆ దేశ విదేశాంగ మంత్రితో ఆయన సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో వాణిజ్య నౌకలపై పెరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో నెలకొన్న భద్రతా పరిస్థితులపై ఇరువురు నేతలు కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ ప్రాంతంలో భారతీయ నావికుల భద్రతపై జరుగుతున్న దాడుల పట్ల జైశంకర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా, ఇటీవల షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) సదస్సులో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైన కొద్ది రోజుల వ్యవధిలోనే విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఉరిశిక్ష పడిన ముద్దాయికైనా చివరి కోరిక అడుగుతారు

# నన్నెందుకు తొలగించారు?



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం) :** మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై ఎలాంటి వివరణ కోరకుండానే తొలగింపు నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఓ ఉరిశిక్ష పడిన ముద్దాయిని సైతం చివరి కోరిక ఏమిటని అడుగుతారని, కానీ తను ఎలాంటి తప్పు చేయకపోయినా కనీస సమాచారం లేకుండా చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు తనను మంత్రి పదవి నుంచి తొలగించే ఉద్దేశం లేదని, అయితే సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేసి ఈ నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. తనను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేక తాను రాజీనామా చేయమంటారా అంటూ సీఎం బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. తనతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కొందరు నేతలు కుట్ర పన్నారని సురేఖ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తనపై కక్షగట్టారని విమర్శించారు. తన ప్రమేయం లేకుండానే సుమంత్‌ను తప్పించడమే కాకుండా, పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి గతంలో కాంగ్రెస్‌ను విమర్శించిన వారేనని గుర్తుచేశారు. మంత్రి పదవి కోల్పోయినందుకు తాను ఎలాంటి అవమానంగా భావించడం లేదని, ప్రజల బలం తన వెంటే ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని సురేఖ హెచ్చరించారు. ప్రభుత్వ తీరుపై అటు మంత్రులు, ఇటు ఎమ్మెల్యేలు కూడా సంతోషంగా లేరని, గుండెల మీద చేయి వేసుకుని వారి బాధలను బయటకు చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులకే పనులు జరగని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన మాత్రం తనకు లేదని, భవిష్యత్తులోనూ ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే పెద్దఎత్తున మార్పులు జరగాల్సిన అవసరం ఉందని ఆమె

## నల్సార్ వివాదంపై సుప్రీంకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (ఏఎంఎస్) :** నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ లా విద్యార్థులను న్యాయవాదులుగా ఎన్‌రోల్ చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించి గురువారం జరిగిన విచారణలో, న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టబద్ధమైన అధికారం బీసీఐకి లేదని సర్వోన్నత ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో సదరు విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లయింది. నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించవద్దంటూ కొంతమంది విద్యార్థులు లేఖ రాశారన్న వార్తల నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. ఈ పరిణామాలపై స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర.. మూడు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని వర్సిటీ వీసీని ఆదేశించడంతో పాటు, 2026 బ్యాచ్ విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ దేశవ్యాప్త బార్ కౌన్సిళ్లకు లేఖ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఆ తర్వాత బీసీఐ ఈ ఆదేశాలను వెనక్కి తీసుకున్నప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా లేదా తీవ్రంగా పరిగణించింది. విద్యార్థులతో తనకు జరుగుతున్న సంవాదంలో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు అంటూ గతంలోనూ సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజా సుప్రీంకోర్టు తీర్పుతో లా విద్యార్థులకు ఎదురైన ఇబ్బంది తొలగిపోయింది.

# సమాచారంతో సిద్ధంగా ఉండాలి

### ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం) :** రాష్ట్రంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాలను పురస్కరించుకుని, గౌరవ సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు ఎటువంటి జాప్యం లేకుండా వేగంగా, కచ్చితమైన సమాధానాలు అందించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో ఆయన అసెంబ్లీ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, సభలో సభ్యులు అడిగే ప్రశ్నల తీవ్రతను బట్టి సంబంధిత విభాగాలు పక్కా సమాచారంతో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రశ్నల తయారీ, సమాచార సేకరణ మరియు ఇతర శాఖలతో సమన్వయం చేసుకునే నిమిత్తం ప్రతి శాఖ తరపున ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని సూచించారు. శాసనసభ సాక్షిగా ఏ శాఖకు సంబంధించిన అంశంపై నైనా అదనపు సమాచారం కోరినప్పుడు, ఎటువంటి ఆలస్యం లేకుండా వెంటనే వివరాలు సేకరించి నిర్దేశిత సమయంలోగా సభకు అందజేసేలా సమన్వయ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయాలని అధికారులను కోరారు. అలాగే, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాల వివరాలను తక్షణమే అసెంబ్లీ అధికారులకు అందజేయాలని తేల్చిచెప్పారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, బి.ఎమ్.డి. ఎక్కా, వాణి ప్రసాద్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో ఏసీబీ పంజా..

# టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్య అరెస్ట్

**రూ.3.5 కోట్లకు పైగా విలువైన స్థిరాస్తులు సీజ్**


**ఏకకాలంలో 7 ప్రాంతాల్లో తనిఖీలు**

**భారీగా బంగారం, నగదు స్వాధీనం**



**సూర్యాపేట, సెప్టెంబర్ 3 (వుదయం) :** సూర్యాపేటలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో) సోమయ్య అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి గురువారం విస్తృత సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, అనుచరులకు చెందిన మొత్తం 7 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ ఎత్తున ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సోమయ్యకు చెందిన విస్తృత ఆస్తులను ఏసీబీ గుర్తించింది. ప్రధానంగా 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమితో పాటు, సూర్యాపేట మరియు హయత్‌నగర్ పరిధిలో 5 భారీ రెసిడెన్షియల్ ప్రాపర్టీలను కనుగొన్నారు. వీటిలో జీ+1, జీ+2, జీ+4 విత్ పెంట్‌హౌస్ భవనాలతో పాటు మరో రెండు గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. వీటితో పాటు 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండిని గుర్తించారు. అలాగే రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నట్లు తేలింది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, రికార్డుల ఆధారంగా మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490గా లెక్కగట్టారు. అయితే బహిరంగ మార్కెట్లో వీటి విలువ ఇంకా అనేక రెట్లు ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ అక్రమ ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తోందని, నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఇంతే కదా...!




## కాంగ్రెస్ పాలనలో

# రైతుల కష్టాలు



**మిర్యాలగూడ , సెప్టెంబర్ 3 (వుదయం) :** మిర్యాలగూడలో నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ 14న వచ్చే వినాయకచవితిలోపు నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించకపోతే, కోదాడ నుంచి హాలియా వరకు భారీ పాదయాత్ర చేపడతామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఎన్ని తడులకు నీరు ఇస్తారు, ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో 537 అడుగుల నీరు ఉందని, జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 40 నుంచి 50 టీఎంసీల నీరు సాగర్‌లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రెండు పంటలకు నీళ్లు ఇచ్చేందుకు పూర్తి అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.







## సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న శాసనసభ్యులు
# డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

**వుదయం మనూరు సెప్టెంబర్:3**

ప్రజా,సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో, పనిచేయాలని నారాయణఖేడ్, నియోజకవర్గ శాసనసభ్యులు,డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి,స్పష్టం చేశారు. మానూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే విస్తృతంగా సమీక్షించారు. రైతుల సంక్షేమం, గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి, గృహావసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.సమావేశంలో స్థానిక సర్పంచులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను

# యూరియా యాప్ రద్దు చేయాలి



- **దుబ్బాకలో రైతుల రాస్తారోకో**

**దుబ్బాక, సెప్టెంబర్ 3, వుదయం:**

యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, యూరియా బుకింగ్ యాప్ ను వెంటనే తొలగించాలంటూ గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. నెల రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి వెళితే యూరియా లేదని చెబుతున్నారని వాపోయారు. దీంతో ఆగ్రహించిన రైతులు పట్టణంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను మూసివేయించారు. చదువు రాక, ఆండ్రాయిడ్ ఫోన్లు లేక యాప్ లో యూరియా బుక్ చేసుకోలేకపోతున్నామని రైతులు తెలిపారు. యూరియా వచ్చిందని తెలిసిన నిమిషంలోనే యాప్ లో స్టాక్ అయిపోయిందని చూపిస్తోందని, దళారులే యూరియాను బుక్ చేసుకుని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి రైతులకు నేరుగా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సెల్ ఫోన్లు చూపిస్తూ రైతులు నిరసన తెలిపారు. సకాలంలో యూరియా అందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, భూపాల్ పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు పెద్దపీట

- **కొండా సురేఖ, జి. చిన్నారెడ్డి వ్యవహారంపై అధిష్టానానికి నివేదిక**
- **నాగర్ కర్నూల్ ఎంపీ,డాక్టర్ మల్లు రవి**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 03, (వుదయం బ్యూరో):**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. గురువారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ మంత్రి కొండా సురేఖ, డాక్టర్ జి. చిన్నారెడ్డికి సంబంధించిన వ్యవహారాలపై క్రమశిక్షణా చర్యల కమిటీ విచారణ జరిపిందని తెలిపారు. విచారణ అనంతరం వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ పార్టీ అధిష్టానానికి నివేదిక సమర్పించినట్లు వెల్లడించారు. పార్టీ పదవి, స్థాయి, సీనియారిటీతో సంబంధం లేకుండా క్రమశిక్షణా నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని స్పష్టం చేశారు.కమిటీ సిఫార్సుల మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించి, గవర్నర్‌కు సిఫార్సు చేసినట్లు మల్లు రవి తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

**#మహిళలకు కీలక పదవులు**

మరోవైపు పాలన, ప్రజా పరిపాలనలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని మల్లు రవి తెలిపారు. గద్వాల్ విజయలక్ష్మిని క్యాబినెట్ మంత్రి హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, నెరెళ్ల శారదను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా, జి. సుధారాణిని వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా నియమించినట్లు చెప్పారు.ఈ నియామకాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు సెప్టెంబర్ 3న జారీ అయ్యాయని,సుధారాణి కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్రమశిక్షణ, పార్టీ విధానాల పట్ల నిబద్ధత అవసరమని మల్లు రవి పేర్కొన్నారు. అదే సమయంలో కీలక నిర్ణయాధికార పదవుల్లో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించడాన్ని స్వాగతించారు. క్రమశిక్షణకు కట్టుబాటు, మహిళలకు సముచిత ప్రాతినిధ్యం, ప్రజా పాలనకు ప్రాధాన్యమనే లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.



# పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- **సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**

**గద్వాల్, సెప్టెంబర్ 02 (వుదయం కరస్పాండెంట్)**



జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రశాంత వాతావరణం లో నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బి. రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా వి. ప్రదీప్ కుమార్, బి. చంద్రకాంత్, కార్యదర్శిగా టి. శేఖర్, జాయింట్ సెక్రటరీగా ఎ.వై. ప్రసాద్, ట్రెజరర్‌గా శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. భీమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వై. జమ్మన్న, హనుమంతు, కె. దివ్యవాణి, జి. నాగమణి, బి. గజేంద్ర, డి. అంజనేయులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అసోసియేషన్ సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి వేదికగా పనిచేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందిస్తూ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం కృషి చేయాలన్నారు.విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అసోసియేషన్ చొరవ చూపాలని తెలిపారు. అదే సమయంలో పోలీస్ శాఖ క్రమశిక్షణ, ప్రతిష్టకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, ఐక్యత ప్రధాన లక్ష్యాలుగా నూతన కార్యవర్గం పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయ వారధిగా నిలిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# అస్తవ్యవస్తంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ



గోశాల రోడ్డులో అనుమతులు లేకుండానే నిర్మించిన ప్రహరి గోడనిర్మాణం



ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

- **పత్తా లేని టీపీఓ**
- **విచ్చల విడిగా మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు**
- **అనుమతులు రాకుండా అక్రమ వెంచర్ల నిర్మాణం**
- **హెచ్ఎండిఏ అనుమతులు రాకుండానే విచ్చల విడిగా వెంచర్ల నిర్మాణం**

**ఇబ్రహీంపట్నం , సెప్టెంబర్ 3 :**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ రోజు రోజుకు అస్తవ్యస్తంగా మారుతుంది. మున్సిపాలిటీలో సరైన అధికారులు లేకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలో విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అదుపు చేయాల్సిన అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. మున్సిపాలిటీలో టీపీఓ సెక్షన్ (టౌన్ ప్లానింగ్ అధికారులు )ఎవరు లేకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని విచ్చల విడిగా హెచ్ఎండిఏ నుంచి అనుమతులు రాకుండానే వెంచర్లు వెలుస్తున్నాయి.

**పత్తా లేనిటౌన్ ప్లానింగ్ అధికారి...**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో టీపీఓగా దినేష్ ఉన్నన్ని రోజులు కొంత నిర్మాణాలు నియంత్రణలో ఉన్నప్పటికి ఆయన బదిలీపై వెళ్లినప్పడి నుండి టీపీఓ స్థానంపై ఎవరు లేక పోవడం గమన్హారం. అనంతరం 15 రోజులు వికాస్ అనే అధికారి టీపీఓగా వచ్చినప్పటికి ఆయన పత్తా లేకుండా పోవడం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు విచ్చల విడిగా వెలుస్తున్నాయి. మంచాల రోడ్డు పరిధిలో కొత్తగా అక్రమ వెంచర్ సీతారంపేట్ సమీపంలో బైపాస్ రోడ్డులోఅనుకోని అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. వీటిని నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

**గోశాల రోడ్డులో అస్తవ్యస్థంగా నిర్మాణాలు...**

కటికన (గోశాల)కు వెళ్లే రోడ్డులో విచ్చల విడిగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరి గోడ సుమారు 2 ఎకరాల నుంచి 3 ఎకరాల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. చట్టు ప్రహరి గోడ నిర్మించిన మున్సిపాలిటీ పరిధిలో బెస్మెంట్‌లు నిర్మించిన అనుమతులు తప్పని సరి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గురునానక్ కళాశాల ముందు అక్రమ హాస్టళ్ల నిర్మాణం గురునానక్ కళాశాల ముందు నూతనంగా అక్రమంగా హాస్టళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అనుమతులు లేని నిర్మాణాలపై మున్సిపాలిటీ పరిధిలో చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు. అక్రమ వెంచర్ల పూరేత వివరాలు వుదయం పత్రికలో త్వరలో ప్రచురించబడుతాయి.

# మధ్యలోనే ఆర్టీసీ బస్సు మొరాయింపు.. ప్రయాణికుల అవస్థలు

- **అచ్చంపేట ఆర్టీసీ బస్సు దుస్థితిపై ప్రయాణికుల ఆగ్రహం**
- **టికెట్ మిషన్ కూడా పనిచేయక.. చిన్నారులు, వృద్ధులతో నానా ఇబ్బందులు**

**అచ్చంపేట సెప్టెంబర్ 3, (వుదయం ప్రతినిధి )**



ఆర్టీసీ బస్సుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు అచ్చంపేట డిపోకు చెందిన బస్సు పరిస్థితి నిదర్శనంగా మారింది. దూరప్రాంత ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన బస్సులు కనీసం సరైన కండిషన్‌లో ఉన్నాయా? లేదా? అని పరిశీలించకుండా నడిపిస్తుండటంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన టిఎస్ 31 టి 6762 బస్సు హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోనే రాత్రి 8 గంటల 30 నిమిషాల సమయంలో మొరాయించింది. అప్పటికే సుమారు 40 నిమిషాల పాటు బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు, బస్సు రావడంతో అందులో ఎక్కి కూర్చున్నారు. అయితే కొద్దిసేపటికే బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్ స్వల్ప మరమ్మతులు చేసి బస్సును ముందుకు నడిపించారు.

ప్రయాణికులు ఊపిరి పీల్చుకునేలోపే రాత్రి దాదాపు పది గంటల సమయంలో సంతోష్‌నగర్ వద్ద టికెట్లు జారీ చేసే మిషన్ కూడా పనిచేయడం ఆగిపోయింది. దీంతో టికెట్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం మరో బస్సు కోసం వేచి ఉండాల్సి రావడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఇతర ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

నిర్లక్ష్యానికి ప్రయాణికులే బలి?

దూరప్రాంతాలకు నడిపే బస్సులను డిపో నుంచి బయటకు పంపే ముందు వాహనం కండిషన్, బ్రేకులు, ఇంజిన్‌తో పాటు టికెట్ యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన బాధ్యత ఉంది. కానీ అలాంటి కనీస తనిఖీలు లేకుండానే బస్సులను రోడ్డెక్కిస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు మండిపడుతున్నారు.

ఒకే ప్రయాణంలో బస్సు మొరాయించడం.. ఆ తర్వాత టికెట్ మిషన్ పనిచేయకపోవడం ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ తీరుపై అనేక ప్రశ్నలు తలెత్తేలా చేసిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను పట్టించుకోకుండా బస్సులను నడిపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలి**
- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 03 (వుదయం బ్యూరో)**



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,49,282 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 36 వేల మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కొంతమంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాలతో అర్హులైన వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు.. బీఎల్ఓలకు సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా ఏ, బీ, సీ కేటగిరీలకు చెందిన ఓటర్లు సమర్పించాల్సిన ధ్రువపత్రాలపై ఎన్నికల సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పిస్తూ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 5న మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల విభాగం అధికారులను ఆదేశించారు .ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోహిర్ మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థుల అధ్యయనోత్సవం

- **"పౌర సేవలు, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన"**

**కోహిర్ సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి )**




కోహిర్ పట్టణంలోని ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు మున్సిపల్ కార్యాలయాన్ని విద్యా సందర్శన (ఎడ్యుకేషనల్ విజిట్ ) లో భాగంగా సందర్శించారు. స్థానిక స్వపరిపాలన పనితీరు, పౌర సేవలు మరియు పట్టణ పరిపాలన వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడమే ఈ సందర్శన ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ కమిషనర్ సి. శశిధర్ విద్యార్థులకు మున్సిపాలిటీలోని వివిధ విభాగాలను చూపుతూ, పట్టణంలో నిత్యం నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలు, రక్షిత త్రాగునీటి సరఫరా వ్యవస్థ మరియు వీధి దీపాల నిర్వహణ తీరుతెన్నులను సుదీర్ఘంగా వివరించారు. పౌరులకు అందించే జనన మరణ ధృవపత్రాల జారీ విధానం, గృహ నిర్మాణ అనుమతుల ప్రక్రియ, ఇంటి మరియు ఆస్తి పన్నుల వసూలు, అలాగే వృత్తి & వ్యాపార లైసెన్సుల మంజూరు విధానాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డంపింగ్ యార్డ్‌లో పట్టణం నుండి సేకరించిన తడి, పొడి చెత్త విభజన మరియు సేంద్రియ వ్యర్థాల నుండి కంపోస్ట్ ఎరువు తయారు చేసే ప్రక్రియను వివరించి, వ్యర్థాల నిర్వహణ ప్రాముఖ్యతను తెలియజేశారు.పరిశుభ్రమైన సమాజ నిర్మాణం ప్రతీ పౌరుడి బాధ్యత అని, పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణ మరియు పరిశుభ్రత అలవాట్లను పెంపొందించుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్. మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఇటువంటి ప్రత్యక్ష విద్యా సందర్శనలు ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై లోతైన అవగాహనను ఇస్తాయని కొనియాడారు. విద్యార్థులు ప్రజా పాలనలోని అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్. వైస్ చైర్మన్ అన్వర్ జావీద్ కౌన్సిలర్. లు అనసూయ జగదీశ్. శిరీష , పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## నవోదయలో ప్రవేశాలకు
# దరఖాస్తుల ఆహ్వానం

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 03, వుదయం ప్రతినిధి:**



వట్టెం నవోదయ విద్యాలయంలో 2027-28 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం 8, 10వ తరగతులు చదువుతున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రిన్సిపల్ పూర్ణిమ తెలిపారు. ప్రవేశ పరీక్షను 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



## బస్సు డ్రైవర్ ను సన్మానించిన
# కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు

**అచ్చంపేట, సెప్టెంబర్ 03: (వుదయంప్రతినిధి )**

సకాలంలో బస్సును నడుపుతూ విధులకు హాజరయ్యేలా చేరవేస్తున్న ఆర్టీసీ ప్రైవేట్ బస్సు డ్రైవర్ నరేష్ ను కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.ప్రతిరోజూ ఉద్యోగులను, ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానానికి చేరుస్తున్న డ్రైవర్ నరేష్ సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అచ్చంపేట బస్టాండ్ లో శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ.. సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ నరేష్ ను అభినందిస్తున్నామని తెలిపారు.



# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన

- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం తనిఖీ చేశారు. ఈవీఎంల నెలవారీ సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోడౌన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ల భద్రతకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. గోడౌన్ భద్రత, నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో
# రైతులకు దక్కిందేమీ లేదు



- **బిజినపల్లిలో బి ఆర్ ఎస్ ఆందోళన**

**బిజినపల్లి, సెప్టెంబర్ 02 (వుదయం ప్రతినిధి):**

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వ్యవసాయ విధ్వంస పాలనకు నిరసనగా బి ఆర్ ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను బి ఆర్ ఎస్ శ్రేణులు ముట్టడించారు.ఈ సందర్భంగా మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.1000 రోజుల పాలనలో రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు ఎక్కడ? రైతు బీమా, పంట బీమా, రైతు బంధు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు బోనస్, కొనుగోలు కేంద్రాలు, యూరియా సరఫరా, సరైన సాగునీరు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బిజినపల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "అనారోగ్యంతో మాహిళ మృతి"

**ఝరాసంగం-సెప్టెంబర్-3 (వుదయం.ప్రతినిధి )**



ఝరాసంగం మండలపరిధిలోని గంగాపూర్ గ్రామంలో ఉపసర్పంచ్ గారి కుటుంబ పెద్ద మృతితో గ్రామంలో విషాదఛాయలు నిండాయి.గ్రామానికి చెందిన బి. నర్సమ్మ.(60.సం) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ రోజు ఉదయం 1గంటకు,తుది శ్వాస విడిచారు.ఆమెకు ఒక కుమారుడు,ఒక కూతురు,ఇద్దరు మనుమండ్లు,ఒక మనుమరాలు ఉన్నారు.ఈ విషయం తెలిసిన గ్రామ సర్పంచ్:షహజద్ బీ.గారు, యువనాయకుడు ఇమ్రాన్ పటేల్,మాజీ సర్పంచ్:శివరాజ్ పటేల్.గారు,మాజీ సర్పంచ్:చంద్రశేఖర్ పాటిల్.గారు,ఉపసర్పంచ్ గారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ఓదార్చడం జరిగింది.వారికుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలపడం జరిగింది.సాయంత్రం 5గంటలకు జరిగిన అంతిమ యాత్రలో ,గ్రామ సర్పంచ్ తో పాటు,గ్రామ పెద్దలు ,గ్రామ ప్రజలు, బంధువులు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్





## సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
# ఆకస్మిక తనిఖీ

**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 3 (వుదయం):**
రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మరియు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత,

ల్యాబొరేటరీ సేవలు, ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అందుబాటులో ఉన్న అన్ని సేవలను ప్రజలకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సూచించారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం





- **గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద మాజీ మంత్రికి బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 3 (వుదయం):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు నిరసన కార్యక్రమాలకు వెళ్తున్న హరీశ్‌రావుకు గురువారం గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో హరీశ్‌రావు మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతు బీమా, రైతుబంధు పథకాల విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు. దేవుళ్లపై ఒట్లు పెట్టి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సుమారు 300 రోజులు ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించామని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు మందగించాయని అన్నారు. రాష్ట్రంలోని రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి రహదారుల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.
రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, మురళి, చక్రపాణి, సంజీవరెడ్డి, కిషన్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అనంతారం సర్పంచ్ శ్రీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మంగయ్య, సూర్యనారాయణ, గోపాల్, సాయిరెడ్డి, కౌశిక్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణలో
# సీసీ కెమెరాల పాత్ర కీలకం

- **శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్**

**జిన్నారం. 3 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి )**
Tamilఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ గురువారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో 103 కెమెరాలు ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో భద్రతను మరింత పటిష్టం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, పర్యవేక్షణకు సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడనున్నాయన్నారు. పోలీసులకు సత్వర నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని పోలీసు శాఖ తరఫున అందజేశారు. పారిశ్రామికవాడలో ట్రాఫిక్ నియంత్రణకు పలు సూచనలు చేశారు. పక్కాగా మహిళల భద్రత నిఘా వ్యవస్థను పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.
ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ సిఐ సుధీర్ కుమార్ ఎస్సై అక్షిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆనందరావు మెంబర్ రాయుడు విద్యావేత్తలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి లో ఘనంగా కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీ

- **ఉప్పల్ డిపో వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**
- **1000 రోజుల కాంగ్రెస్ పరిపాలన అభివృద్ధికి, పేదల సంక్షేమానికి సాక్ష్యం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదు**
**బిఆర్ఎస్ నిరసన ధర్నాలపై వజ్రేష్ యాదవ్ ఫైర్**

**మేడిపల్లి వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 03.**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పరిపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయి ప్రియ కాలనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఉప్పల్ డిపో వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఉప్పల్ డిపో వద్ద బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 50 అడుగుల భారీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు
తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.





ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ చేసిన అప్పుల ఊబి నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, కొత్త పెన్షన్లు వంటి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రికార్డింగ్ డాన్స్ వేసి చూపించడం తప్ప ప్రజలకు మల్లారెడ్డి చేసింది ఏమీ లేదని, చిత్తశుద్ధి ఉంటే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బహిరంగ చర్చకు సిద్ధమని ఉద్దేశం యాదవ్ సవాల్ విసిరారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ గా మారిన కేసీఆర్ ప్రభుత్వం, బి ఆర్ ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, పదేళ్ల తమ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప బిఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని తుంగతుర్తి మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అజయ్ యాదవ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి,బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు, బొమ్మక్ కళ్యాణ్, పోగుల దిలీప్ రెడ్డి,వంగేటి ప్రభాకర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బాచుపల్లి మండల కార్యాలయం ముట్టడి...

- **6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ధర్నా**

**బాచుపల్లి, సెప్టెంబర్ 3, (వుదయం ప్రతినిధి ),**
బాచుపల్లి మండల కార్యాలయం వద్ద గురువారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం తమ డిమాండ్లపై ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు.
కాంగ్రెస్ 420 హామీల మోసాన్ని ప్రశ్నిద్దాం, 1000 రోజుల దగా పాలనను నిలదీద్దాం అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కేటీఆర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.
ఎన్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ శనిగల ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ ధర్నాలో మాజీ కార్పొరేటర్లు మేకల వెంకటేష్, కాసాని సుధాకర్, రవి కిరణ్, బాలాజీ నాయక్, గాజుల సుజాత, ఆగం రాజు, జ్యోతి నరసింహ రెడ్డి. కోఆప్షన్ సభ్యులు సలీం, అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నందిగామ మాజీ ఎంపీటీసీ సత్తన్న, బాచుపల్లి మాజీ వార్డు సభ్యులు, నిజాంపేట్ మాజీ వార్డు సభ్యులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నాయకత్వంలో
# తెలంగాణకు నూతన దిశ





**షాద్‌నగర్ , సెప్టెంబర్ ,3 (వుదయం ప్రతినిధి )**
ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో షాద్‌నగర్ అభివృద్ధికి కొత్త ఊపిరి - 1000 రోజుల కాంగ్రెస్ పాలన ప్రజల నమ్మకానికి నిదర్శనం: మాజీ ZPTC తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డితాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అతిపెద్ద బలం. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండగా, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి అభివృద్ధికి మరింత వేగం తీసుకొస్తోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అందించడమే మా లక్ష్యం. ప్రజల ఆశీస్సులతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తాం."తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్‌నగర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ZPTC తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ర్యాలీలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కళావతి నగర్‌లో
# మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 3 ,(వుదయం ప్రతినిధి ),**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 291వ డివిజన్ షాపూర్ నగర్ పరిధిలోని కళావతి నగర్‌లో మల్టీపర్పస్ హాల్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి రూ.18 లక్షల నిధులతో నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కళావతి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పలకృష్ణ, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ సెక్రటరీ సంతోష్, గాదె వినోద్, కాలనీ సీనియర్ నాయకులు రజితా రత్నం, రజాక్, కృష్ణ, బుచ్చయ్య పతి, అచ్చమ్మ, నరసమ్మ, సంపంగి వెంకటేష్, అరుణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి చైతన్య హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





- **ఆకట్టుకున్న చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణ – ఉట్టి కొట్టిన బి.చరణ్ తేజ**

**చేవెళ్ల,సెప్టెంబర్3 (వుదయం)**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి చైతన్య హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సరీ నుంచి యూకేజీ వరకు చదువుతున్న చిన్నారులు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వివిధ రకాల వేషధారణలతో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. వేడుకల్లో భాగంగా యూకేజీ విద్యార్థి బి.చరణ్ తేజ ఉట్టి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తోటి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.ఉట్టి కొట్టి పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, పాఠశాల యాజమాన్యం నుంచి శభాష్ అనిపించుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ..పాఠశాలలో ప్రతి పండుగను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకుంటూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల్లో సంప్రదాయాలు, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయని తెలిపారు.

# శంకర్‌పల్లి మండలం రావులపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన

- **పదో తరగతి విద్యార్థులకు డీటీ వ్యాక్సిన్లు వేసిన వైద్య సిబ్బంది**

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 03 (వుదయం)**
శంకర్‌పల్లి మండలం రావులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో జ్వరాలు, జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్లు తదితర వ్యాధులు వ్యాపించే



అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని తాగడం, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులకు తెలియజేసి వైద్యులను సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించగలరని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించాలని సూచించారు. సరైన వయసులో అవసరమైన టీకాలు తీసుకోవడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారిన పడకుండా ముందస్తు రక్షణ పొందవచ్చని తెలిపారు. పా విద్యార్థులు తమ ఇళ్లలో కూడా ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విషయాలను తల్లిదండ్రులకు తెలియజేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చైతన్యం కల్పించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంతి, రేష్మ బేగం, చంద్రకళతో పాటు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు డీటీ వ్యాక్సిన్లు అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని వారు కోరారు.


**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM-CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O. P. No. 1156 of 2026**
**Between :**
Nagaram Pravalika @ Bandi Pravalika & Others .....Petitioners
**AND**
G.Tulsiram & Others .....Respondents
To:
1. G.Thulsiram, S/o Goudi Dayanand, Aged 32 Years, Occ:Driver, R/o H.No.52-218/4, Polala Basthi, Maqdumnagar, Jagadgirigutta, Qutubullapur, Medchal-Malkajgiri District. ...Respondent No.1
2. Uppala Swathi, W/D/o Not known, Aged:Major, Occ:Not Known, R/o H.No.53-10/1, Polala Basthi, Maqdumnagar, Jagadgirigutta, Balanagar Township, Medchal-Malkajgiri District-500037 ...Respondent No.2
Take notice that the Petitioner filed the above-mentioned case against you and your Insurer for grant of compensation and the same stands posted for your appearance on 08-10-2026 at 10.30 AM in the above said Court, either in person or through an advocate, failing which the matter will be heard and decided ex-parte.
**(BY ORDERS OF THE COURT)**
**Sd/-**
**A.SATYANARYANA, Advocate, Kachiguda, Hyderabad Cell:9440061524.**



**IN THE COURT OF THE MVACT CUM CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O. P. No. 558 of 2026**
**Between :**
IPL India P Ltd., ... Petitioner
**AND**
Indian Auto Servicing Centre & others ... Respondents
To,
Indian Auto Servicing Centre Rep By S Bhupal Reddy Age : Major, Occu : Business R/o Plot No.6, Door No.6-111, Chintal Medchal, Hyderabad
Please take notice that the petitioner above named filed the above case against you for grant of compensation for the damages caused to his Car bearing No. TS 09 EV 3896 in a motor vehicle accident occurred on 11.09.25 under the limits of PS RGI Airport which was caused by your Bus bearing No. TS 07 UM 5949 . The above case is posted to 30.09.2026 at 10.30 AM in the court above mentioned for your appearance either in person or through an Advocate failing which the matter will be decided by setting you exparte
**( BY ORDER OF THE COURT )**
Date : 04-09-2026
Place : Hyderabad **Sd/-**
**Smt. B.Roja Ramani Advocates G.JAGANNAADH Mo PLOT NO: 81, PRT COLONY HASTEENAPUR Hyderabad. m 9848922144 / 9848064539**




క్రికెట్‌ను ఒక ఆటగానే చూడాలి...

భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు చాలా మంది విపరీతమైన హైప్ తీసుకొస్తారు. క్రికెట్‌ను ఓ ఆటగానే చూడాలని కోరుతా. అందుకు అతీతంగా వెళ్లొద్దని చెబుతా. ప్రజలకు చాలా ఖాళీ సమయం ఉన్నట్లుంది. వారు ఎందుకు అర్థం చేసుకోవడం లేదో? ఇది కేవలం ఒక మ్యాచ్ మాత్రమే. చివరికి ఎవరో ఒకరు గెలవాలి. మరొకరు ఓడిపోవాలి. తర్వాత మ్యాచ్ కోసం సన్నద్ధమవ్వాలి. ఎప్పుడో 1970ల నుంచి ప్రతీకారం అంటూ ఇప్పటికీ అలానే ఆలోచించడం సరికాదు. ఖాళీగా ఉండే మనసు చెడు ఆలోచనలకు నిలయం అన్నట్లుగా కొందరి పరిస్థితి ఉంది.

**- వసీం అక్రమ్, పాకిస్తాన్ మాజీ క్రికెటర్**

## వేమన పద్యం



గొడ్డుటావు బదుక గుండ గొంపోయిన
పాలనీక తన్ను పండ్లురాల
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ! వినుర వేమ!

## సంపాదకీయం

# అయ్యో.. అన్నదాత...

ఆకాశంలో మేఘాలు గర్జిస్తున్నాయి. వాన జల్లులు పడుతున్నాయి. క్లౌడ్ బరస్ట్ అవుతున్నాయి. కానీ నేల తడవాల్సి నంతగా, చెరువులు నిండాల్సి నంతగా, పంటలకు ఊపిరిపోసేంతగా వానలు లేవు. ఆగస్టులో అంతంత మాత్రంగానే మురిపించిన వర్షాలు.. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణశాఖ తాజా అంచనాలు కలవరం పుట్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. జలవనరులు అడుగంటడంతో పాటు తాగునీటి సరఫరాపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది.

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దేశంలో బలహీన రుతుపవనాలు, తీవ్రమైన ఎండలు ఉంటాయని ముందస్తు అంచనాలు వెలువడ్డాయి. ఆ అంచనాలను తిప్పి కొడుతూ తెలంగాణలో వానా కాలం సీజన్ ఆరంభంలో వర్షాలు మురిపించాయి. ఆ తర్వాత జులైలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల వచ్చిన వరదలతో రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు నీటితో కళకళ లాడాయి. ఒక ప్రాంతంలో భారీ వర్షాలు, మరో ప్రాంతంలో వర్షాభావం అనే అసమాన వర్షపాతాలు నమోదయ్యాయి. ఆ సంతోషంలో రైతులు బావులు, కాలువల పరిధిలో వరి, పత్తి, తదితర పంటలు సాగు చేశారు. వర్షాభావం, ఎల్‌నినో వల్ల వాణిజ్య పంటలు సాగు చేయాలని అధికారులు సూచించినా రైతులు వరికే మొగ్గు చూపారు.

65 లక్షల ఎకరాల అంచనాకు గాను 45 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. పత్తి 48 లక్షల ఎకరాల్లో వేశారు. మధ్యలో విరామం ఇచ్చినా.. ఆగస్టులో అక్కడక్కడ మురిపించిన వర్షాలతో మరికొన్ని లక్షల ఎకరాల్లో వరి పంట సాగైనా ఆశించిన రీతిలో వానలు లేక సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. వేసిన పంటను కాపాడుకోవడం ఎలా అని అన్నదాత కన్నీరుమున్నీరు అవుతున్నాడు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఇప్పటికే రైతాంగం కనీవినీ ఎరుగని రీతిలో ప్రమాదం ఎదుర్కొంటున్న దశలో వాతావరణం కూడా మొహం చాటేయడం రైతును మానసికంగా, ఆర్థికంగా కుంగదీస్తోంది. రుతుపవనాల విషయంలో చోటు చేసుకున్న వర్షాభావం వానాకాలం సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దేశవ్యాప్తంగా ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు మూడు శాతానికి పైగా తగ్గింది. తెలంగాణ లో వరి సాగుపై మొగ్గు చూపినా.. వర్షాలు లేకపోతే ఎంతవరకు దిగుబడి అవుతుందనేది అనుమానమే. జూన్, జులై, ఆగస్టు నెలలో కురవాల్సిన దానికంటే 17 శాతం వర్షపాతం తక్కువగా పడింది. 33 జిల్లాలకు గాను 25 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. నీరు లేక చాలాచోట్ల భూములు నెర్రెలు బాసాయి. పశువులను మేపుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఇలాగే వర్షాభావం కొనసాగితే ఆహార భద్రత, రైతుల ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేశామని, రైతుల ఆదాయాన్ని పెంచుతున్నామని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తోంది. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ సర్కారూ రైతులను ఆదుకుంటున్నా మని చెపుతోంది. కానీ వాస్తవ పరిస్థితుల్లో వర్షాధార పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎలాంటి సాయాన్ని అందిస్తామన్న భరోసాను రైతులకు చూపడం లేదు. సన్నచిన్న కారు రైతాంగం వ్యవసాయాన్ని వదులుకోవాల్సిన పరిస్థితులను కేంద్రం సృష్టిస్తోంది. 25 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదై పంటలు ఆందోళనకరమైన పరిస్థితులు ఏర్పడినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదు. తూతూమంత్రంగా సమీక్షలు తప్ప ప్రత్యామ్నాయ చర్యలకు దిగడం లేదు. ప్రత్యామ్నాయ నీటి వనరులు ఎంతవరకు అందు బాటులో ఉన్నాయి? పంట నష్టానికి పరిహారం ఎంత వేగంగా అందుతోంది? సాగు విస్తీర్ణం తగ్గుతున్నప్పుడు రైతులకు రక్షణ చర్యలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఆకాశం వైపు కళ్లలో చూసే కుని చూస్తున్న అన్నదాతకు ప్రభుత్వం భరోసానివ్వకుంటే ఈ వర్షాభావం తీవ్ర ప్రతి కూల సామాజిక ఆర్థిక అసమానతలకు దారితీయడం ఖాయం.

ప్రభుత్వం ప్రకటించే లక్ష్యాలు ఒకవైపు.. క్షేత్రస్థాయిలో రైతు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితి మరోవైపు ఉన్నప్పుడు... కేవలం విధాన ప్రకటనలతో వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడం కష్టం. ఈ అసాధారణ పరిస్థితుల్లో రాష్ట్రంతో పాటు కేంద్రప్రభుత్వము యుద్ధప్రాతిపదికన స్పందించాలి. సాంప్రదాయ ఉపశమన చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకెళ్లాలి. పంటల బీమా, పరిహారాలను అందించాలి. కరువు బారిన పడిన ప్రతి ఎకరానికి సకాలంలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో పంచాలి. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇస్తూనే, మిగిలిన నీటిని ఆయకట్టు చివరి భూములకు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో రైతులకు సలహాలు, సూచనలందించాలి. రైతులు తీసుకున్న సహకార, బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు, కొత్త రుణాలను సులభంగా అందించేలా బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలివ్వాలి.

### రచనలు పంపండి

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# క్షౌర వృత్తినీ వదలని కార్పొరేట్

తనఇష్టులైన బడా వ్యాపారులకు, పారిశ్రామిక వేత్తలకు మోడీ ప్రభుత్వం అనేక రాయితీలు ఇవ్వడమే కాకుండా , బ్యాంకులు కూడా వారు తీసుకున్న అప్పులను నామమాత్రపు చెల్లింపులతో బ్యాంకులు సరిపెడుతున్నాయి. అందులో భాగమే జీ మీడియా సంస్థ వ్యవస్థాపకులు సుభాష్ చంద్రకు బ్యాంకులు ఇచ్చిన రైట్ ఆఫ్ (రైట్ ఆఫ్ అంటే ఒక కంపెనీ లేదా బ్యాంకు రాబట్టుకో లేని బాకీలు ,నష్టపోయిన ఆస్తులు లేదా వసూలు కాని రుణాలను తమ లెక్కల పుస్తకం నుంచి స్పష్టంగా తొలగించడం) మరియు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇచ్చిన ఎయిర్ కట్ తీర్పు.

జీ మీడియా వ్యవస్థాపకులు, ఎస్సెల్ గ్రూపు అధినేత సుభాష్ చంద్ర వివిధ కంపెనీల రుణాల కోసం బ్యాంకులకు వ్యక్తిగత గ్యారంటీ ఉన్నారు. ఈ కంపెనీలు 22,006 కోట్ల రుణాలు తీసుకున్నాయి. తాము దివాల తీశామనే పేరుతో ,బ్యాంకుల రుణాలు తీర్చలేమని ఆ కంపెనీలు చెప్పడంతో, బ్యాంకులకు హామీ దారుగా ఉన్న సుభాష్ చంద్ర 22 వేల కోట్లు చెని చెల్లించమని కోరాయి. అంతే కాకుండా సుభాష్ చంద్ర ఇచ్చిన వ్యక్తిగత గ్యారంటీపై ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ (ప్రస్తుతం సమ్మాన్ క్యాపిటల్) మొదటిసారి గా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో దివాలా ప్రక్రియ కింద 2022లో పిర్యాదు చేసింది. ఆ తర్వాత బ్యాంకులు కూడా అందులో భాగస్వామ్యం అయ్యాయి.

నేషనల్ కంపెనీల లా ట్రిబ్యునల్ విచారణలో సుభాష్ చంద్ర వ్యక్తిగత నికర ఆస్తి విలువ 31.79 కోట్లుగా నమోదు అయ్యింది. ఆయన సమర్పించిన రీ పేమెంట్ ప్లాన్ ప్రకారం ఆయన దగ్గర మిగిలిన నికర ఆస్తుల విలువ 6.5 కోట్ల రూపాయలేన్న దాన్నిఎన్ సి ఎల్ టి అంగీకరించి ఆ మొత్తాన్ని రుణ దాతల సెటిల్మెంట్ కోసం కేటాయించినట్లు ప్రకటించింది. ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైయ్యాయి. సామాన్యుడు చిన్న లోను కట్టకపోతే ఆస్తులు జప్తు చేసే బ్యాంకులు, కార్పొరేట్ పెద్దలకు వేల కోట్లు ఎలా వదిలివేస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమకు రావాల్సిన వేలాది కోట్ల రూపాయల బకాయిలకు గాను ఈ మొత్తం చాలా తక్కువని భావిస్తూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , కెనరా బ్యాంక్ , HDFC బ్యాంక్ , ఎల్ ఐ సి హౌసింగ్ ఫైనాన్స్ వంటి బ్యాంకులు నేషనల్ కంపెనీల లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (NCLAT) కి వెళ్లాయి. ఎన్ సీ ఎల్ టి ఇచ్చిన తీర్పుపై తాజాగా NCLAT స్టే విధించింది.



ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. వివిధ కంపెనీల్లో సుభాష్ చంద్ర వాటాలు: 2015 2018 సంవత్సరాల మధ్య ఆయన ఆస్తుల విలువ 25 వేల నుండి 40 వేల కోట్ల దాకా ఉంది. అంత ఆస్తి కలిగిన వ్యక్తికి నష్టాలు వచ్చినా, ప్రస్తుతం ఆయన ఆస్తి 6.5 కోట్ల రూపాయలకే పరిమితమైంది అంటే నమ్మ లేని పరిస్థితే. ఇప్పటికీ వివిధ కంపెనీల్లో సుభాష్ చంద్ర కి వాటాలు ఉన్నాయి. ఎస్సెల్ గ్రూపులో 3.99% వాటా ఉంది. ఆ వాటా విలువ సుమారు 400 కోట్ల రూపాయల దాకా ఉంది. జీ మీడియా కార్పొరేషన్ న్యూస్ ఛానల్స్ నడిపే సంస్థలో 14.72 శాతం వాటా ఉంది. ఎస్సెల్ గ్రూపుకు చెందిన కేబుల్ టీవీ సంస్థ అయిన సి తి నెట్ వర్క్స్ లో సుభాష్ చంద్ర గ్రూపుకు 22% వాటా ఉంది. ఆ వాటా విలువ దాదాపు 850 కోట్లు.ఇంకా అనేక కంపెనీల్లో వందల కోట్ల విలువ చేసే వాటాలు ఉన్నాయి. అలాంటప్పుడు ఆయన ఆస్తి విలువ 6.5 కోట్లుగా ఉండాన్ని ఎలా నమ్మాలి. బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు దివాలా పేరు చెప్పి బ్యాంకులు ఇచ్చిన రుణాలను ఎగ్గొడుతున్నారు. ఇందుకు పాలకులు, అధికారులు సహాయ పడుతున్నారు. సుభాష్ చంద్ర ఆర్థిక మోసాలు: ఈయన పైన,ఆయన కుమారుని పైన ఆర్థిక మోసాలు, నిధులు మల్లింపునకు సంబంధించిన దానిపై మార్కెట్ రెగ్యులేటర్ సెబి దర్యాప్తు జరుపుతోంది. జీ ఎంటర్ టైన్ మెంట్ ( ZEEL) నుంచి ప్రమోటర్లకు చెందిన ఇతర ప్రైవేట్ కంపెనీలకు నిధులు మల్లించారని సె బీ దర్యాప్తులో తేలింది. ఇందు కోసం కొన్ని నకిలీ నిధుల రికవరీ పత్రాలను సృష్టించారని ఆరోపణలు ఉన్నాయి మోసపూరిత వ్యవహారాల కారణంగా ఆయనను,ఆయన కుమారుడు పుతిన్ గోయెంకాలను లిస్టెడ్ కంపెనీల్లో ఎలాంటి పదవులు చేపట్టకుండా సెబీ నిషేధించింది. కంపెనీకి చెందిన విలువైన స్థిరాస్తులను బోర్డు అనుమతి లేకుండా ప్రమోటర్ల సొంత అప్పుల కోసం అక్రమంగా తాకట్టు పెట్టారనే ఆరోపణలు కూడా రుజువయ్యాయి. సుభాష్ చంద్ర మోదీల అనుబంధం : జీ మీడియా అధినేత సుభాష్ చంద్ర మరియు ప్రధాన మంత్రి మోదీల మధ్య రాజకీయం గాను,వ్యాపారపరంగాను బలమైన సంబంధాలు మరియు సానుకూల వైఖరి ఉన్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో, నరేంద్ర మోదీ ప్రధాని అభ్యర్థిగా ఉన్నప్పుడు సుభాష్ చంద్ర ఆయనకు బహిరంగ మద్దతు ఇచ్చారు. దేశంలో మార్పు తీసుకురాగల ఏకైక నాయకుడని మోదీని ప్రశంసించారు. 2016లో సుభాష్ చంద్ర హర్యాన నుండి స్వతంత్ర అభ్యర్థిగా రాజ్యసభకు పోటీ చేసినప్పుడు మోదీ నాయకత్వాన ఉన్న బీ జే పీ లీగల్ సపోర్టు ఇచ్చి ఆయన విజయంలో కీలక పాత్ర పోషించింది. సుభాష్ చంద్ర, తానే వ్రాసుకున్న ఆత్మకథ 'ది జెడ్' ఫ్యాక్టర్ పుస్తకాన్ని మోదీ స్వయంగా ఆవిష్కరించారు. మోదీ ప్రభుత్వ విధానాలైన డీమోనిటైజేషన్ , స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకు జీ మీడియా గ్రూపు పెద్దఎత్తున సానుకూల కవరేజ్ ఇచ్చింది . అందుకు టిట్టర్( X) వేదికగా మోదీ ప్రశంసించారు . నరేంద్ర మోదీ ప్రభుత్వం 2016లో తీసుకొచ్చిన ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ కోడ్ (IBC) ద్వారా బడా కంపెనీలు దివాలా ( మోసపు దివాలా) తీసినప్పుడు వాటిని పరిష్కరించే ప్రక్రియ ప్రారంభించింది. ఈ ప్రక్రియ లో అసలు బ్యాంకులకు రావాల్సిన బాకీ మొత్తం కంటే , తక్కువ మొత్తానికి సెటిల్మెంట్ కుదుర్చుకుంటారు. ఈ తగ్గిన శాతాన్ని ఎయిర్ కట్ అంటారు. ఈ ఎయిర్ కట్ 70నుండి90% వరకు ఉంటుంది. కొన్ని అరుదైన కేసుల్లో 99% పైగా ఉంటుంది. సుభాష్ చంద్ర కేసు అలాంటిదే. IBC ద్వారా మోదీ ప్రభుత్వం బడా కంపెనీలకు ఆర్థిక ప్రయోజనం కలిగిస్తున్నది. ఎయిర్ కట్ ( అంటే ఆర్థిక సంస్థలు తాము ఇచ్చిన అప్పులో కొంత భాగాన్ని వదులుకోవడం) ద్వారా లబ్ధి పొందిన కంపెనీలు: రిలయన్స్ కమ్యూనికేషన్ ఇన్ ఫ్రాస్ట్రక్టర్ (RCIL): ఇది అనిల్ అంబానీ గ్రూపు. ఈ కంపెనీ దాదాపు 47,251 కోట్లు బాకీ పడగా కేవలం 455 కోట్లకు సెటిల్మెంట్ జరిగింది. అంటే బ్యాంకులకు 99% ఎయిర్ కట్ జరిగింది. వీడియోకాన్ గ్రూపు మొత్తం బాకీ 64,838 కోట్లు అయితే ,బ్యాంకులకు దక్కింది 2,962 కోట్లు మాత్రమే.ఇక్కడ బ్యాంకులు 61 వేల కోట్ల రూపాయల పైగా వదులు కున్నాయి. రిలయన్స్ ఇన్ ఫ్రాటెల్ దాదాపు 42,055 కోట్ల క్లెయిమ్ లకు గాను కేవలం 4,235 కోట్లు మాత్రమే బ్యాంకులకు రికవరీ అయ్యింది. 90% ఎయిర్ కట్ జరిగింది. లాంకొ ఇన్ ఫ్రాటెక్ కు 45 వేల కోట్లు అప్పులు ఉండగా , బ్యాంకులు 88% ఎయిర్ కట్ ఇచ్చాయి. టెక్స్ టైల్ కంపెనీ అలోక్ ఇండస్ట్రీస్ బ్యాంకులకు 29,253 కోట్లు బాకీ పడింది. బ్యాంకులు కేవలం 5,052 కోట్లు మాత్రమే పొందాయి. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (DHFL) ఈ సంస్థ పై 87 కోట్ల బాకీలో ,బ్యాంకులకు లభించింది 32,700 కోట్లు. 63% ఎయిర్ కట్ బ్యాంకులకు జరిగింది. భూషణ్ స్టీల్ కంపెనీకి 56 వేల కోట్లకు పైగా అప్పులు ఉంటే 35,200కోట్లు టా టా కంపెనీ కొనుగోళ్ల ద్వారా చెల్లించింది. ఈ విధంగా అనేక కంపెనీలు లబ్ధి పొందాయి.. బడా కంపెనీలకు ఎయిర్ కటింగ్ తో బ్యాంకులు వదులుకున్న డబ్బులు, ప్రజలు దాసుకున్న డబ్బులే. వారి డబ్బులను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఎయిర్ కట్ చేయడం ప్రజా వ్యతిరేకం .ప్రజల డబ్బులు కంపెనీలకు కట్టబెట్టడమే.దివాలా చూపిన కంపెనీలపై సమగ్ర విచారణ జరపాలి. బ్యాంకులకు కంపెనీలు చెల్లించాల్సిన

నేషనల్ కంపెనీల లా ట్రిబ్యునల్ విచారణలో సుభాష్ చంద్ర వ్యక్తిగత నికర ఆస్తి విలువ 31.79 కోట్లుగా నమోదు అయ్యింది. ఆయన సమర్పించిన రీ పేమెంట్ ప్లాన్ ప్రకారం ఆయన దగ్గర మిగిలిన నికర ఆస్తుల విలువ 6.5 కోట్ల రూపాయలేన్న దాన్నిఎన్ సి ఎల్ టి అంగీకరించి ఆ మొత్తాన్ని రుణ దాతల సెటిల్మెంట్ కోసం కేటాయించినట్లు ప్రకటించింది. ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైయ్యాయి. సామాన్యుడు చిన్న లోను కట్టకపోతే ఆస్తులు జప్తు చేసే బ్యాంకులు, కార్పొరేట్ పెద్దలకు వేల కోట్లు ఎలా వదిలివేస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమకు రావాల్సిన వేలాది కోట్ల రూపాయల బకాయిలకు గాను ఈ మొత్తం చాలా తక్కువని భావిస్తూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , కెనరా బ్యాంక్ , HDFC బ్యాంక్ , ఎల్ ఐ సి హౌసింగ్ ఫైనాన్స్ వంటి బ్యాంకులు నేషనల్ కంపెనీల లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (NCLAT) కి వెళ్లాయి. ఎన్ సీ ఎల్ టి ఇచ్చిన తీర్పుపై తాజాగా NCLAT స్టే విధించింది. ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# కొండా సురేఖపై వేటు.. ఇక ప్రభుత్వాన్ని అడగాల్సిందే!



కొండా సురేఖ పై వేటు.. ఇక ప్రభుత్వాన్ని అడగాల్సిందే!
గవర్నర్‌కు బర్తరఫ్ లేఖ.. బీఆర్ఎస్ చార్జ్ షీట్.. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల ప్రశ్నల వర్షం
పదవిపై కఠిన నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. మరి ప్రజల సమస్యలపై అదే కఠినత్వం ఎప్పుడు?

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం అత్యంత కీలక మలుపు తిరిగింది. సెప్టెంబర్ 3న వచ్చిన తాజా నివేదిక ప్రకారం కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించగా, రాజీనామాకు ఆమె అంగీకరించకపోవడంతో ముఖ్యమంత్రి కార్యాలయం గవర్నర్‌కు బర్తరఫ్ లేఖ పంపినట్లు సమాచారం. ఈ పరిణామం ఒక మంత్రి పదవికి సంబంధించిన వ్యవహారంగా కనిపించినా, దీని వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ అంతర్గత రాజకీయాలు, పార్టీ క్రమశిక్షణ, నాయకత్వ నిర్ణయాధికారం, సామాజిక సమీకరణాలు వంటి అనేక ప్రశ్నలు దాగి ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంలో వెనక్కి తగ్గకుండా కఠినంగా వ్యవహరించినట్లు తాజా కథనాలు చెబుతున్నాయి. అధిష్ఠానం వద్ద జరిగిన వరుస చర్చల అనంతరం సురేఖపై చర్యకు నిర్ణయం వచ్చినట్లు సమాచారం. ఇక్కడ ప్రభుత్వాన్ని ముక్కుసూటిగా అడగాల్సిన మొదటి ప్రశ్న—పార్టీ క్రమశిక్షణ విషయంలో ఇంత కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం ప్రజల సమస్యల విషయంలో కూడా ఇంతే కఠినంగా, వేగంగా వ్యవహరిస్తుందా? ఒక మంత్రి పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించారని భావిస్తే చర్య తీసుకోవడం రాజకీయ పార్టీలో సహజమే. కానీ ఆ చర్యకు ఒకే ప్రమాణం ఉండాలి. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం ఉంటే అదే క్రమశిక్షణపై ప్రజల్లో అనుమానాలు మొదలవుతాయి. అందుకే సురేఖపై చర్య తీసుకున్న ప్రభుత్వం ఇకపై ప్రతి విషయంలోనూ ఒకే ప్రమాణాన్ని పాటించాల్సిన బాధ్యతను తనపై తానే పెట్టుకుంది. కఠినత్వం వ్యక్తులపై మాత్రమే కాదు.. పాలనపై కూడా కనిపించాలి. కొండా సురేఖ మంత్రి పదవి ఇప్పుడు రాజకీయంగా కీలక ప్రశ్నగా మారింది. ఆమె తనపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తనకు రాజీనామా చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని కూడా వాదించారు. అయితే పార్టీ నాయకత్వం మాత్రం క్రమశిక్షణ అంశాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ? ఒక మంత్రిని తొలగించడం ద్వారా వివాదా ఎందుకంటే ప్రభుత్వం బయట ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడం కంటే, ప్రభుత్వం లోపలే అసంతృప్తిని నిర్వహించడం కష్టమైన పని. ఇదే సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ దాడిని మరింత ఉధృతం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ చార్జ్‌షీట్ విడుదల చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తింది. రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు వంటి వర్గాలకు ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ తన చార్జ్‌షీట్‌లో ప్రధానంగా ప్రస్తావించింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల మధ్య నిలదీయాలని ఆ పార్టీ కార్యక్రమాలు చేపట్టింది. బీఆర్ఎస్ ఆరోపణల్లో రాజకీయ విమర్శ ఎంత? వాస్తవం ఎంత? అన్నది వేరే ప్రశ్న. కానీ ఆ పార్టీ లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందే. ఎందుకంటే వెయ్యి రోజులు పూర్తయిన తర్వాత కూడా ప్రతి ప్రశ్నను "ఇంకా సమయం కావాలి" అని తప్పించుకునే అవకాశం ప్రభుత్వానికి తగ్గిపోతుంది. వెయ్యి రోజులు ఒక ప్రభుత్వానికి చిన్నకాలం కాదు. ప్రజలు ఇప్పుడు హామీలను గుర్తు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఏం చెప్పిందో, ఏం చేసిందో పోల్చి చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలే ఇప్పుడు కాంగ్రెస్‌కు అద్దంగా మారాయి. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని ఆచరణలోకి వచ్చాయి? ఇదే ప్రజల అసలు ప్రశ్న. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను చెప్పుకోవచ్చు. విజయాలను ప్రచారం చేసుకోవచ్చు. కానీ అదే సమయంలో అమలు కాని హామీలపై కూడా స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ప్రభుత్వం వద్ద గణాంకాలు ఉంటే వాటిని ప్రజల ముందు పెట్టాలి. ఎంత నిధులు ఖర్చు చేశారు? ఎంతమంది లబ్ధిదారులు? ఎన్ని ఇళ్లు? ఎన్ని ఉద్యోగాలు? రైతులకు ఎంత సహాయం? మహిళలకు ఎంత ప్రయోజనం? విద్యార్థులకు ఏం చేశారు?—ప్రతి అంశానికి లెక్క చెప్పాలి. ప్రజల డబ్బుతో నడిచే ప్రభుత్వానికి ప్రజల ముందు లెక్క చెప్పడం బాధ్యత.. ఉపకారం కాదు. మరోవైపు బీఆర్ఎస్ కూడా తన గతాన్ని మర్చిపోకూడదు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చార్జ్‌షీట్ పెట్టడం రాజకీయంగా సరైన వ్యూహం కావచ్చు. కానీ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పదేళ్ల పాలనను కూడా మర్చిపోలేదు. టీఆర్ఎస్ పేరుతో ప్రారంభమై బీఆర్ఎస్‌గా మారిన ఆ పార్టీ పదేళ్లు అధికారంలో ఉంది.

అదే సమయంలో ఆ పాలనపై వచ్చిన విమర్శలు, ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి, 2023లో జరిగిన అధికార మార్పు కూడా రాజకీయ చరిత్రలో భాగమే. అందుకే బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ప్రశ్నించేటప్పుడు ప్రజలు బీఆర్ఎస్‌ను కూడా ప్రశ్నిస్తారు—"మీ పదేళ్ల పాలనలో ఎందుకు అధికారాన్ని కోల్పోయారు? ఇప్పుడు మళ్లీ మీకు ఎందుకు అవకాశం ఇవ్వాలి?" అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. రాజకీయాల్లో గతాన్ని చూపిస్తూ వర్తమానాన్ని తప్పించుకోవడం ఎంత సులువో, వర్తమానాన్ని చూపిస్తూ గతాన్ని దాచడం కూడా అంతే సులువు. కానీ ప్రజలు రెండింటినీ గుర్తుపెట్టుకుంటారు. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పోరు ఇదే. కాంగ్రెస్ తన వెయ్యి రోజుల పాలనను విజయాలుగా చూపించుకోవాలనుకుంటోంది. బీఆర్ఎస్ అదే వెయ్యి రోజులను వైఫల్యాల చార్జ్‌షీట్‌గా చూపిస్తోంది. మధ్యలో కొండా సురేఖ ఎపిసోడ్ కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలను ముందుకు తెచ్చింది. ఈ మూడు పరిణామాలను కలిపి చూస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది—తెలంగాణ రాజకీయాలు మళ్లీ ఎన్నికల మూడ్‌లోకి నెమ్మదిగా జారుతున్నాయి. కొండా సురేఖపై ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అదే ప్రభుత్వం తన పాలనపై ప్రజలు అడిగే కఠిన ప్రశ్నలకు కూడా కఠిన సమాధానాలు ఇవ్వాలి. పార్టీ క్రమశిక్షణను అమలు చేయడం ఎంత ముఖ్యమో, పాలనా క్రమశిక్షణను పాటించడం అంతకంటే ముఖ్యం. మంత్రి పదవి విషయంలో వేగంగా నిర్ణయం తీసుకోగలిగిన ప్రభుత్వం రైతు సమస్యకు గడువు ఎందుకు పెట్టకూడదు? నిరుద్యోగ సమస్యకు సమయపట్టిక ఎందుకు ప్రకటించకూడదు? విద్యార్థుల ఫీజు సమస్యకు పరిష్కార తేదీ ఎందుకు చెప్పకూడదు? పేదల ఇళ్లకు లక్ష్యాన్ని ఎందుకు బహిరంగంగా ప్రకటించకూడదు? అభివృద్ధి పనులకు నాణ్యతపై బాధ్యత ఎందుకు నిర్ధారించకూడదు? ప్రజల సమస్యల విషయంలో "చూస్తాం" అనే మాటకు బదులు "ఈ తేదీకి పరిష్కరిస్తాం" అనే మాట ఎప్పుడు వస్తుంది? ఇదే ప్రభుత్వం నుంచి ప్రజలు కోరాల్సిన ప్రశ్న. ఒక మంత్రిని తొలగించడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగవచ్చు. కానీ ప్రజల సమస్యలను పరిష్కరించడం వల్లే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. రాజకీయ ప్రత్యర్థిని ఓడించడం వల్ల ప్రభుత్వం బలపడదు. ప్రజల జీవితాలను మెరుగుపరచడం వల్లే ప్రభుత్వం బలపడుతుంది. బీఆర్ఎస్ చార్జ్‌షీట్ విడుదల చేసింది. కాంగ్రెస్ దానికి సమాధానం ఇవ్వాలి. కాంగ్రెస్ తన విజయాల జాబితా విడుదల చేస్తే బీఆర్ఎస్ దానిపై వాస్తవాలతో స్పందించాలి. రెండు పార్టీలు తమ తమ లెక్కలు చెప్పుకోవచ్చు. కానీ తుది లెక్క మాత్రం ప్రజల దగ్గరే ఉంటుంది. కొండా సురేఖ ఎపిసోడ్ ఒక మంత్రి భవిష్యత్తును నిర్ణయించవచ్చు. బీఆర్ఎస్ చార్జ్‌షీట్ ఒక రాజకీయ పోరాటానికి నాంది కావచ్చు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ఒక ప్రభుత్వానికి మధ్యంతర అద్దం కావచ్చు. కానీ తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించేది ఈ మూడు కాదు—ప్రజల అనుభవం. అందుకే ఇక రాజకీయ పార్టీలకు ఒకే సూటి ప్రశ్న—మాటలు చాలాయి.. లెక్కలు చెప్పండి. హామీలు చాలాయి.. అమలు చూపండి. ఆరోపణలు చాలాయి.. వాస్తవాలు పెట్టండి. పదవుల కోసం పోరాటం చాలదు.. ప్రజల కోసం పాలన చూపండి. తెలంగాణ ప్రజలు ఇప్పుడు నాయకుల మాటలను మాత్రమే వినే స్థితిలో లేరు. తమ జీవితాల్లో వచ్చిన మార్పును కొలుస్తున్నారు. రైతు తన పొలంలో కొలుస్తున్నాడు. నిరుద్యోగి తన చేతిలో ఉన్న ఉద్యోగ అవకాశంతో కొలుస్తున్నాడు. విద్యార్థి తన చదువుతో కొలుస్తున్నాడు. మహిళ తన కుటుంబ ఆర్థిక పరిస్థితితో కొలుస్తోంది. పేదవాడు తన ఇంటి గడపతో కొలుస్తున్నాడు. అక్కడే అసలు తీర్పు తయారవుతుంది. ప్రభుత్వం ఎవరైనా కావచ్చు.. పార్టీ ఏదైనా కావచ్చు.. ప్రజల ప్రశ్న మాత్రం ఒక్కటే—"మా కోసం ఏం చేశారు?" ఆ ప్రశ్నకు నిజాయితీగా, లెక్కలతో, ఫలితాలతో సమాధానం చెప్పగలిగిన వారికే తెలంగాణ రాజకీయాల్లో నిజమైన భవిష్యత్తు ఉంటుంది.



ఏం రవీందర్
790150 3777

# గిగ్ కార్మికులకు భద్రత ఎక్కడ?

ఉదయం మన ఇంటి తలుపు తట్టి ఆహారం అందించే డెలివరీ బాయ్ నుంచి, యాప్‌లో బుక్ చేస్తే ఇంటికొచ్చి సేవలందించే వ్యక్తి వరకు—మన రోజువారీ జీవితాన్ని సులభతరం చేస్తున్న లక్షలాది మంది కార్మికుల జీవితం మాత్రం అంత సులభంగా లేదు. ఆర్డర్ ఉన్నంతసేపే ఆదాయం, పనిచేసిన రోజుకే పారితోషికం, ప్రమాదం జరిగితే ఆదాయానికి బ్రేక్—ఇదే పెద్ద సంఖ్యలో గిగ్ కార్మికుల వాస్తవ పరిస్థితి.సాంప్రదాయికంగా ఒక సంస్థలో శాశ్వత ఉద్యోగిగా చేరి, నిర్ణీత జీతం తీసుకునే విధానానికి భిన్నంగా, నిర్దిష్ట పనులు లేదా చిన్నకాలిక పనుల ఆధారంగా జీవనోపాధి పొందేవారే గిగ్ కార్మికులు. వీరిలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పని పొందేవారు ప్లాట్‌ఫామ్ కార్మికులు. ఫుడ్, కిరాణా, ఈకామర్స్ డెలివరీ సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, ఇంటి సేవలు అందించే వారు తదితరులు ఈ విస్తరిస్తున్న వర్గంలోకి వస్తారు.ఇది చిన్న వర్గం కాదు. నీతి ఆయోగ్ 2022 నివేదిక ప్రకారం 2020-21లో దేశంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంఖ్య 77 లక్షలు (7.7 మిలియన్లు). 2029-30 నాటికి ఇది 2.35 కోట్లకు (23.5 మిలియన్లు) చేరుతుందని అంచనా. 2024-25 నాటికే ఈ సంఖ్య కోటిని దాటే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గిగ్ ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతున్నా, కార్మికుల సామాజిక భద్రత అదే వేగంతో పెరగడం లేదు. చాలా మందికి స్థిరమైన నెలవారీ ఆదాయం ఉండదు. ఆర్డర్ల సంఖ్య, పని గంటలు, ప్రోత్సాహకాలు, ప్లాట్‌ఫామ్ నిర్ణయాలపై ఆదాయం ధారపడుతుంది. పెట్రోలు, వాహన నిర్వహణ, మొబైల్ డేటా వంటి పని ఖర్చులు చాలాసార్లు కార్మికుడే భరించాలి.దీంతోపాటు ప్రమాద బీమా, ఆరోగ్య రక్షణ, ప్రసూతి ప్రయోజనాలు, పెన్షన్, వృద్ధాప్య భద్రత వంటి అంశాలు కీలక సమస్యలుగా మారుతున్నాయి. అనారోగ్యం లేదా ప్రమాదం కారణంగా కొన్ని రోజులు పనిచేయలేకపోతే ఆదాయం ఆగిపోవడం వారి ఆర్థిక అస్థిరతను మరింత పెంచుతుంది.ఇంకా ఒక కీలక సమస్య ఉద్యోగ సంబంధం. ప్లాట్‌ఫామ్‌లు చాలాసార్లు కార్మికులను సంప్రదాయ ఉద్యోగి-యజమాని సంబంధంలో కాకుండా స్వతంత్ర భాగస్వాములుగా పరిగణించే విధానం అనుసరిస్తాయి. ఫలితంగా సంప్రదాయ ఉద్యోగులకు అందే అనేక రక్షణలు స్వయంచాలకంగా వర్తించవు.ఇక్కడ ఒక ముఖ్యమైన మార్పు జరిగింది. సామాజిక భద్రతా కోడ్-2020 తొలిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు చట్టపరమైన గుర్తింపునిచ్చింది. ఈ కోడ్ 2025 నవంబర్ 21 నుంచి అమల్లోకి వచ్చింది. జీవన, వైకల్య రక్షణ, ప్రమాద బీమా, ఆరోగ్య, ప్రసూతి ప్రయోజనాలు, వృద్ధాప్య భద్రత వంటి సామాజిక భద్రతా పథకాలను రూపొందించేందుకు ఇందులో అవకాశం ఉంది. సామాజిక భద్రతా నిధి ఏర్పాటు, అగ్రిగేటర్ల భాగస్వామ్యానికి కూడా నిబంధనలు ఉన్నాయి.అగ్రిగేటర్లు తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం సామాజిక భద్రతా నిధికి అందించాల్సి ఉంటుంది; అయితే ఈ మొత్తానికి గిగ్ కార్మికులకు చెల్లించే మొత్తంలో 5 శాతం పరిమితి ఉంది.అయితే చట్టపరమైన గుర్తింపు రావడం ఒక అడుగు మాత్రమే; సమర్థవంతమైన భద్రత అందడం అసలు లక్ష్యం.2021లో ప్రారంభించిన ఈశ్రమ్ పోర్టల్ అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్‌గా పనిచేస్తోంది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు ఇందులో నమోదు చేసుకోవచ్చు. 2024 డిసెంబర్‌లో అగ్రిగేటర్ల కోసం ప్రత్యేక మాడ్యూల్ ప్రారంభించారు. 2026 జనవరి నాటికి 12 ప్రధాన అగ్రిగేటర్లు ఈ వ్యవస్థలో చేరినట్లు కేంద్రం తెలిపింది.కానీ నమోదు విషయంలో ఇంకా భారీ అంతరం ఉంది. 2025 డిసెంబర్ 1 నాటికి ఈశ్రమ్‌లో నమోదైన ప్లాట్‌ఫామ్ కార్మికులు 5.12 లక్షలు మాత్రమే. అదే సమయంలో నీతి ఆయోగ్ అంచనాలు దేశవ్యాప్తంగా గిగ్ కార్మికుల సంఖ్యను కోట్లలో చూపుతున్నాయి. నిర్వచనాలు, గణన పద్ధతులు వేర్వేరుగా ఉన్నందున నేరుగా నమోదు శాతాన్ని నిర్ణయించలేకపోయినా, నమోదైన కార్మికుల సంఖ్య వాస్తవ శ్రామిక బలంతో పోలిస్తే చాలా తక్కువగా ఉందనే ఆందోళన మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.అందువల్ల ఇప్పుడు ప్రభుత్వాలు, అగ్రిగేటర్లు, కార్మిక సంఘాలు కలిసి "పని ఉంది—భద్రత లేదు" అనే పరిస్థితిని మార్చాలి. ఈశ్రమ్ నమోదు విస్తరించాలి. ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు, ప్రమాద సమయంలో తక్షణ రక్షణ, ఆరోగ్య బీమా, వృద్ధాప్య భద్రత, ప్రసూతి ప్రయోజనాలు, పారదర్శక పారితోషిక విధానం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులోకి రావాలి.డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న కార్మికుడిని "ఆన్‌లైన్ యూజర్"గా మాత్రమే చూస్తే అభివృద్ధి అసంపూర్ణం. అతను కార్మికుడు—అతనికి హక్కులున్నాయి, భద్రత కావాలి, గౌరవప్రదమైన జీవితం కావాలి.యాప్‌లో ఆర్డర్ ఒక్క క్లిక్‌తో వస్తుంది. కానీ కార్మికుడి భద్రత కూడా ఒక్క క్లిక్ దూరంలో ఉండే రోజు రావాలి. గిగ్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు అయితే—గిగ్ కార్మికుడి సామాజిక భద్రతే ఆ భవిష్యత్తుకు అసలైన పునాది.



హెచ్.ప్రతాప్
77998 00773



# జాతీయం-అంతర్జాతీయం



## అమెరికా అంగీకరించాకే
# తుది వివరాలు వెల్లడిస్తాం

- త్వరలో అమల్లోకి న్యూజిలాండ్ ఒప్పందం
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి
- మరింత ప్రయోజనం కోసం భారత్ కృషి చేస్తుందని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్):** ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌కు సుంకాల విషయంలో మినహాయింపులకు అమెరికా అంగీకరించిన తర్వాతే ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది వివరాలను వెల్లడిస్తామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. ''న్యూజిలాండ్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలో అమలులోకి వస్తుంది.. ఆ తర్వాత 27 దేశాల కూటమి అయిన ఈయూతో అమలులోకి వస్తుంది.పోటీ దేశాలతో పోలిస్తే అమెరికా మనకు ప్రాధాన్యతా రేటును ఇచ్చేందుకు సిద్ధమైన వెంటనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారు చేసి తుది వివరాలను ప్రకటిస్తాం'' అని పీయూష్ గోయల్ అన్నట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ నివేదించింది. 'లేవరేజింగ్ ఎఫ్‌టీఏల ఔట్‌రీచ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



రాబోయే కొద్ది నెలల్లో కెనడా, మెక్సికో, చిలీ, మెర్కోసూర్, దక్షిణాఫ్రికా కస్టమ్స్ యూనియన్, గల్ఫ్ సహకార మండలి, ఇజ్రాయెల్ సహా ఇతర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, అలాగే ఆసియా, కొరియా, జపాన్ వాణిజ్య ఒప్పందాలను సమీక్షించే ప్రయత్నాలు, భారత్‌కు ఇతర పోటీదారుల కంటే తక్కువ రేటుకే ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం వాటాను అందిస్తాయని ఆయన అన్నారు. భారత్ ఇప్పటికే యూకే, మారిషస్, ఒమన్, యూఏఈ, ఆస్ట్రేలియాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు అమల్లోకి రానున్నాయని తెలిపారు.

భారత్‌అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం చర్చల దశలో ఉంది. ఇరు దేశాలు మార్కెట్ విస్తరణ, వాణిజ్య అడ్డంకులను తొలగించడం, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ముసాయిదా ఒప్పందం ఇప్పటికే పూర్తయిందని, మరో మూడు నుంచి నాలుగు నెలల్లో దీనిపై సంతకాలు చేసే అవకాశం ఉందని ఒక సీనియర్ అమెరికా అధికారి జులైలో తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అమెరికా 'సెక్షన్ 301' వాణిజ్య విచారణలు మాత్రమే ఈ ఒప్పందానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రెండు దేశాల మధ్య ఒప్పందం 'కాగితంపై సిద్ధంగా ఉంది' అని, ఈ జాప్యం కేవలం సాంకేతిక విధివిధానాల వల్లనే తప్ప న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య పరిష్కారం కాని విభేదాల వల్ల కాదని ఆ అధికారి స్పష్టం చేశారు. మరోవైపు, ఇతర దేశాల కంటే భారతీయ ఎగుమతిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా తక్కువ పన్ను నిబంధనలను సాధించేందుకు భారత్ కృషి చేస్తోంది.

# అమెరికా నుంచి 86 టన్నుల బంగారం తరలింపు

- నెదర్లాండ్స్ కీలక నిర్ణయం
- డచ్ సెంట్రల్ బ్యాంక్ ధృవీకరణ
- అంతర్జాతీయ సంక్షోభాలను తట్టుకునేందుకేనంటూ వెల్లడి

**లండన్, సెప్టెంబరు 03:** అంతర్జాతీయంగా నెలకొన్న తీవ్ర రాజకీయ, ఆర్థిక అస్థిర పరిస్థితుల నేపథ్యంలో నెదర్లాండ్స్ దేశం ఒక అత్యంత కీలకమైన నిర్ణయాన్ని అమలు చేసింది. అమెరికా, కెనడా దేశాల నుంచి ఏకంగా 86 టన్నుల బంగారాన్ని లండన్‌లోని ప్రసిద్ధ 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' వాల్ట్‌లకు తరలించినట్లు డచ్ సెంట్రల్ బ్యాంక్ (డీఎన్‌బీ) అధికారికంగా ధ్రువీకరించింది. బిలియన్ల డాలర్ల విలువైన ఈ భారీ పసిడి నిల్వలను సురక్షిత ప్రాంతానికి మార్చడం ద్వారా రాబోయే అంతర్జాతీయ సంక్షోభాలను తట్టుకునేందుకు డచ్ ప్రభుత్వం సమాయత్తమైంది.

ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ క్లిష్టమైన తరలింపు ప్రక్రియను డచ్ బ్యాంక్ నిర్వహించింది. నివేదికల ప్రకారం.. తొలుత కెనడా,



అమెరికా బ్యాంకుల నుంచి 27 టన్నుల బంగారాన్ని నెదర్లాండ్స్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చేర్చారు. ఇక మిగిలిన పసిడి నిల్వల రవాణాలో ఉన్న నష్టభయాలు, రవాణా భారాన్ని పరిగణనలోకి తీసుకుని. వాటిని న్యూయార్క్ నగరంలోనే విక్రయించి, ఆ మొత్తంతో లండన్ మార్కెట్‌లో తిరిగి బంగారాన్ని కొనుగోలు చేశారు. ఈ రీతిలో బహుళ దశల్లో పక్కా ప్రణాళికతో ఆపరేషన్‌ను పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఒకవైపు అమెరికాకెనడాల మధ్య తీవ్రమైన ట్రేడ్ వార్ నడుస్తోంది. రెండు దేశాలు పరస్పరం భారీ సుంకాలు విధించుకోవడంతో వాణిజ్య వ్యవస్థ దెబ్బతింది. మరోవైపు ఇరాన్‌అమెరికా మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం పశ్చిమాసియాలో అస్థిరతకు దారితీశాయి. అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ తీవ్ర అనిశ్చితిలో పడటంతో.. అక్కడ పసిడిని ఉంచడం సురక్షితం కాదని నెదర్లాండ్స్ భావించింది. లండన్ నగరం ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతోంది. అక్కడ పసిడిని విక్రయించడం, కొనుగోలు చేయడం లేదా తాకట్టు పెట్టి తక్షణ ద్రవ్యత పొందడం చాలా సులభం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన థ్రెడ్ నీడిల్ స్ట్రీట్ వాల్ట్ బాంబు దాడులను కూడా తట్టుకునే అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్మించారు. ప్రపంచంలోని ఐదో వంతు బంగారం ఇక్కడే భద్రపరచబడి ఉంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో నిల్వ ఉంచితే.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో భౌతికంగా బంగారాన్ని తరలించకుండానే వాల్‌ట్‌లోని ఒక దేశపు అర నుంచి మరొక అరలోకి మార్చడం ద్వారా నిమిషాల్లో లావాదేవీలు పూర్తి చేయవచ్చు.

# భవిష్యత్తులో ఆహారం దొరికేనా?

- రికార్డు స్థాయి ఆహార ధాన్యాల ఉత్పత్తి అంటూ కేంద్రం ప్రచారం..
- దేశంలో వాతావరణ సంక్షోభంపై మాత్రం నిర్లక్ష్యం
- బియ్యం, గోధుమలకే మోడీ సర్కారు చర్యలు పరిమితం
- నీటి కొరత, కరువు, వరదలకు అనుగుణంగా
- మారని విధానాలు. .'ఫుడ్ సెక్యూరిటీ' కాదు
- 'క్లైమేట్ సెక్యూరిటీ' అవసరం
- రైతు భవిష్యత్‌ను కాపాడాలంటే అదే కీలకం..
- ప్రభుత్వానికి వ్యవసాయ నిపుణులు, విశ్లేషకుల సూచనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్) :** దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని మోడీ ప్రభుత్వం పదేపదే ప్రచారం చేసుకుంటున్నా.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దేశ ఆహార వ్యవస్థను మార్చడంలో మాత్రం ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అస్తవ్యస్త వర్షాలు, కరువులు, ఆకస్మిక వరదలు, భూగర్భజలాల క్షీణత ఇప్పటికే వ్యవసాయానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాతకాలపు బియ్యం, గోధుమల ఆధారిత విధానాన్ని కొనసాగించడం, పంటల వైవిధ్యానికి తగిన ప్రోత్సాహం ఇవ్వకపోవడం భవిష్యత్ ఆహార భద్రతను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు, పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1960లలో విదేశీ ఆహార సాయంపై ఆధారపడిన దేశం..నేడు 350 మిలియన్ టన్నులకు పైగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరింది. కానీ ఆ ఘనతను కాపాడేందుకు అవసరమైన తదుపరి దశలో కేంద్రం ఎంత వరకు ముందుకు వెళ్తోందన్నదే అసలు ప్రశ్నగా మిగిలింది.

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలకు ప్రాధాన్యం పెంచడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చు. ఆహారంలో పోషక వైవిధ్యాన్ని పెంచవచ్చు. కానీ కొన్ని కార్యక్రమాలు, ప్రచారాలతో రైతుల పంట ఎంపిక మారదని వ్యవసాయ పరిశోధకులు చెప్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలో మార్పు రావాలనీ, మద్దతు ధర, మార్కెట్, నిల్వ, ప్రాసెసింగ్, రవాణా వంటి మొత్తం వ్యవస్థ ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా మారాలని సూచిస్తున్నారు.ఒ [illegible]రణ సంక్షోభాన్ని రైతు ఒంటరిగా ఎదుర్కోలేడు

వాతావరణ పరిస్థితులపై రైతులకు ముందస్తు సమాచారం సకాలంలో చేరాలి. వేడి తరంగాలు, భారీ వర్షాలు, కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి పంట ప్రణాళికను మార్చుకునే అవకాశం కల్పించాలి. వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలు, సూక్ష్మ సాగునీరు, వాటర్‌షెడ్ అభివృద్ధి, డిజిటల్ సలహాలు, పంట బీమా వంటి చర్యలను బలోపేతం చేయాలి. కేంద్రం రైతులపై ప్రమాదాన్ని నెట్టివేసి.. తర్వాత పరిహారం ఇచ్చే విధానానికి బదులుగా ప్రమాదాన్ని ముందుగానే తగ్గించే విధానాన్ని అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ ముప్పు పొలంలోనే ఆగదు.. వరదల్లో గిడ్డంగులు దెబ్బతింటే ధాన్యం నష్టపోతుంది. అధిక ఉష్ణోగ్రతలతో నిల్వ నష్టం పెరుగుతుంది.రవాణా వ్యవస్థ దెబ్బతింటే మార్కెట్లకు సరఫరా ఆగిపోతుంది. అందుకు వరదలను తట్టుకునే గిడ్డంగులు, మెరుగైన కోల్డ్‌చైన్‌లు, ఉష్ణోగ్రతలను తట్టుకునే నిల్వ వ్యవస్థలు, బలమైన రవాణా మౌలిక వసతులు అవసరమని నిపుణులు చెప్తున్నారు.

కేంద్రంలోని మోడీ సర్కారు వ్యవసాయం, రైతుల విషయంలో గొప్పలు పెద్ద ఎత్తున చెప్పుకుంటోంది. రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణాంకాలను చూపిస్తూ ఆహార భద్రత సాధించామని చెప్పుకుంటోంది. అయితే రేపటి వాతావరణ సంక్షోభంలో కూడా రైతు పండించగలడా? ప్రజలకు అందుబాటు ధరలో పోషకాహారం దొరుకుతుందా? నీటి వనరులు మనగలవా? పంట నష్టపోతే రైతుకు రక్షణ ఉంటుందా? అన్న ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం వద్ద సమాధానం లేదనే చెప్పాలి. ఆహార భద్రతను రేషన్ బియ్యం, గోధుమల పంపిణీగా పరిమితం చేయకుండా.. నీరు, వ్యవసాయం, పోషణ, నిల్వ, రవాణా, మార్కెట్లను కలిపిన సమగ్ర విధానంగా మార్చాలి. "భారత్ గతంలో ఆహార కొరతను అధిగమించింది. ఇప్పుడు వాతావరణ సంక్షోభాన్ని అధిగమించాల్సిన దశ వచ్చింది.మోడీ ప్రభుత్వం.. విజయాలను ప్రచారం చేసుకోవడం కంటే.. భవిష్యత్ ప్రమాదాలను ఎదుర్కొనే విధానాలను రూపొందించాలి" అని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే 'రికార్డు ఉత్పత్తి' అనే పేరు మిగిలినా.. రైతుకు భద్రత, ప్రజలకు పోషకాహారం, దేశానికి సుస్థిరమైన ఆహార భవిష్యత్ మాత్రం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. బియ్యం, గోధుమలు దేశ ఆహార భద్రతకు కీలకమైన పంటలు. అయితే ప్రభుత్వ కొనుగోళ్లు కొన్ని పంటలు, కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో వ్యవసాయ వ్యవస్థలో ప్రమాదపు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తీవ్రంగా క్షీణిస్తున్నప్పటికీ.. అధిక నీరు అవసరమయ్యే పంటల చుట్టూ ఏర్పడిన కొనుగోలు, మద్దతు వ్యవస్థలను మార్చడంలో కేంద్రం తగినంత వేగం చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. "రైతును పంట మార్చాలని చెప్పడం సులభం. కానీ ప్రత్యామ్నాయ పంటకు ఖచ్చితమైన మార్కెట్, ధర, ప్రభుత్వ కొనుగోలు, నిల్వ, ప్రాసెసింగ్ హామీ ఇవ్వకుండా రైతు ఎందుకు మారుతాడు?" అని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. ఇదే ఇప్పుడు మోడీ ప్రభుత్వ వ్యవసాయ విధానానికి అసలు పరీక్షగా వివరిస్తున్నారు.

# ఎవరి డిగ్రీ ఏంటో బయటపెడదామా?

- ప్రధాని మోడీకి అభిజీత్ దిప్కే సవాల్
- తన డిగ్రీ చూపించటానికి సిద్ధమంటూ హెచ్చరిక



**చండీఘర్, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్) :** తన బోస్టన్ యూనివర్సిటీ విద్యార్హతలపై మళ్లీ వివాదం మొదలైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీకి కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే సవాల్ విసిరారు. ఇద్దరం కలిసి తమ విద్యార్హతల డిగ్రీలను బహిరంగంగా చూపిద్దామని ఆయన పేర్కొన్నారు. గురువారం ట్విట్టర్ వేదికగా స్పందించిన దిప్కే, ప్రధాని మోడీ కూడా తన విద్యార్హతలను వెల్లడించడానికి అంగీకరిస్తే, తాను కూడా అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీకి చెందిన డిగ్రీని చూపించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

"నా డిగ్రీని చూడటానికి వేచి ఉన్న వారు ఓపిక కోల్పోతున్నారు. అయితే గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ డిగ్రీని చూడకుండా ప్రజలు ఎలా ఉన్నారో అర్థం కావడం లేదు" అని పేర్కొన్న దిప్కే, "సార్ @నరేంద్రమోడీ, మన మిద్దరం మన డిగ్రీలను చూపించి ఈ వివాదానికి ముగింపు పలుకుదాం" అని సవాల్ చేశారు.

సోషల్ మీడియాలో ప్రఖర్ గుప్తా హోస్ట్ చేసిన ఒక పోడ్‌కాస్ట్‌లో సామాజిక వేత్త సోనమ్ వాంగ్‌చుక్‌తో మాట్లాడిన వీడియో క్లిప్ వైరల్ అవ్వడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అందులో ప్రఖర్ గుప్తా మాట్లాడుతూ, బోస్టన్ యూనివర్సిటీలో చదువుకున్న తన స్నేహితుడొకరు దిప్కే విద్యార్హతలను తనిఖీ చేయగా, ఆయన బోస్టన్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేట్ అయినట్లు ఎలాంటి రికార్డులు లభించలేదని క్లెయిమ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను ఆయన ధృవీకరించలేదు.

అంతకుముందు కూడా దిప్కే విద్యాభ్యాసానికి సంబంధించిన ఖర్చులపై ప్రశ్నలు వచ్చాయి. సూరత్‌కు చెందిన ఆర్‌టీఐ కార్యకర్త అమిత్ తివారీ, మహారాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన దిప్కే తండ్రి భగవాన్‌రావ్ దిప్కే ఆర్థిక వివరాలపై విచారణ జరపాలని ఫిర్యాదు చేశారు. నెలకు రూ. 60,000 నుండి 65,000 జీతం పొందే వ్యక్తి తన పిల్లలను అమెరికాలో ఎలా చదివించగలరని ఆయన ప్రశ్నించారు.

ఈ ఆరోపణలను దిప్కే ఖండిస్తూ... పాత్రికేయురాలు బర్ఖా దత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన చదువుకు బోస్టన్ యూనివర్సిటీ ఇచ్చిన స్కాలర్‌షిప్, ఎడ్యుకేషన్ లోన్ ద్వారా నిధులు సమకూరాయని వివరించారు. ఇంటర్వ్యూ సమయంలో తన స్కాలర్‌షిప్ లేఖను కూడా ఆయన చూపించారు.

ఢిల్లీ హైకోర్టు ప్రధాని మోడీ డిగ్రీని వెల్లడించడానికి ఎందుకు నిరాకరించిందో చెప్పాలని కూడా దిప్కే ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రధాని విద్యార్హతలపై ప్రతిపక్షాలు గతంలో కూడా ప్రశ్నలు లేవనెత్తగా, ఈ అంశం ఇప్పటికే ముగిసిపోయిందని, మోడీ డిగ్రీని గతంలోనే బహిరంగంగా చూపించామని బీజేపీ పేర్కొంది. సీజేపీ ప్రతినిధి వైష్ణవి గౌర్ కూడా దిప్కేకు మద్దతుగా నిలుస్తూ ఆర్‌టీఐ విచారణను విమర్శించారు.

# తప్పుల తడకగా మళయాళం సివిల్ పరీక్ష




- ఒక్క పేజీలో సుమారు 20 వరకు మిస్టేక్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్):** దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోటీ పరీక్షల్లో ఒకటైన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ప్రశ్నపత్రంలో భాషా, అక్షర దోషాలు చర్చకు దారితీశాయి. ఆగస్టు 30న నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలోని మలయాళం పేపర్2లో అనేక తప్పులు ఉన్నట్లు అభ్యర్థులు, భాషా నిపుణులు గుర్తించారు. ప్రశ్నపత్రంలోని కొన్ని పేజీల్లోనే పెద్ద సంఖ్యలో అక్షర దోషాలు కనిపించాయని అభ్యర్థులు తెలిపారు. ఒక్క పేజీలో సుమారు 20 వరకు తప్పులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల పదాల్లో స్వల్ప మార్పులు కనిపించగా, మరికొన్ని సందర్భాల్లో ఆ మార్పుల కారణంగా పదాల అర్థమే మారిపోయే పరిస్థితి ఏర్పడిందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నపత్రంలోని పలు పదాలు, వాక్యాల్లో తప్పులు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఉదాహరణకు 'Varikarum Nee' స్థానంలో 'Varikasu nni', 'Chakanna nailla' స్థానంలో 'Chakata Naalla', 'Vidan Naninimelil' స్థానంలో 'Vidan Iknimelil', 'Rupa' స్థానంలో 'Nripa' వంటి తప్పులు ఉన్నట్లు అభ్యర్థులు చెబుతున్నారు. ఇతర ప్రశ్నల్లోనూ మలయాళ పదాల స్థానంలో తప్పుగా ముద్రించిన పదాలు కనిపించాయని తెలిపారు. భాషపై ఆధారపడి సమాధానాలు రాయాల్సిన పేపర్‌లోనే ఇలాంటి తప్పులు చోటుచేసుకోవడం అభ్యర్థుల మూల్యాంకనంపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ప్రశ్నలోని పదం లేదా వాక్యం అర్థం మారితే, అభ్యర్థి ఇచ్చే సమాధానం కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు అత్యంత పోటీతో ఎదుర్కొనే సివిల్ సర్వీసెస్ పరీక్షలో ప్రశ్నపత్రం తయారీ, అనువాదం, ప్రూఫ్‌రీడింగ్, తుది పరిశీలన వంటి ప్రక్రియల్లో మరింత జాగ్రత్త అవసరమని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన పరీక్షలో ఇలాంటి భాషా దోషాలు చోటుచేసుకోవడం పరీక్ష నిర్వహణపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని వారు అంటున్నారు. మలయాళం పేపర్‌లో నమోదైన తప్పులపై యూపీఎస్సీ నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది. భాషా దోషాల వల్ల అభ్యర్థులకు ఏదైనా అన్యాయం జరిగితే, మూల్యాంకన ప్రక్రియలో తగిన పరిష్కార చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

# ఆ అధికారం బార్ కౌన్సిళ్లకు లేదు

- విద్యార్థులపై ఆయా సంస్థలే చర్యలు తీసుకోవాలి
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్) :** న్యాయ విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించే చట్టబద్ధమైన అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకి, రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. విద్యార్థులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలైనా వారి సొంత విద్యాసంస్థల నిబంధనల ప్రకారమే ఆయా సంస్థలే తీసుకోవాలని తేల్చిచెప్పింది. హైదరాబాద్‌లోని 'నల్సార్' న్యాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి హాజరుకావడంపై ఆందోళన తెలిపిన విద్యార్థులపై బిసిఐ చర్యలు తీసుకోవడం ద్వారా రేగిన వివాదంపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

"అడ్వకేట్స్ యాక్ట్, 1961 ప్రకారం ఏర్పడిన బిసిఐకి కానీ, లేదా ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు కానీ న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ప్రత్యక్ష లేదా పరోక్ష చట్టబద్ధమైన అధికారాలు లేవని మేము భావిస్తున్నాము. ఒక లా గ్రాడ్యుయేట్ అడ్వకేట్‌గా నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకున్న తర్వాత మాత్రమే అలాంటి అధికారాలు వర్తిస్తాయి. విద్యార్థుల విషయానికొస్తే, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అర్హత వారి మాతృ సంస్థకు లేదా ఆ సంస్థ బైలాస్/నిబంధనల ప్రకారం నిర్దేశించిన ప్రాధికార సంస్థకు మాత్రమే ఉంటుంది" అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. నల్సార్ వివాదానికి సంబంధించి బీసీఐ జారీ చేసిన రెండు నోటిఫికేషన్లను కోర్టు రద్దు చేసింది. తీవ్ర విమర్శలు రావడంతో బీసీఐ వాటిని జారీ చేసిన కొద్ది గంటల్లోనే వెనక్కి తీసుకున్నప్పటికీ, సాంకేతికంగా వాటిని సుప్రీంకోర్టు కొట్టివేసింది.

"ఆగస్టు 13 నాటి ఆదేశాలు మరియు తదనంతర సవరించిన సమాచారాలన్నీ చట్టబద్ధమైన అధికారం లేనివిగా ప్రకటిస్తున్నాం. మధ్యంతర ఉత్తర్వులను ఖరారు చేస్తున్నాం" అని పేర్కొంటూ నల్సార్ పూర్వ విద్యార్థులు మిహిర సూద్, అభిషేక్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం ముగించింది.

నల్సార్ విద్యార్థులను ప్రస్తుతానికి అడ్వకేట్లుగా నమోదు చేయకూడదని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలని బిసిఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా ఆగస్టు 13న ఇచ్చిన ఆదేశాలను వారు సవాలు చేశారు. అయితే తీవ్ర ప్రజావ్యతిరేకత రావడంతో బిసిఐ ఛైర్మన్ ఆ ఆదేశాలను జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఉపసంహరించుకున్నారు.

విచారణ సందర్భంగా లా విద్యార్థుల తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ కె. పరమేశ్వర్ వాదిస్తూ... బిసిఐ ఛైర్మన్ ఆదేశాలను వెనక్కి తీసుకున్నప్పటికీ, అవి ఏ విధంగా జారీ అయ్యాయనే దానిపై విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు పిటిషన్ ఇంకా ఉనికిలోనే ఉందన్నారు. "ఇది విశ్వవిద్యాలయంలో వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన అంశం. ఇది ఒక విద్యార్థికి మాత్రమే పరిమితం కాదు. మొత్తం విశ్వవిద్యాలయం వ్యాప్తంగా భావప్రకటనా స్వేచ్ఛను నిషేధించడం వంటిది" అని ఆయన పేర్కొన్నారు.దీనిపై సీనియర్ అడ్వకేట్, బిసిఐ ఛైర్మన్ మిశ్రా స్పందిస్తూ... లేఖలను జారీ చేసిన గంట వ్యవధిలోనే ఉపసంహరించుకున్నామని, ఇప్పుడు ఈ అంశాన్ని ఇక్కడితో ముగించాలని కోరారు.దీనికి పరమేశ్వర్ కౌంటర్ ఇస్తూ, "ఏ పరిస్థితుల్లో ఈ ఉత్తర్వులు వచ్చాయి, దీనిపై సమావేశాలు జరిగాయా లేదా అనేది తెలుసుకోవాలనుకుంటున్నాం. ఏది ఏమైనా ఇది న్యాయ విద్యను, న్యాయవాద వృత్తిని నియంత్రించే ఒక చట్టబద్ధమైన సంస్థ" అని అన్నారు.బిసిఐ స్పందిస్తూ, "అంతా ఇప్పటికే ముగిసింది. కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని పరిష్కరించినట్లు, ఇకపై ఏమీ లేదని స్పష్టం చేశాం. ఆ లేఖను వెంటనే ఉపసంహరించుకున్నాం" అని తెలిపారు.

దీనిపై సీజేఐ స్పందిస్తూ... "బిసిఐకి పరిధి లేదు... ఒక వ్యక్తి చదువు పూర్తి చేసిన తర్వాత, లా గ్రాడ్యుయేట్‌గా అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నాకే వారి ప్రవర్తనను నియంత్రించే చట్టబద్ధమైన అధికారం బిసిఐకి ఉంటుంది. విద్యార్థులపై కాదు" అని స్పష్టం చేశారు.

సిజెఐ సూర్య కాంత్ విశ్వవిద్యాలయ పర్యటనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారనే ఆరోపణల నేపథ్యంలో... తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నల్సార్ 2026 గ్రాడ్యుయేట్లను అడ్వకేట్లుగా నమోదు చేయవద్దని ఆగస్టు 14న రాష్ట్ర బార్ కౌన్సిళ్లను బిసిఐ ఆదేశించడంతో ఈ వివాదం చెలరేగింది. ఈ విషయం అంతకుముందు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చినప్పుడు, సిజెఐ బిసిఐ జోక్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "ఇది విద్యార్థులకు, నాకు మధ్య జరుగుతున్న సంభాషణ. జోక్యం చేసుకోవడానికి వారు (బిసిఐ) ఎవరు? ఇది సరికాదు" అని సిజెఐ వ్యాఖ్యానించారు.

## ఖర్గేను అవమానించటంపై ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఆగ్రహం

- ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ ఆవేదన
- 8న రాష్ట్రపతికి ఫిర్యాదుకు నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 03 (ఎ.ఎం.ఎస్):** రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో చోటుచేసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, సీనియర్ 'శుద్ధీకరణ' చర్యపై ఎస్‌సి, ఎస్‌టి పార్లమెంట్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన కేవలం ఖర్గేను వ్యక్తిగతంగా అవమానించడమే కాదని, మొత్తం ఎస్‌సి, ఎస్‌టి సమాజ గౌరవం, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు. సమానత్వం, వ్యక్తిగత గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ సూత్రాలకు ఇటువంటి చర్యలు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం న్యూఢిల్లీలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని ఇకపై సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ఘటనపై న్యాయం జరిగేలా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి: మంత్రి సీతక్క



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తమ భవిష్యత్తుపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. గురువారం ఏటూరునాగారంలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి, వారితో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి,వసతిగృహ జీవితం ఐక్యతను, ధైర్యాన్ని నేర్పుతుందని, భయాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో చదవాలని సూచించారు. సామాజిక చైతన్యం తేవాలి: విద్యార్థినులు తాము నేర్చుకున్న విజ్ఞానంతో గ్రామాల్లో మూఢనమ్మకాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి. ఫోన్‌ను కేవలం జ్ఞానార్జనకు మాత్రమే వాడుతూ, పుస్తకాన్ని ఉత్తమ మిత్రుడిగా భావించాలన్నారు.వసతిగృహంలో ఎవరికి అనారోగ్యం వచ్చినా వెంటనే అధికారులు స్పందించాలని, తల్లిదండ్రులకు సమాచారం అందిస్తూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం హెచ్ఎంటీసీ స్థలంలో రూపుదిద్దుకోనున్న నూతన ఐటీడీఏ భవన స్థలాన్ని మంత్రి పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డిడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణి



**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాజకీయాల్లో కీలక సామాజిక సమీకరణలకు శ్రీకారం చుట్టింది. మాజీ మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన కీలక నాయకురాలు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చిన నేపథ్యంలో పద్మశాలి సామాజిక వర్గంలో నెలకొనే అసంతృప్తిని తృప్తి పరిచేందుకే కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పద్మశాలి సమాజానికి చెందిన గుండు సుధారాణి గతంలో రాజ్యసభ సభ్యురాలిగా, వరంగల్ మేయర్‌గా విశేష సేవలు అందించారు.

అదే సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ స్థానంలో బిసిపద్మశాలి వర్గానికే చెందిన మరో సీనియర్ నాయకురాలికి ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గం మద్దతు తగ్గకుండా చూసుకునేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

## ఎంజీఎంలో ఆధునీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రం



**వరంగల్ క్రైం, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** మత్తు పదార్థాలకు బానిసలైన యువతను పునరావాసం ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యంగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాన్ని ఈగల్ ఫోర్స్ సహకారంతో ప్రారంభించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా, వరంగల్ పోలీస్ కమిషనర్ చొరవ, ఎంజీఎం ఆసుపత్రి యాజమాన్య సహకారంతో ఈ కేంద్రాన్ని సకల సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఎటిఎఫ్ వార్డులో పడకల సామర్థ్యాన్ని 10 నుంచి 20 కి పెంచారు. భద్రత & వసతులు: రోగుల భద్రత కోసం ఇనుప గ్రిల్స్, సీసీటీవీ నిఘా, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు మానసిక ఉల్లాసం కోసం క్యారమ్స్, చెస్ వంటి క్రీడా సౌకర్యాలు కల్పించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి. మత్తు పదార్థాల అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటూనే, బాధితులను వ్యసన విముక్తులను చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పోలీస్ కమిషనరేట్ తెలిపింది. పిల్లలు లేదా కుటుంబ సభ్యులు వ్యసనానికి గురైతే దాచకుండా వెంటనే ఎంజీఎం ఆసుపత్రి మానసిక వైద్య విభాగం లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. హెల్ప్‌లైన్ నంబర్లు: 87125 84473 / 87126 85299 "మత్తును వదిలి - జీవితాన్ని ఎంచుకోండి" | "వ్యసనాన్ని దాచకండి - సహాయం పొందండి" ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, ఆర్.ఎం.ఓ అశ్వని కుమార్, ఎస్.బి ఇంచార్జ్ ఏసీపీ మధుసూదన్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఇన్స్పెక్టర్ సాయి రామ్, ఈగల్ టీమ్ ఇన్స్పెక్టర్ రవీందర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఈగల్ టీమ్ ఎస్.ఐ శ్రీకాంత్, ఆర్.ఎస్.ఐలు పూర్ణచందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, నాగరాజు, పోలీస్, ఎంజీఎం సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వేను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రీసర్వే ప్రక్రియ వేగవంతానికి పెంటాక్స్ కంపెనీ అందించిన ఐదు డీజీపీఎస్ రోవర్స్‌ను గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ల్యాండ్స్ అండ్ సర్వే అధికారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జనగామ రీసర్వేలో ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే పనుల్లో ఖచ్చితత్వం పెరుగుతుందన్నారు. జిల్లాలోని 82 గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని, భూ హద్దులను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీ మన్యంకొండ, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య రక్షణ, ఏకాగ్రతే ప్రభుత్వ లక్ష్యం

**– ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
**కాశాగూడెం ప్రాథమిక పాఠశాలలో 'ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్' పథకం ప్రారంభం**
**రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ/ధర్మసాగర్, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన పౌష్టికాహారాన్ని అందించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. గురువారం ధర్మసాగర్ మండలం కాశాగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 'ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని' హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు రుచికరమైన అల్పాహారాన్ని స్వయంగా వడ్డించి, వారితో కలిసి కూర్చొని తిన్నారు. అనంతరం రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయపు అల్పాహారాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వారంలో రోజుకో రకమైన రుచికరమైన అల్పాహారాన్ని(ఇడ్లీ,పూరీ ,బోండా, ఉప్మా) అందిస్తున్నామని వెల్లడించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, విద్యార్థుల సంఖ్య పెరిగితే పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నిరుపేదలందరికీ దశలవారీగా 'ఇందిరమ్మ ఇండ్లు', రేషన్ కార్డుదారులకు 'సన్నబియ్యం' ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, కాశాగూడెం పేరును 'కాశీం నగర్'గా మార్చే ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం ఆకలితో ఉంటే చదువుపై దృష్టి పెట్టలేరనే ఉద్దేశంతోనే ఈ పథకం తెచ్చామని కలెక్టర్ చెప్పారు.హరేకృష్ణ సంస్థ భాగస్వామ్యంతో ప్రతిరోజు పోషకాలతో కూడిన తాజా అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, ప్రాథమిక స్థాయిలోనే ఇంగ్లీష్, గణితంపై పట్టు సాధించేలా ఫౌండేషన్ లెర్నింగ్, రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసీల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, సర్పంచ్ సయ్యద్ సత్తార్, హెచ్ఎం యాస్మిన్ జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి సెప్టెంబర్ 03(వుదయం ప్రతినిధి):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ ఆదేశించారు.గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, డిస్ట్రిక్ట్ హైవే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, హైవే పెట్రోలింగ్, అత్యవసర వైద్య సేవలపై సమీక్షించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న 10 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లను రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పంచాయతీరాజ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్రాష్ బ్యారియర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, లైటింగ్ తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. అతివేగం, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు ముమ్మరం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై అనధికార పార్కింగ్‌ను నియంత్రించి, అవసరమైన చోట ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించేలా హైవేలపై పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. 1033 హెల్ప్‌లైన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా హైవేల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.సమావేశంలో చర్చించిన అంశాలపై శాఖల వారీగా బాధ్యతలు, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి పురోగతి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్‌ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ మనోహర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, జాతీయ రహదారుల ఈఈ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీదేవి, ఈడార్ డీఆర్ఎం లక్ష్మణ్, పంచాయతీరాజ్, ఆర్టీసీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు తక్షణ న్యాయం, సంక్షేమ పథకాల పక్కా అమలు

**– జిల్లా కలెక్టరు స్నేహ శబరిష్**



**మహబూబాబాద్, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** బాధితులకు తక్షణ న్యాయం అందించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పక్కాగా వర్తింపజేయాలని జిల్లా కలెక్టరు స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశించారు. గురువారం రోజున మహబూబాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారి అధ్యక్షతన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది.సమావేశంలో నష్టపరిహారం, రోస్టర్ అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (POA) కింద నమోదైన కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారం, పెన్షన్లను ఆలస్యం లేకుండా అందించాలి. జిల్లాలో 51% ఉన్న ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన అంగన్‌వాడీ సహా అన్ని నియామకాల్లో ఆర్ఓఆర్ (RoR) రోస్టర్ పాయింట్లను కచ్చితంగా పాటించాలి. విద్య, విద్యాసంస్థల పర్యవేక్షణ, అంబేద్కర్ ఓవర్సీస్, బెస్ట్ అవైలబుల్, కార్పొరేట్ ఇంటర్ విద్య పథకాలను అర్హులకు అందించాలి. వసతి గృహాల్లో పక్కాగా డైట్ మెనూ అమలు చేయాలని, అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

కేసులదర్యాప్తువేగవంతం, నమోదైన కేసుల్లో డిఎస్పీ స్థాయి అధికారులు నిర్దేశిత గడువులోగా విచారణ పూర్తి చేసి సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణిలో ప్రత్యేకంగా న్యాయ సేవల కౌంటర్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఎస్పీ తిరుపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారమే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది: డాక్టర్ విజయలక్ష్మి




**హనుమకొండ, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :** జాతీయ పోషకాహార వారోత్సవాలలో భాగంగా పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అప్లైడ్ న్యూట్రిషన్ విభాగం) విద్యార్థినులు గురువారం హనుమకొండ ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మంజుల విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడుతూ...

మాతాశిశు ఆరోగ్య పరిరక్షణలో సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని, ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ విద్యకు, ఆరోగ్యానికి పోషకాహారమే పునాది అని, విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, అప్లైడ్ న్యూట్రిషన్ విభాగాధిపతి డా. జె. లకన్ సింగ్ మాట్లాడుతూ ఇటువంటి క్షేత్రస్థాయి పరిశీలనలు విద్యార్థినులకు ప్రాక్టికల్ అవగాహనను ఇస్తాయని తెలిపారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో పోషకాహార ప్రాధాన్యంపై విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. అరుణ, అధ్యాపకులు డా. కల్పన, డా. సుభాషిణి, సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు**
**గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి**



**ఖమ్మం వుదయం బ్యూరో/ కూసుమంచి, సెప్టెంబర్- 3** గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్‌వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. రైతును రాజు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతు రుణమాఫీ, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ. 1,76,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే వేగవంతం చేయాలి

**అధికారులకు సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్ సూచన**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)** ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరుగుతున్న భూ సంబంధిత కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని తెలంగాణ భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి డి.ఎస్. లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు రాజీవ్ గాంధీ హనుమంతు చేరుకున్నారు. వారికి జిల్లా కలెక్టర్ అంకిత్ సాదర స్వాగతం పలికి, పూల మొక్కను అందజేశారు. అనంతరం ఐడీఓసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో భూ సర్వే, సాదా బైనామా, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో భూ సంబంధిత కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ పునఃసర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారం, సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌తో పాటు ఉమ్మడి జిల్లాలకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)** సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పురుషుల, మహిళల ఓపీ రూమ్‌లను సందర్శించి అవుట్ పేషెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈరోజు ఎంతమంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎంసీ వార్డును, పీఎంజేవై, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను, డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను, జనరల్ మెడిసిన్ డాక్టర్ రూమ్‌ను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్ రూమ్, బ్లడ్ శాంపిల్ కౌంటర్‌ను తనిఖీ చేసి ఈరోజు పేషెంట్లకు ఏయే పరీక్షలు నిర్వహించారు, రిపోర్టులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలి. ప్రతిరోజూ ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలి. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలి. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్రచికిత్సల కోసం ఉపయోగించే మందులు, పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలి. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదు. దూర ప్రాంతాల నుండి వచ్చే వృద్ధులకు, వికలాంగులకు బయట వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలి, ఐడీ కార్డులు ధరించాలి. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాణి, జనార్ధన్, అనిత, శ్రీలత, ఉపేందర్, యశ్వంత్, వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై క్షేత్రస్థాయి పరిశీలన



**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)** యాదాద్రి భువనగిరి జిల్లా లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (Special Intensive Revision - SIR) 2026లో భాగంగా నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ (ఎస్సీడీడీ) కార్యదర్శి, జిల్లా ఎస్ఐఆర్ అబ్జర్వర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. గురువారం SIR ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తోకలసి ఎస్ఐర్ అబ్జర్వర్ విజయేందిర బోయి పరిశీలించారు.2026లో భాగంగా నోటీసులు జారీ చేయడం, విచారణ (హీరింగ్) నిర్వహించే ప్రక్రియ 17.08.2026 నుండి 16.09.2026 వరకు కొనసాగనున్న నేపథ్యంలో జిల్లాలోని 94భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం, భువనగిరి మండలం, అనంతారం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 11, 12లను సందర్శించారు. ఈ సందర్భంగా అబ్సర్వర్ నోటీసులు అందుకున్న ఓటర్లతో నేరుగా మాట్లాడి, నోటీసులు జారీ చేయడానికి గల కారణాలు, విచారణ సమయంలో సమర్పించాల్సిన పత్రాలు, తదితర అంశాలపై వారికి సరైన సమాచారం అందిందా లేదా అని ఆరాతీశారు. ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, సవరణ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం నోటీసుల పరిష్కారం, విచారణ ప్రక్రియలో నిమగ్నమైన బూత్ స్థాయి అధికారులు BLO సూపర్‌వైజర్లు, AEROలు నిర్వహిస్తున్న పనితీరును ఆమె సమీక్షించారు. ప్రతి నోటీసును నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగించేలా, అనర్హత ఉన్న సందర్భాల్లో తగిన ఆధారాలతో నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలోరెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ERO, జగన్ మోహన్ ప్రసాద్, ఏరోప్లేన్, ప్రణయ్ కుమార్, AERO / తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణలో విద్యుత్ వ్యవస్థ అత్యంత కీలకం

**తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 03** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్, ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజనీర్ బి. అనంత రాములు తొలి ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "Electrical Power Challenges in Irrigation Projects" అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటిపారుదల ప్రాజెక్టుల్లో విద్యుత్ వినియోగం, ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లు, విద్యుత్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే మార్గాలపై నిపుణులు చర్చించారు ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, "వ్యవసాయ రంగం అభివృద్ధిలో నీటిపారుదల ప్రాజెక్టులు ఎంత ముఖ్యమో, వాటి సమర్థవంతమైన నిర్వహణకు నిరంతరాయమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. ముఖ్యంగా భారీ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో విద్యుత్ అవసరం అధికంగా ఉంటుందని, అందువల్ల విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తూ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బి. అనంత రాములు ఇంజనీరింగ్ రంగానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఆయన పేరుతో ఎండోమెంట్ లెక్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సాంకేతిక సదస్సులు యువ ఇంజనీర్లకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. యాదయ్య, ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కుమార్, ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్ బానోతు, ఇంజనీర్లు, విద్యావేత్తలు, నిపుణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నీటి వనరుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి: కలెక్టర్

**చెరువుల కట్టలు, తూముల పటిష్టతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కలు తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలి**

**కాలువల భూముల్లో ఆక్రమణలను గుర్తించి తొలగించాలి**



**పెద్దపల్లి, సెప్టెంబర్-03 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని నీటి వనరులను పరిరక్షిస్తూ ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకునేలా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ పనితీరుపై సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలోని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో ఎలాంటి ఆక్రమణలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. నీటి వనరుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలోని చిన్నతరహా నీటిపారుదల చెరువుల కట్టల పటిష్టతను పరిశీలించాలని, తూములు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మతు పనులను గుర్తించి, వాటికి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.కాలువల్లో అవసరమైన చోట పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలు,తదితరాలను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.కాలువల భూముల్లో ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు.వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న సమయంలో అందుబాటులోకి వచ్చే ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి, సాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి వనరుల నిర్వహణ, కాలువల పరిస్థితి, చెరువుల కట్టలు, తూముల పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అధికారులు, ఇంజినీర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పనుల పురోగతి, నీటి వనరుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు.

సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భారీ ఊతం..

**సొంతింటి కలను సాకారం చేస్తాం.. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సిరిసిల్లలో 710 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 03 (వుదయం ప్రతినిధి):**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్‌హాల్‌లో గురువారం తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి 710 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, లబ్ధిదారులు పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలతో కూలీలు, వివిధ వృత్తుల వారికి ఉపాధి లభించడంతోపాటు స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, నూతన పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి ఒక్కరి కల అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలోని మోడల్ హౌస్‌లను సందర్శించి నిర్మాణంపై అవగాహన పొందాలన్నారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచించారు, రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.5 లక్షల సాయం జమ అవుతుందని వివరించారు. నిర్మాణ దశల ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు సేకరిస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్‌బాబు, తహసీల్దార్ మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



## పిల్లల సమగ్ర వికాసంపై ప్రత్యేక దృష్టిసారించాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 3 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**



అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా అన్ని రకాల మౌలిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలు, పెయింటింగ్స్, వర్ణమాల, విద్యా చార్టులతో అలంకరించి, ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు, రైమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువు తదితర వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి సామ్, మామ్ కేటగిరీకి చెందిన పిల్లల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణి, బాలింతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తనిఖీ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు, చదువు గురించి అడిగి తెలుసుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి రావాలని సూచించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించి, సంఖ్యలు చదివించడంతో పాటు వారికి చాక్లెట్లు అందించి అభినందించారు.

## యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్థల పరిశీలన...

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయగా జగిత్యాల నియోజకవర్గంలో తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి భోజనం క్రీడలు నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. 2500 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య హాస్టల్ భోజనం వంటి వసతి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించబోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. అధికారులు సైట్ ఇంజనీర్ లతో మాట్లాడి క్రీడా మైదానం పాఠశాల బ్లాక్ వసతి గృహాలు నిర్మాణ స్థలాన్ని సంబంధిత మ్యాప్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ నారాయణ రెడ్డి సర్పంచ్లు బొలిశెట్టి గంగారెడ్డి కట్ట రాజేందర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి సదానందం నలువాల సురేష్ దాసరి సతీష్ లింగారెడ్డి గడ్డం గంగారెడ్డి లక్ష్మణ్ శ్రీనివాస్ మహబూబ్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై అసెంబ్లీలో తేల్చుకుందాం

### మంత్రి అడ్లూరి సవాల్

**బీఆర్ఎస్ నాయకుల పై మంత్రిమండిపాటు**

**కేసీఆర్‌ను అసెంబ్లీ లో చర్చకు తీసుకురావాలి**

**కొప్పుల ఈశ్వర్‌కు వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ పంపి స్తానన్న మంత్రి**



**ధర్మపురి, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల ప్రజా పాలన అభివృద్ధి, సంక్షేమంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా వెంటబెట్టుకుని రావాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్మపురిలోని క్యాం పు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారా లు చేస్తున్నారని మంత్రి మండి పడ్డారు.రాహుల్ గాంధీని కేటీఆర్, హరీష్ రావు ఏకవచనంతో సంబోధించడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ అప్పులకు వడ్డీలు కడుతూనే ఇచ్చిన హామీల్లో ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, మిగతా వాటి అమలుకూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. 50 వేల ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు,బాసర నుం చి భద్రాచలం వరకు అన్ని ఆల యాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ధర్మపురిలో తాను చేపట్టిన అభివృద్ధిపై వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పంపిస్తున్నానని, అందులో తప్పులుంటే దేనికైనా సిద్ధమని మంత్రి అడ్లూరి సవాల్ విసి రారు. ఎల్లంపల్లి భూ నిర్వాసి తుల కోసం రూ. 17 కోట్లు విడుదల చేయించాం. ధర్మపురి లో డిగ్రీ కళాశాలను అందుబా టులోకి తెచ్చాం. ధర్మారంలో ఐటీఐ ఏర్పాటుతో పాటు, ధర్మ పురి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించాం. గోదావరి కాలుష్యం నివారణకు రూ.17కోట్లతో సివరేజ్ ప్లాంట్,రోళ్ల వాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం. నేరెళ్లలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. నియోజకవర్గంలో వివిధ నిధుల ద్వారా రూ. 141 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని వివరించారు. కొప్పుల మంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కేవలం కుల సంఘాల భవనాల ప్రొసీడింగ్స్‌తోసరిపెట్టారని విమర్శించారు.పోలీసులనుకొప్పులబెదిరించే ప్రయత్నం మానివేయాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమపై ఎలాంటి అక్రమ కేసులు లేవని, బీఆ ర్ఎస్ నేతలు తమ ఉనికిని కాపాడుకోవడాని కే ప్రభుత్వంపై నిరాధార ఆరోప ణలు చేస్తున్నారని మంత్రి లక్ష్మ ణ్ తేల్చిచెప్పారు. ఈ కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

**భక్తి, క్రమశిక్షణ, సామరస్యానికి ప్రతీకగా ఉత్సవాలు నిలవాలి:**

**పోలీస్ శాఖ కరీంనగర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి):**

గణేష్ ఉత్సవాలు–2026 సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు. ఉత్సవాల పేరుతో ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులు, వాహనదారులు లేదా ఇతరులపై ఎలాంటి బలవంతం, బెదిరింపు లేదా ఒత్తిడి తీసుకురాకుండా, స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలను మాత్రమే స్వీకరించాలని సూచించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయకూడదు. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వంటి అత్యవసర వాహనాలకు మార్గం ఎట్టి పరిస్థితుల్లోనూ నిరోధించరాదు. మండపాలు సురక్షితంగా నిర్మించడంతో పాటు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను అనుమతితో, నిపుణులైన ఎలక్ట్రీషియన్ల ద్వారా మాత్రమే ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాద నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచాలి. ప్రధాన మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలి. మండపాల పరిసరాల్లో అక్రమ పార్కింగ్‌కు అవకాశం ఇవ్వకుండా ట్రాఫిక్ పోలీసులకు నిర్వాహకులు, వాలంటీర్లు సహకరించాలి.ప్రధాన రహదారులు, జంక్షన్లు, అత్యవసర మార్గాలను నిరోధించకూడదు. అనుమతి పొందిన పరిధికి మించి రహదారులు లేదా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించరాదు.

**లౌడ్‌స్పీకర్లు, డీజేలపై నిబంధనలు పాటించాలి**

లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అవసరమైన అనుమతులు పొందాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన సమయాల్లో, నిర్దేశిత శబ్ద పరిమితుల్లోనే సౌండ్ సిస్టమ్ వినియోగించాలి. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డీజేలు లేదా ఇతర సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదు.

**శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి**

ప్రతి ముఖ్యమైన గణేష్ మండపం వద్ద పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలి. ఉత్సవాల సందర్భంగా గొడవలు, వివాదాలు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు నిర్వాహకులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సోషల్ మీడియాలో వదంతులు, ధృవీకరించని లేదా రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేయకూడదు. ప్రతి విగ్రహంతో తగిన సంఖ్యలో బాధ్యతాయుతమైన వాలంటీర్లు ఉండాలి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఊరేగింపుల వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలి.విగ్రహాల తరలింపునకు అనుమతి పొందిన వాహనాలను మాత్రమే వినియోగించాలి. విగ్రహాన్ని వాహనంపై సురక్షితంగా అమర్చాలి. వాహనాలపై అధిక సంఖ్యలో భక్తులను ఎక్కించరాదు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. వాహనాలపై ప్రమాదకరంగా నిలబడటం, వేలాడటం, స్టంట్లు చేయడం వంటి చర్యలను అనుమతించరాదు.

**నిమజ్జన ప్రదేశాల్లో భద్రత**

అధికారులు నిర్ణయించిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలి. భక్తులు లోతైన నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు, వాలంటీర్లు పర్యవేక్షించాలి. చిన్నపిల్లలను నీటి ప్రాంతాలకు దూరంగా ఉంచాలి.నిమజ్జన ప్రదేశాల్లో తగినంత లైటింగ్, అవసరమైన చోట లైఫ్ సేవింగ్ పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలి. నీటిలోకి దూకడం, ఈత కొట్టడం లేదా ఇతర ప్రమాదకర చర్యలకు పాల్పడరాదు.నిమజ్జనం కార్యక్రమం పూర్తయిన తర్వాత భక్తులు, వాలంటీర్లు అనవసరంగా నిమజ్జన ప్రదేశాల్లో ఉండకుండా చూడాలి. పోయిన లేదా లభించిన వస్తువులను పోలీసులకు అప్పగించాలి. ప్రమాదం, గాయం, వ్యక్తి తప్పిపోవడం లేదా ఇతర అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

**నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి**

ఉత్సవాల సందర్భంగా భక్తి, శాంతి, క్రమశిక్షణ, సామరస్యమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు. పోలీస్, ట్రాఫిక్, ఫైర్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలతో నిర్వాహకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలి.

పోలీసులు జారీ చేసే సూచనలు, అనుమతుల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజల భద్రత, ట్రాఫిక్ సజావుగా సాగడం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఉత్సవ కమిటీ బాధ్యత వహించాలని తెలిపారు.

## ఆధునిక సాగుతోనే రైతుకు అధిక ఆదాయం

### – జిల్లా స్థాయి కిసాన్ మేళాలో ఎంపీ గోడం నగేష్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

సంప్రదాయ సాగుకు ఆధునిక సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని సూచించారు. మావల మండలంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్ లో ఆత్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వాతావరణం, భూసారం, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్‌పామ్, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు ఎగుమతి అవకాశాలను పెంచాలని అన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులను ఒకే వేదికపైకి తీసుకురావడమే కిసాన్ మేళా ఉద్దేశమన్నారు. సేంద్రీయ వ్యవసాయం, ఆయిల్‌పామ్, డ్రోన్ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గిరిజన యువతకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణతో పాటు బ్యాంకు రుణాల ద్వారా ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు. యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతులపై ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ప్రతి గ్రామంలో గోదాములు, రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో 50 శాతం వ్యవసాయానికి కేటాయించాలని సూచించారు.ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులపై ఆధారపడకుండా మార్కెట్ యార్డుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం సాధించవచ్చన్నారు. అనంతరం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల స్టాళ్లతో పాటు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను ముఖ్య అతిథులు సందర్శించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్లు సంతోష్‌రావు, రాజు, నారాయణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌సింగ్, పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ని కలిసిన సబ్ కలెక్టర్

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ డివిజన్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ హర్ష చౌదరి గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె హరితను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ ను కాగజ్నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు.

## విద్యా సంస్థలలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

**మంచిర్యాల/సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)**



విద్యాభివృద్ధిలో భాగంగా విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధించి వారు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు తీసుకొని, ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ బికర్ణదాస్ లతో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూముల రీ సర్వే, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. రీ–సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను తప్పనిసరిగా పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేస్తూ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రీ–సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కు మంత్రి యోగం పై జోరుగా ప్రచారం

**కామారెడ్డి, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

మంత్రివర్గ విస్తరణ పై రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విస్తరణలో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉందనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఇటీవల ఆయన ఢిల్లీ పర్యటనలు పార్టీ అధిష్టానంతో సమావేశాలు ఈ ప్రచారానికి మరింత ఉతమిస్తున్నాయి. నిజాంబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు పదవి దక్కిన నేపథ్యంలో ఈ మంత్రివర్గ విస్తరణలో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్న ట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లాకు మంత్రి పదవి దక్కితే అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరుగుతాయని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ పై జరుగుతున్న ప్రచారంతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే జిల్లాలో జాబ్ మేళాలు పెట్టి ఎంతోమంది నిరు ద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పిం చిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవి దక్కితే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పాటు కామారెడ్డి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఈసారివిస్తరణలో మంత్రి పదవి దక్కడం ఖాయమని నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు నాయకులు సంబరాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 3(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్లు కట్టుదిట్టమైన భద్రత మధ్య భద్రపరిచినట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు.గురువారం త్రైమాసిక తనిఖీలో భాగంగా రాజ కీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగాఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసి, అక్కడ భద్రపరిచిన యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈవీఎంలు, వీవీప్యాట్లకు సంబంధించిన రికార్డులు, సీల్స్ పరిస్థితి, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు.స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు, భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీ లించారు.గోదాములోని ఒక ఫైర్ సేఫ్టీ పరికరం కాలప రిమితి ముగిసినట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే దానిని మార్చాలని సంబం ధిత అధికారులను ఆదే శించగా, పరికరాన్ని అధికారులు ఆ పరికరాన్ని అప్పటికప్పుడే మార్చారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీ ఎంలు, వీవీప్యాట్లను అత్యంత భద్రంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత, నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.స్ట్రాంగ్ రూమ్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, ఎన్నికల విభాగం అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్ శంకర్, సంబం ధిత రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ నాయకులు రాఘవ చౌదరి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలి



- **ఏ, బీ, సీ కేటగిరీలపై బీఎల్ఓలకు పూర్తిస్థాయి అవగాహన అవసరం**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, సెప్టెంబర్ 02 (వుదయం కరస్పాండెంట్)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పూర్తి అవగాహనతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని మండలాల ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లందరికీ నోటీసులు జారీ చేసి, నిర్దేశిత తేదీల్లో ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన ధ్రువపత్రాలతో హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఓటర్ల నుంచి అవసరానికి మించి పత్రాలు సేకరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఏ, బీ, సీ కేటగిరీలపై బీఎల్ఓలకు స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. ఆయా కేటగిరీలకు ఎన్ని పత్రాలు అవసరమో, ఏ ధ్రువపత్రాలు ఆమోదయోగ్యమైనవో సిబ్బంది పూర్తిగా తెలుసుకోవాలన్నారు.

అవసరమైన పత్రాల కంటే ఎక్కువగా సేకరించడం వల్ల ఆన్‌లైన్ పరిశీలన సమయంలో సమస్యలు తలెత్తడంతో పాటు, పత్రాల తిరస్కరణకు అవకాశం ఉంటుందని, తద్వారా ఎన్నికల సిబ్బందిపై అదనపు పని భారం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల ముందుగా సంబంధిత ఓటర్ల ఇంటికి వెళ్లి నోటీసు అందజేసి, అనంతరం వారికి అవసరమైన పత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేసి వాటిని మాత్రమే సేకరించాలని ఆదేశించారు. ప్రజలకు మొదటి దశలోనే పూర్తి సమాచారాన్ని అందించాలని, ఏదైనా పత్రం మిస్ కావడం లేదా అనవసరమైన పత్రం సేకరించడం వల్ల ఓటర్లను తిరిగి పిలిపించే పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ, బీ, సీ కేటగిరీల గుర్తింపు, అవసరమైన పత్రాల సంఖ్య, ఆమోదయోగ్యమైన ధ్రువపత్రాలు, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన లేని బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో స్పష్టత కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, ఇతర అధికారులు, ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడిగా బంక మోహన్‌రెడ్డి

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి):**



రెడ్డి జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా బంక మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెం గారి మాధవరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రెడ్డి జాగృతి బలోపేతానికి కృషి చేయడంతో పాటు బడుగు, బలహీన వర్గాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల ప్రతిభను ప్రోత్సహించాలి

**వనపర్తి సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)**




ప్రత్యేక అవసరాలు(CwSN) కలిగిన పిల్లల్లో అపారమైన ప్రతిభ ఉంటుంది, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉంది : అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో (CwSN) అపారమైన జ్ఞానం, ప్రతిభ దాగి ఉంటుందని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని ఎస్ఎల్‌వీ గ్రాండ్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిత కేంద్రాల ద్వారా శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చూసి గర్వపడాలని సూచించారు. పిల్లల సామర్థ్యాలను గుర్తించి, వారి లక్ష్యాలను సాధించేలా నిరంతరం ప్రోత్సహించాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం నెలకు రూ.4,000 పింఛన్ అందిస్తోందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తోందని తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన శిక్షణ, ఇతర సదుపాయాలు అందిస్తున్నట్లు చెప్పారు. IRPలు (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్) నిరంతరం పిల్లలకు సహకరిస్తూ, అవసరమైన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు.

తల్లిదండ్రులు కూడా పిల్లలకు అండగా నిలిచి, వారి సామర్థ్యాలను ప్రోత్సహిస్తూ లక్ష్య సాధనకు తోడ్పడాలని అదనపు కలెక్టర్ సూచించారు.

దివ్యాంగుల పింఛన్ల కోసం ప్రభుత్వం ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తోందని, సెప్టెంబర్ 16వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ప్రదర్శించిన వివిధ ప్రతిభా కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పిల్లలలోని సృజనాత్మకత, ప్రతిభను చూసి తల్లిదండ్రులు, అధికారులు, కార్యక్రమానికి హాజరైన వారు అభినందించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఇతర జిల్లా విద్యాశాఖ అధికారులు, భవిత కేంద్రాల సిబ్బంది, IRPలు, ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్ ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- **మంత్రి పొన్నం ప్రభాకర్**
- **సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సమావేశమైన మంత్రి పొన్నం**
- **సిద్దిపేట–ఎల్కతుర్తి జాతీయ రహదారి, మిట్టపల్లి ఆర్‌ఓబీ పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి**
- **ఎల్కతుర్తి జంక్షన్ వద్ద బాటిల్‌నెక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి**

**సిద్దిపేట, సెప్టెంబర్ 3 (వుదయం బ్యూరో)**

సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ (రోడ్లు & భవనాల శాఖ) రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రతిపాదనలు పంపిన పలు కొత్త రోడ్లకు వెంటనే నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమై నియోజకవర్గ పరిధిలోని రహదారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి పరిధిలో నిలిచిపోయిన పనులను వేగవంతం చేయాలని కోరారు. రహదారిపై పెండింగ్‌లో ఉన్న కల్వర్టుల నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయడంతో పాటు, మిట్టపల్లి వద్ద ఎంతో కీలకమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులను వేగవంతం చేస్తే వాహనదారులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని స్పష్టం చేశారు.

**ప్రమాదాల నివారణకు ఎల్కతుర్తి జంక్షన్ విస్తరణ:**

ఎల్కతుర్తి జంక్షన్ వద్ద కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారులు ఒకే చోట కలిసే ప్రాంతంలో రోడ్డు తీవ్ర ఇరుకుగా ఉండి బాటిల్‌నెక్‌లా మారిందని, దీనివల్ల తరచూ అక్కడ భయానక ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు జంక్షన్‌ను తక్షణమే విస్తరించి బాటిల్‌నెక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే కరీంనగర్-ఎల్కతుర్తి, ఎల్కతుర్తి-హనుమకొండ మధ్య కొనసాగుతున్న విస్తరణ పనులను కూడా వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రోడ్డు మౌలిక వసతులు అత్యంత కీలకమని, పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తయ్యేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.



## భూ సేకరణ పనులు.. వేగవంతంగా పూర్తి చేయాలి...జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, భారత్ మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్బింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత్‌మాల, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎం.జి.కె.ఎల్.ఐ, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుల సంబంధించిన భూసేకరణతో పాటు పునరావాసం, పునరావాస పరిహారం కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, దేవరకద్ర మండలాల పరిధిలో భూసేకరణ పురోగతిని సమీక్షిస్తూ అవార్డుల ప్రక్రియ, పరిహారం చెల్లింపులు, ఖాతా ధ్రువీకరణ, న్యాయస్థాన కేసులు, వివాదాస్పద భూముల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి, న్యాయస్థాన పరిధిలో ఉన్నవి, ఇతర వివాదాలకు సంబంధించిన కేసులను స్పష్టంగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని భూ యజమానులతో సమావేశం నిర్వహించాలని, వారి అభ్యంతరాలను నమోదు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. తహసీల్దార్లపై మాత్రమే ఆధారపడకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. వచ్చే వారంలోగా స్థానికులతో సమావేశం నిర్వహించి, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టి.జి.ఐ.ఐ.సి) ఆధ్వర్యంలో చేపడుతున్న బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారానికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ భూముల సర్వే పూర్తయినందున ప్రైవేట్ భూముల సర్వేను అదనపు సర్వేయర్లను నియమించి వేగవంతం చేయాలని, పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే అమర్‌రాజా పరిశ్రమకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో సర్వే, ఎస్‌డీఆర్ సమర్పణ, పరిహారం చెల్లింపుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, ఎస్‌డీఆర్ ప్రక్రియ పూర్తయిన భూములకు పరిహారం చెల్లింపు దస్త్రాలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి రోజువారీ పురోగతిని నమోదు చేసి పర్యవేక్షించాలని, వెంటనే పరిహారం చెల్లింపులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్మిస్తున్న వివిధ ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు అందించాల్సిన పునరావాసం, పునరావాస పరిహారం కార్యక్రమాల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో ప్రస్తుతం పెండింగ్ లేదని అధికారులు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు సరిపడా నిధులను ముందుగానే అంచనా వేసి, మిగులు నిధుల వివరాలను ప్రాజెక్టుల వారీగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవార్డులు, నిర్మాణాల పరిహారం, నిర్వాసితుల చెల్లింపులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, నిధుల అవసరం, ఇప్పటికే చేసిన చెల్లింపులు, మిగిలిన మొత్తాలను స్పష్టంగా చూపించే నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.భూసేకరణ ప్రక్రియలో ఏ దశలోనూ జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైని సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్డిఓ నవీన్, నీటిపారుదల శాఖ అధికారులు, తాసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన సెయింట్ ఆంథోనీస్ విద్యార్థి

- **600 మంది విద్యార్థుల్లో ప్రతిభ చాటిన సిద్ధం శెట్టి శ్రీమాన్.. ఢిల్లీ NCC క్యాంప్‌కు ఎంపిక**

**సంగారెడ్డివుదయం :**

రైఫిల్ షూటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థి సిద్ధం శెట్టి శ్రీమాన్ ప్రథమ స్థానాన్ని సాధించాడు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీమాన్, NCCలో చేరి కఠోర శిక్షణ పొందుతూ ఈ ఘనత సాధించాడు.

మే 20 నుంచి 29 వరకు వర్గల్‌లో 33(T) బెటాలియన్ NCC, సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్మీ శిక్షణ శిబిరంలో శ్రీమాన్ పాల్గొన్నాడు. ఆర్మీ శిక్షకులు సూచించిన మెళకువలను క్రమశిక్షణతో అభ్యసించి రైఫిల్ షూటింగ్‌లో 600 మంది విద్యార్థుల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్న వయసులోనే కఠినమైన శిక్షణను స్వీకరించి తన ప్రతిభను నిరూపించుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

NCC క్యాంపులో రైఫిల్ షూటింగ్‌తో పాటు ఆర్మీ శిక్షణ, జాతీయ సమైక్యత, సేవాభావం, క్రమశిక్షణ వంటి అంశాల్లో శ్రీమాన్ శిక్షణ పొందాడు. 8వ తరగతిలోనే NCCలో చేరిన శ్రీమాన్, వరుసగా నిర్వహించిన వివిధ శిక్షణ శిబిరాల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి క్యాంపులకు ఎంపికయ్యాడు.

కరీంనగర్‌లో జూన్ 13 నుంచి 22 వరకు జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న అనంతరం నిజామాబాద్‌లో నిర్వహించిన క్యాంపుకు ఎంపికయ్యాడు. అనంతరం కాకినాడలో జూలై 29 నుంచి ఆగస్టు 7 వరకు జరిగిన క్యాంపులోనూ ప్రతిభ కనబరిచాడు.





విజయవాడలో ఆగస్టు 7 నుంచి 27 వరకు నిర్వహించిన NCC శిబిరంలో పాల్గొన్న శ్రీమాన్, తదుపరి ఢిల్లీలో జరిగే ప్రతిష్ఠాత్మక NCC క్యాంపుకు ఎంపికయ్యాడు.సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న TSC (NCC) క్యాంపులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన NCC క్యాడెట్లు పాల్గొంటున్నారు. ఇందులో శ్రీమాన్ కూడా పాల్గొంటుండటం సంగారెడ్డి జిల్లా, సెయింట్ ఆంథోనీస్ పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. తమ పాఠశాల విద్యార్థికి జాతీయ స్థాయి NCC క్యాంపులో పాల్గొనే అవకాశం కల్పించిన 33(T) BN NCC సంగారెడ్డి కమాండర్, గ్రూప్ కమాండర్ హెడ్‌క్వార్టర్స్ నిజామాబాద్, AP&T డైరెక్టరేట్ అధికారులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.ఈ సందర్భంగా విద్యార్థి సిద్ధం శెట్టి శ్రీమాన్‌ను సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కిశెట్టి, NCC అధికారులు, ఆర్మీ అధికారులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 24 గంటల్లో పోగొట్టుకున్న చరవాణి లభ్యం



- **జగదేవ్‌పూర్ పోలీసుల చాకచక్యం!**

**సిద్దిపేట/జగదేవ్‌పూర్, (వుదయం ప్రతినిధి)**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో జగదేవ్‌పూర్ పోలీసులు మరొకసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. పోగొట్టుకున్న చరవాణిని (మొబైల్ ఫోన్) కేవలం 24 గంటల్లోనే స్వాధీనం చేసుకుని, ప్రజారక్షణలో తమ అంకిత భావాన్ని నిరూపించుకున్నారు.

ఈ నెల 01092026న మునిగడప గ్రామానికి చెందిన చల్లా బాలకృష్ణ తన చరవాణిని పోగొట్టుకుని జగదేవ్‌పూర్ రక్షకభట నిలయంలో (పోలీస్ స్టేషన్) ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన రక్షకభటుడు (కానిస్టేబుల్) నాగరాజు, కేంద్ర పరికరాల గుర్తింపు వ్యవస్థ (సి.ఇ.ఐ.ఆర్) సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి, రికార్డు స్థాయిలో 24 గంటల్లోనే దాని జాడ కనిపెట్టి స్వాధీనం చేసుకున్నారు. ఉప తనిఖీ అధికారి (ఎస్.ఐ) జె. కృష్ణారెడ్డి సమక్షంలో స్వాధీనం చేసుకున్న చరవాణిని బాధితుడు బాలకృష్ణకు అందజేశారు. పోలీసుల వేగవంతమైన సేవలకు ముగ్ధుడైన బాలకృష్ణ, రక్షకభటుడు నాగరాజును శాలువాతో సత్కరించి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సాంకేతికతను ఉపయోగిస్తూ అత్యంత ప్రతిభ కనబరిచిన నాగరాజును ఎస్.ఐ కృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్.ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... "చరవాణులు పోగొట్టుకున్నవారు ఆందోళన చెందకుండా వెంటనే రక్షకభట నిలయంలో ఫిర్యాదు చేయడంతో పాటు, ప్రభుత్వ సమాచార వేదికలో వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రజల ఆస్తుల రక్షణకు, భద్రతకు జగదేవ్‌పూర్ పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుంది" అని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ సాంకేతికతతో సేవలందిస్తున్న జగదేవ్‌పూర్ పోలీసుల పనితీరు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రజాసేవే పరమావధిగా, బాధితులకు అండగా' నిలుస్తూ ప్రజాస్వామ్యంలో రక్షకభట వ్యవస్థకు సరికొత్త నిర్వచనం చెబుతున్న జగదేవ్‌పూర్ పోలీసుల సేవలు నిజంగా అభినందనీయం!

## పటాన్చేరు జర్నలిస్ట్ ల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి

- **అర్హులైన జర్నలిస్టు ల ఇండ్ల స్థలాల కోసం కృషి..**
- **నాటి నుంచి జర్నలిస్టు సంక్షేమం కోసం పోరాడుతున్నది TUWJ-IJU మాతరమే.**
- **యూనియన్ల పేర్లు చెప్పి కొందరు చేస్తున్న కుట్రలను తిప్పి కొడతాం.**
- **పటాన్ చెరు నియోజవర్గం అధ్యక్షుడు నర్సింహా**
- **పటాన్ చెరు లో టీయూడబ్ల్యూజే ఐజేయూ కార్యవర్గ సమావేశం.**

**పటాన్చెరు (వుదయం):**



పటాన్ చెరు జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆపత్కాలంలో జర్నలిస్ట్ ల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తామని పటాన్ చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు పత్తి నర్సింహ అన్నారు.గురువారం పటాన్ చెరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో టీయూడబ్ల్యూజే ఐజేయూ పటాన్ చెరు నియోజకవర్గ నూతన కమిటీ మొదటి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గంలో జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కమిటీ సభ్యులు చర్చించారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయంలో కొందరు జర్నలిస్ట్ లకు ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని కొందరు జర్నలిస్టులకు కొన్ని కారణాల వలన ప్లాట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని జర్నలిస్టులు కమిటీ దృష్టికి తీసుకుని వచ్చారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి ప్లాట్ల విషయంపై చర్చిస్తే సానుకూలంగా స్పందించి అందరికి ఇండ్ల స్థలాలను అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఈ విషయంపై అధ్యక్షుడు పత్తి నర్సింహ తో పాటు జర్నలిస్ట్ పెద్దలు మాట్లాడుతూ సంఘం తరపున జర్నలిస్టుల సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం కొనసాగుతోందన్నారు. ఇండ్ల స్థలాల విషయంలో అందరూ జర్నలిస్టుల సహకారంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ను కలిసి స్థలాలు కేటాయించేలా కోరుతామన్నారు. పటాన్ చెరు జర్నలిస్టులకు ఆపత్కాలంలో అండగా నిలిచేందుకు జర్నలిస్టుల సహాయ నిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఐజేయూ మొదటి నుంచి కీలక పాత్ర పోషిస్తోందని నొక్కి చెప్పారు. ఇటీవల కొందరు వేరే యూనియన్ నాయకులు TUWJ IJU పై చేసిన అవాక్కులు చేవాక్కులు ఆపాలని, కనీస అవగాహన లేకుండ అర్ధరహితమైన మాటలు మనుకోవలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు జర్నలిస్టుల పక్షాన పోరాడుతున్నది కేవలం టి యు డబ్ల్యూ ఐజి మాత్రమే నని అన్నారు. అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి తో పాటు రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ అనుక్షణం జర్నలిస్టుల సంక్షేమం కోసమే ఆలోచిస్తున్నారన్నారు.

కొన్ని యూనియన్ల పేర్లు చెప్పుకుని జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, అలాంటి ప్రయత్నాలను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమర్థంగా తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం సంఘం భవిష్యత్తులో మరింత బలంగా ఉద్యమిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పర్స శ్రీనాథ్, పటాన్చెరు నియోజకవర్గ సలహాదారులు కాశిపతి, సులేమాన్, రామారావు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ భాద్యులు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజిద్, శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షులు విట్టల్, రాజు, నాగేష్, రమేష్, జీవరత్నం, సంయుక్త కార్యదర్శులు వేణు,శ్రీనివాస్, ప్రభాకర్, కోటేశ్, ఆర్గనిసింగ్ సెక్రటరీలు ఆంజనేయులు, మహేష్, రాజు, వివేక్, శ్రీనివాస్, శంకర్ శేఖర్ మహేందర్ గౌడ్ సిద్ధు శ్రీనివాస్, నాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- **సర్పంచ్ కనక రాజు**

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిధిలోని రజక్ పల్లి, గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కనకరాజు ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ కనకరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా గ్రామాన్ని పచ్చదనంతో నింపవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**కల్వకుర్తి సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి)**




తాండ్ర గ్రామ సమీపంలో సిలోని భావితాండా నుంచి హోమిని కారులో పేదలకు అందాల్సిన దాదాపు పది క్వింటల్లారేషన్ సన్న బియ్యాన్నిఅక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న అధికారులు పట్టుకొని వాహనాన్ని స్టేషన్ కు తరలించారు. కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# నడిగడ్డ గ్రామ అభివృద్ధికి నిధులు అందజేసిన జిల్లా కలెక్టర్



**తెలకపల్లి సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)**

తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ 16 లక్షల 11వేల చెక్కును సర్పంచ్ శశికళకు అందజేశారు. నడిగడ్డ గ్రామ సమీపంలోని దుందుభి నది నుండి మన ఇసుక వాహనం ద్వారా ప్రభుత్వం ప్రజల అవసరాల కోసం ఇసుక తరలించడం జరిగింది. దీని ద్వారా వచ్చిన డబ్బులను గ్రామ అభివృద్ధి కోసం చెక్కు రూపంలో కలెక్టర్ సర్పంచుకు అందజేయడం జరిగింది. ఈ డబ్బులను గ్రామంలోని మౌలిక వసతులు మెరుగుపరచడానికి వాడుతామని సర్పంచ్ శశికళ తెలిపారు.



# ధర్మపురిలో మరేనేని.రమ్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- **తుడుం దెబ్బ నాయకుల డిమాండ్**

**ధర్మపురి, సెప్టెంబర్ 3 (వు దయం ప్రతినిధి):**

ధర్మపురిలో మరేనేని.రమ్య అనుమానాస్పద మృతి ఘట నపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా ఏకపక్షంగా రిపోర్టు తయారు చేసి నిందితుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్న అధికారుల వైఖరిపై తుడుం దెబ్బ నాయకులు మండిప డ్డారు.స్థానిక తుడుం దెబ్బ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం అక్కపెల్లి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి జోజి రెడ్డి, తుడుం దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, డి.ఎల్.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మార్వాడి సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే 20న రమ్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందితే ఇప్ప టివరకు నిజాలు నిగ్గు తేల్చకపోవడం వెనుక బలమైన కారణా లు ఉన్నట్లు స్పష్టమవుతోందని వారు ఆరోపించారు.కూతవేటు దూరం లో మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ ఉండి కూడా ఆ బాధిత కుటుంబాన్ని పరామర్శించక పోవడం అత్యంత బాధాకరమన్నారు. అధికారం కోసం పాకులాడే నాయకు లకు ప్రజల బాగోగులు పట్టదా అని వారు ప్రశ్నించారు.ఓట్లు వేసి గెలిపిం చిన ప్రజలను ఆదుకోవాల్సిన కనీస బాధ్యత లేదా అని నిలదీశారు.నింది తుడు మీ పార్టీ వాడే నన్న కారణంతోనే కాపాడుతున్నారనే విమర్శలు వస్తున్నా యని,ఇదే వైఖరి కొనసాగితే భవిష్యత్తు లో తగిన మూల్యం చెల్లించుకోక తప్ప దని హెచ్చరించారు. ఇప్పటికైనా పక్షపా త వైఖరి వీడి న్యాయ విచారణ చేపట్టా లని డిమాండ్ చేశారు. అంత ఎత్తు ఉన్న చెట్టు ను ఆమె ఎలా ఎక్కిందని, అక్కడి నుండి ఎలా ఉరివేసుకున్నద నే అంశం ప్రశ్నగా మారిందని, దీనిపై స్పష్టత రావాలని కోరారు. ప్రజలు తిరగబడే లోపు నిందితుడిని అరెస్ట్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబా న్ని ఆదుకోవాలని, రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు 5 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో తుడుందెబ్బ నాయకులు బీమయ్య, సాగర్,శంకర్, లక్ష్మణ్,సత్తవ్వ పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం



**వేములవాడ, సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి):**

వేములవాడ పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు,రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు,ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, మెరుగ్గా అందేలా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు,జిల్లా రిజిస్టర్ అధికారి స్థిత ప్రజ్ఞ, వేములవాడ సబ్ రిజిస్టర్ దేవరం విజయభాస్కర్, సంబంధిత రిజిస్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**మెదక్ జిల్లా వుదయం నిజాంపేట,**

మండల వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల వేషధారణలు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణలో పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రజకుల అభ్యున్నతికి ఎస్సీ హోదా అవసరం

- **17 రాష్ట్రాల్లో ఎస్సీ లుగా,11 రాష్ట్రాల్లో ఓబీసీలా సామాజిక న్యాయం ఎక్కడ**
- **రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు చాకలి బస్వరాజు**

**వట్టిపల్లి సెప్టెంబర్ 3 (వుదయం ప్రతినిధి)**




దేశవ్యాప్తంగా ఒకే కులవృత్తి చేస్తున్న రజకులకు భిన్న రిజర్వేషన్లు ఉండటం సామాజిక న్యాయం ఎలా అవుతుందో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అన్నారు.

సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ కుమార్ మాజీ ఉపసర్పంచ్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు సిహెచ్ బస్వరాజు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ రజక కులస్తులు నేటికీ సమాజంలో వివక్షతకు గురైతున్నారని కుమ్మెర, ఖమ్మం, షాబాద్ ఘటనలే అందుకు ఉదాహరణలు అని వారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేష్ మాట్లాడుతూ కులం పేరుతో దూషిస్తూ రాజకీయంగా ఎదుగుతుంటే దాడులు చేయడం మీకు రాజకీయాలు అవసరమా చాకలోడ చాకలిదాన అని అవమానిస్తున్న సంఘటనలు నేటికీ రాష్ట్రంలో అక్కడక్కడ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఎవ్వరు చేయని పనులు రజకులు చేస్తున్నారని అందుకు సాక్ష్యాలు అంటు ముట్టు బట్టలు , మలమూత్ర విసర్జన చేసిన చిన్న పిల్లల బట్టలు, వృద్ధుల బట్టలు, మహిళల రుతుస్రావ సమయంలో ఉపయోగించిన బట్టలు ఉతకటం అంతేకాకుండా పుట్టిన దగ్గర నుంచి చావు వరకు అనేక మురికి పనులు చేస్తున్న రజకులు అంటరాని వారు కాకపోతే మరి ఏమవుతారని ప్రశ్నించారు. జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ కోడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో మాట్లాడిన మాటలకు నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నానని నిరూపించుకునే అవకాశం లభించిందని కాబట్టి తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు.

# ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలి

- **పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలి:**
- **జిల్లా వైద్యాధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి**

**గద్వాల, సెప్టెంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)**



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని రిపోర్టింగ్ సూపర్వైజర్లతో గురువారం ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు, పురోగతి, పనితీరును సమీక్షించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలు, పారామీటర్లు, సూచికలను నిర్ణీత సమయంలోగా సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఆరోగ్య కార్యక్రమాల క్షేత్రస్థాయి అమలును నిరంతరం పర్యవేక్షించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని DM&HO సూచించారు. సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.అలాగే ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన డేటా, రిపోర్టులను సకాలంలో, ఖచ్చితత్వంతో సంబంధిత పోర్టల్స్‌లో నమోదు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించడంతో పాటు వెనుకబడిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పురోగతిని నిరంతరం సమీక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. రాజు, డా. ప్రసూన రాణి, ఎస్ఓటి తిరుమల్ రెడ్డి, డిపిహెచ్ఎన్ఓ వరలక్ష్మి, ఇన్‌చార్జ్ డిఈఎంవో హిర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం.. చూపులేని వారికి వెలుగునిద్దాం

- **41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రజలకు జిల్లా అంధత్వ నివారణాధికారి, డీఎంహెచ్ఓ డా. సంధ్య కిరణ్మయి పిలుపు**

**గద్వాల, సెప్టెంబర్ 03 (వుదయం కరస్పాండెంట్)**



నేత్రదానం ద్వారా చూపులేని వారికి వెలుగును అందించవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణాధికారి, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సంధ్య కిరణ్మయి పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి గద్వాల్‌లో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేత్రదానం ప్రాముఖ్యతను వివరించిన అధికారులు.. మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా చూపులేని వారికి కంటి చూపును అందించే అవకాశం ఉంటుందని తెలిపారు."నేత్రదానం మహాదానం" అని పేర్కొన్న డా. సంధ్య కిరణ్మయి, ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు చూపులేని వ్యక్తులకు చూపు కల్పించే అవకాశం ఉంటుందని వివరించారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను నమ్మవద్దని సూచించారు.

"సర్వేంద్రియానాం నయనం ప్రధానం" — అన్ని ఇంద్రియాలలో కళ్ళు అత్యంత ప్రధానమైనవని పేర్కొంటూ, "మీ కళ్ళకు దీర్ఘాయుష్షునివ్వండి.. నేత్రదానం చేయండి.. చూడలేని వారికి కంటి చూపునివ్వండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

**నేత్రదానానికి ఎవరిని సంప్రదించాలి?**

నేత్రదానం చేయాలనుకునే వారు సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశాఖ సిబ్బందిని సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే హైదరాబాద్ మెహదీపట్నంలోని సరోజినీ దేవి కంటి ఆసుపత్రి - టి.ఎల్. కపాడియా ఐ బ్యాంక్ను 9121433434 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు డా. వెంకటదాస్, డా. రవిసింగ్, ప్రొఫెసర్ డా. సత్యవాణి (హెచ్ఓడీ, ఆప్తమాలజీ), డా. మహేష్ గౌడ్ (నేత్ర వైద్యులు), ఐ బ్యాంక్ టెక్నీషియన్ గంగాధర్, నర్సింగ్ సిబ్బంది, ప్రవీణ్ కుమార్ (నేత్ర వైద్యాధికారి ఇన్‌చార్జి), డెమో హిర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల సంరక్షణకు పక్కా ప్రణాళిక

- **164 వెట్‌ల్యాండ్ల సర్వే, మ్యాపింగ్ పూర్తి చేయాలి.**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 03 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలో గుర్తించిన 164 చెరువులు, వెట్‌ల్యాండ్ల సంరక్షణ, అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపట్టాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ, నీటిపారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.చెరువులు, వెట్‌ల్యాండ్లు నీటి నిల్వకు మాత్రమే కాకుండా భూగర్భ జలాల పెంపు, పర్యావరణ సమతుల్యతకు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి చెరువు హద్దులు, పూర్తి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ వివరాలను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించారు. ఇందుకోసం సంయుక్తంగా సర్వే నిర్వహించి మ్యాపింగ్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు,జల వనరుల అభివృద్ధి, మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలను అటవీ శాఖకు పంపించాలని ఆదేశించారు. చెరువుల అభివృద్ధితో స్థానిక, వలస పక్షులు, వన్యప్రాణులకు ఆవాసాలు మెరుగుపడటంతోపాటు పర్యాటక రంగానికి ఊతమిస్తుందని తెలిపారు. ఆక్రమణలను నిరోధించేందుకు చెరువుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వేలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. తమ శాఖలకు సంబంధించిన భూముల పూర్తి వివరాలను సర్వే అధికారులకు అందించి ప్రక్రియలో పాల్గొనాలని అటవీ, నీటిపారుదల తదితర శాఖల అధికారులకు సూచించారు. దీంతో ప్రభుత్వ భూముల వివరాలు పక్కాగా నమోదవుతాయని తెలిపారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులు పాల్గొనేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, నీటిపారుదల శాఖ అధికారి ప్రశాంత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హవాయిగూడ భూములపై పత్రికల వార్తలు అవాస్తవం: జిల్లా కలెక్టర్ స్పష్టత

- **సర్వే నంబర్ 49లోని 51.17 ఎకరాలు ముమ్మాటికీ పట్టా భూమే**
- **పొరపాటున వర్గీకరణ మారితే సరి చేశాం.. పేర్లు మార్చలేదు**
- **ఈనాడు, నమస్తే తెలంగాణల్లో వచ్చిన కథనాలు నిరాధారం, అసత్యం**

**సిద్దిపేట, సెప్టెంబర్ 3 (వుదయం బ్యూరో)**



గజ్వేల్ మండలం హవాయిగూడ గ్రామంలోని సర్వే నంబర్ 49లోని భూములకు సంబంధించి ఈనాడు వార్తాపత్రికలో ప్రచురితమైన "52 ఎకరాలు పందేరం" మరియు నమస్తే తెలంగాణ పత్రికలో ప్రచురితమైన "రాత్రికి రాత్రే అసైన్‌డ్‌కు పట్టా" అనే కథనాలు పూర్తిగా అవాస్తవాలు, కల్పితాలు మరియు నిరాధారమని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేశారు. వాస్తవాలు పరిశీలించకుండా ప్రచురించిన ఈ కథనాలను ఖండిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

వాస్తవ రెవెన్యూ రికార్డుల వివరాలు:

గజ్వేల్ మండలం హవాయిగూడ గ్రామంలోని సర్వే నంబర్ 49 మొత్తం విస్తీర్ణం 83.04 ఎకరాలు. దీనికి సంబంధించి పక్కా రెవెన్యూ రికార్డుల వాస్తవ సమాచారం క్రింది విధంగా ఉంది:

* గైరాన్ & పట్టా విస్తీర్ణాలు: 195960 పహానీ మరియు రెవెన్యూ సప్లమెంటరీ సెత్వార్ (ఫైల్ నం. C3/781/78) ప్రకారం.. మొత్తం 83.04 ఎకరాలలో 31.27 ఎకరాలు గైరాన్ (ప్రభుత్వ భూమి) కాగా, మిగిలిన 51.17 ఎకరాలు రఘుపతి రావు, నర్సయ్యల పేరిట స్పష్టంగా నమోదైన పట్టా భూమి.

* భూమి సబ్ డివిజన్ (పోడి) రికార్డులు:

* సర్వే నంబర్ 49/1 (31.27 ఎకరాలు): ప్రభుత్వ భూమి (గైరాన్). దీనిని 37 మందికి అసైన్మెంట్ ఇచ్చి, సర్వే విభాగం ద్వారా పోడి రికార్డులు కూడా తయారు చేశారు.

* సర్వే నంబర్ 49/2 నుండి 49/5 వరకు (51.17 ఎకరాలు): హనుమంతరావు మరియు వారి వారసుల పేరిట నమోదైన పట్టా భూమి.

195960 నుండి 201011 పహానీల వరకు 31.27 ఎకరాల ప్రభుత్వ భూమి 37 మంది అసైన్‌దారుల పేరిట, 51.17 ఎకరాలు పట్టాదారు రఘుపతిరావు, నర్సయ్య లేదా వారి వారసుల పేరిట యథాతథంగా కొనసాగుతున్నాయి.

తప్పుగా నమోదైన 'వర్గీకరణ' సరిచేత మాత్రమే:

గతంలో ధరణి పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో 31.27 ఎకరాల అసైన్మెంట్ భూమితో పాటు, పక్కనే ఉన్న 51.17 ఎకరాల పట్టా భూమిని కూడా పొరపాటున 'అసైన్డ్ భూమి'గానే నమోదు చేశారు. ఆ తర్వాత 'భూభారతి' పోర్టల్‌లో కూడా ఇదే రికార్డు కొనసాగింది. తన పట్టా భూమి 'అసైన్డ్'గా తప్పుగా నమోదు కావడంతో పట్టాదారులు వర్గీకరణ సవరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై గజ్వేల్ తహశీల్దార్, గజ్వేల్ ఆర్డీవోల క్షేత్రస్థాయి విచారణ, రికార్డుల పరిశీలన మరియు పక్కా సిఫారసుల మేరకే జిల్లా కలెక్టర్ భూమి యొక్క 'వర్గీకరణ' మార్పునకు ఆమోదం తెలిపారు.

**రికార్డులు, పేర్లు యథాతథం – అసత్య కథనాలను నమ్మవద్దు:**

ఈ ప్రక్రియలో అధికారులు కేవలం పోర్టల్‌లో తప్పుగా నమోదైన 'వర్గీకరణను' మాత్రమే సరిచేశారని, అసైన్‌దారుల పేర్లు గాని, పట్టాదారుల పేర్లు గాని ఎలాంటి మార్పు చేయలేదని కలెక్టర్ తేల్చిచెప్పారు. 195960 నుంచి ఇప్పటివరకు భూభారతిలో ఉన్న పేర్లే నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ అసైన్డ్ భూమిని పట్టాగా మార్చారని, 52 ఎకరాల ప్రభుత్వ భూమిని పందేరం చేశారని ప్రచురించిన వార్తలు సత్యదూరమని, ప్రజలు ఎలాంటి భ్రమలకు గురికావొద్దని జిల్లా పౌర సంబంధాల అధికారి (డి పి ఆర్ ఓ) ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ స్పష్టం చేశారు.

# మహాధర్నాకు సిద్ధంకండి.. 5న హైవేపై వంట వార్పు



- **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫైర్**
- **ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొంటారని వెల్లడి**
- **సీఎం రేవంత్ రెడ్డి పై విమర్శల వర్షం**
- **ప్రజలను మోసం చేయడంలో సీఎం దిట్ట**

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 3, వుదయం:**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ నేషనల్ హైవే దిగ్బంధం చేపడతామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సిపూర్ సమీపంలోని జాతీయ రహదారి పై ఈనెల 5 న చేపట్టబోయే మహాధర్నాతో పాటు వంట వార్పు కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచిపోయిన ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం కావడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి రేవంత్ రెడ్డి అధికారాన్ని అనుభవిస్తున్నాడని ఆరోపించారు. ప్రజా, రైతు సంక్షేమాన్ని పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. యూరియా కోసం యాప్ ఏర్పాటుచేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం గోసపెడుతుందన్నారు. హబ్సిపూర్ చౌరస్తాలో నిర్వహించే మహాధర్నాకు మాజీమంత్రి హరీష్ రావు తో పాటు మాజీ శాసనసభ్యులు హాజరవుతారని రైతులు, ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే ధర్నాలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మిరుదొడ్డి, దుబ్బాక, తోగుట , దౌల్తాబాద్, అక్బర్ పేటభూంపల్లి మండలాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు బోగస్ 420 హామీలు మోసం

- **రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **మాజీ జెడ్పీటిసి కేసిరెడ్డి వెంకట్రావమ్మ చిన్నారెడ్డి**
- **మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి**
- **మాజీ మండల అధ్యక్షులు గజ్జె ఈదన్న యాదవ్**

**చిన్నంబావి మండలం 03 (వుదయం రిపోర్టర్)**

చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ది దగాకోరు పాలన అని బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిస్తూ రైతులను అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు చేసారు. ఆరు గ్యారంటీలు,420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మాజీ జడ్పిటిసి, మాజీ ఎంపీపీ తీవ్రస్థాయిలో విమర్శించారు. సందర్భంగా సీనియర్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రైతులకు బోనస్ ఏమైంది రైతులకు ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు కల్లాల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకుని రోజుల తరబడి కొనుగోళ్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వడ్డేమాన్ రామకృష్ణ మాట్లాడుతూ ఎల్‌నినో పేరుతో పంటలు వేయొద్దంటూ రైతులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొంతమంది రైతులు చదువు, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. పింఛన్ల హామీపై విమర్శలు వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనిఅయితే కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్, డేగ శేకర యాదవ్, వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, అనంత జయ గౌడ్, గొంది నిరంజన్ రెడ్డి, కంచి కరుణాకర్, మేకల మై చంద్ర, జింకల రమేష్ నాయుడు, బాలా గౌడ్, పాల్గొన్నారు.

# అహోరాత్ర సర్పసూక్తగరుడ మన్యుసూక్త యాగం ప్రారంభం




**నంగునూరు, సెప్టెంబర్ 3, వుదయం :**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలోని అంజనాద్రి చింతగుట్ట శ్రీ గరుడాంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో గురువారం అహోరాత్ర సర్పసూక్తగరుడ మహామన్యుసూక్త యాగం, హోమ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ యాగాన్ని నిరంతరాయంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బెజగం రవీంద్ర ప్రసాద్‌నర్మద తెలిపారు. లోకక్షేమం, సర్వజన శాంతి, సుఖసంతోషాల కోసం ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేద మంత్రోచ్చారణలు, హోమాగ్ని జ్వాలలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. యాగం ప్రారంభోత్సవం సందర్భంగా 11 మంది భక్తులు హనుమాన్ దీక్ష స్వీకరించి మాలాధారణ చేశారు.యాగ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగానికి వచ్చే భక్తులు తమ శక్తి మేరకు కనీసం 100 గ్రాముల నెయ్యిని తీసుకువచ్చి యాగంలో సమర్పించవచ్చని, యాగంలో నెయ్యి సమర్పించడం వల్ల పుణ్యఫలం లభిస్తుందని ధర్మకర్త తెలిపారు. ఈ పవిత్ర యాగంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

# చక్కని ఆరోగ్యం

## వయసు కనిపించకుండా..!

వయసు పైబడుతున్న కొద్దీ ముఖంపై ముడతలు ఏర్పడటం సహజం. దీనిని నివారించడానికి చాలామంది తరచూ బ్యూటీపార్లర్‌కి వెళుతుంటారు. యాంటీ ఏజింగ్ క్రీములు రాయడం, ట్రీట్‌మెంట్ తీసుకోవడం చేస్తుంటారు. అయితే వీటితో పాటు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల కూడా ఫలితాలుంటాయని చెబుతున్నారు నిపుణులు.



ఈ క్రమంలో – ఆహారంలో తప్పనిసరిగా భాగం చేసుకోవాల్సిన కొన్ని పదార్థాల గురించి తెలుసుకుందాం రండి..

ఉసిరిలో విటమిన్ 'సి' అధికంగా లభిస్తుంది. అలాగే చర్మ పోషణకు అవసరమైన ఖనిజ పదార్థాలు కూడా ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనిలోని పోషకాలు రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తాయి. ఫలితంగా చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు నిపుణులు. ఉసిరిని తినడం వల్ల జుట్టు రాలే సమస్య కూడా తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు.

సాల్మన్ చేపల్లో ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మ కణాలు పాడవకుండా రక్షణ కల్పిస్తాయి. ఫలితంగా చర్మం ఆరోగ్యంగా తయారవుతుందంటున్నారు నిపుణులు.

ఆలివ్ ఆయిల్ ఆరోగ్యానికి, అందానికి మేలు చేస్తుందన్న విషయం తెలిసిందే. దీనిలో ఉండే పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, మోనోశ్యాచురేటెడ్ కొవ్వులు.. వృద్ధాప్య ఛాయలు రానివ్వకుండా చేస్తాయి. అందుకే వంటల్లో ఆలివ్ నూనెను కూడా చేర్చుకోవాలి. అలాగే అప్పుడప్పుడు ఆలివ్ నూనెతో చర్మాన్ని మర్దన చేసుకుంటూ ఉండాలని చెబుతున్నారు నిపుణులు.

సూర్యరశ్మి, అతినీలలోహిత కిరణాల ప్రభావం వల్ల కూడా చిన్న వయసులోనే చర్మం ముడతలు పడుతుంది. కోకో బీన్స్‌తో తయారు చేసిన డార్క్ చాక్లెట్ ఈ ప్రభావాన్ని కాస్త తగ్గిస్తుందట. దీనిలో లభించే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి రక్త ప్రసరణ సరిగా జరిగేలా చేస్తాయట. అలాగే ఇది చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతుంది. ఫలితంగా చర్మం యవ్వనంగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు.

బాదం, జీడిపప్పు, పిస్తా లాంటి గింజలను తినడం ద్వారా అన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పుష్కలంగా లభిస్తాయి. ఇవన్నీ చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే వీటిని మితిమీరి ఎక్కువగా తినడం వల్ల లావయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల మోతాదు మించకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు నిపుణులు.

నారింజ జాతి పండ్లలో నీటి శాతం ఎక్కువ ఉంటుంది. అలాగే విటమిన్ 'సి' కూడా పుష్కలంగా లభిస్తుంది. ఇది చర్మ ఆరోగ్యానికి ఎంతో తోడ్పడుతుంది.

రోజూ సరైన మోతాదులో నీళ్లు తాగడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ అందుతుందని చెబుతున్నారు నిపుణులు.

## గర్భం దాల్చే సమయానికి ఎక్కువ ఆరోగ్య సమస్యలు ఉంటే మహిళలకు ప్రమాదమే..

గర్భం దాల్చే సమయానికి ఒకటి కంటే ఎక్కువ దీర్ఘకాలిక శారీరక లేదా మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళల్లో గర్భధారణ సమయంలో కొన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తాజా పరిశోధన వెల్లడించింది. ఇలాంటి మహిళల్లో గర్భస్రావం జరిగే ప్రమాదం 20 శాతం ఎక్కువగా ఉండటంతో పాటు, తీవ్రమైన వికారం, వాంతులు వచ్చే ప్రమాదం 69 శాతం అధికంగా ఉంటుందని అధ్యయనం సూచించింది. ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధన ప్రకారం.. గర్భం ప్రారంభించే సమయంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళల్లో గర్భధారణ సమయంలో ఆందోళన, డిప్రెషన్ వచ్చే ప్రమాదం దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళల్లో సిరల్లో



రక్తం గడ్డకట్టే సమస్యగా చెప్పే వెనస్ థ్రాంబోఎంబోలిజం వచ్చే ప్రమాదం రెండు రెట్లకు పైగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అలాగే గర్భధారణ సమయంలో అధిక రక్తపోటుతో కూడిన ప్రీ–ఎక్లాంప్సియా వచ్చే ప్రమాదం 42 శాతం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. మహిళలకు ఉన్న దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల సంఖ్య పెరిగే కొద్దీ గర్భధారణ సమస్యల ప్రమాదం కూడా పెరుగుతున్నట్లు పరిశోధనలో వెల్లడైంది. మూడు లేదా అంతకంటే ఎక్కువ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళల్లో వెనస్ థ్రాంబోఎంబోలిజం ప్రమాదం, ఎలాంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు లేని మహిళలతో పోలిస్తే మూడున్నర రెట్లకుపైగా ఉన్నట్లు గుర్తించారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న గర్భిణులను ప్రసూతి సంరక్షణ ప్రారంభ దశలోనే గుర్తించి, వారి శారీరక, మానసిక ఆరోగ్య అవసరాలను కలిపి అంచనా వేయడం అవసరమని పరిశోధకులు సూచించారు. ప్రసూతి వైద్యం, ప్రాథమిక ఆరోగ్య సేవలు, మానసిక ఆరోగ్య సేవల మధ్య మెరుగైన సమన్వయం ఉండాలని నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భధారణ సమయంలో ఆందోళన, డిప్రెషన్ వచ్చే ప్రమాదం దాదాపు నాలుగు రెట్లు పెరగడం ఆందోళన కలిగించే అంశమని పరిశోధకులు తెలిపారు. అందువల్ల గర్భధారణ సమయంలో మానసిక ఆరోగ్య సహాయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## ప్రపంచాన్ని మళ్లీ వణికిస్తున్న మీజిల్స్.. టీకాలే రక్షణ..

ఈ ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.1 కోట్ల మంది మీజిల్స్ వైరస్ బారినపడే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేస్తోంది. ఆఫ్రికా, ఆసియా దేశాల్లో కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశమున్నప్పటికీ, అమెరికా ఖండం, యూరప్‌లోనూ వ్యాధి వ్యాప్తి కొనసాగుతోంది. మీజిల్స్‌కు ప్రత్యేక చికిత్స లేకపోయినా, టీకాలు సురక్షితంగా, సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. టీకాలు తీసుకోని వారికి వినికిడి, చూపు కోల్పోవడం, చివరకు మరణం వంటి తీవ్ర సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. పోషకాహార లోపం, వైద్య సదుపాయాల కొరత ఉన్న ప్రాంతాల్లో ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది.



మీజిల్స్ అత్యంత వేగంగా వ్యాపించే అంటువ్యాధుల్లో ఒకటి. ఒక సమాజాన్ని రక్షించాలంటే టీకా కవరేజీ 95 శాతానికి పైగా ఉండాలి. దీనినే సామూహిక రోగనిరోధకత అంటారు. ఒక డోస్‌తో చాలామందికి రక్షణ లభించినా, మెరుగైన రక్షణ కోసం రెండు డోసులు అవసరం. అధిక ఆదాయ దేశాల్లో పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కవరేజీ 95 శాతం కంటే తక్కువగా ఉంది. తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. కరోనా మహమ్మారి సమయంలో టీకా సరఫరా వ్యవస్థలు దెబ్బతినడంతో లక్షలాది మంది పిల్లలు ఒక్క డోస్ కూడా పొందని జీరో–డోస్ చిల్డ్రన్‌గా మిగిలిపోయారు. యుద్ధాలు, రాజకీయ అస్థిరత, శరణార్థుల సంఖ్య పెరగడం, టీకాల కొరత మీజిల్స్ వ్యాప్తిని మరింత తీవ్రం చేస్తున్నాయి. బురుండి, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సోమాలియా, సూడాన్, యెమెన్ వంటి దేశాల్లో వ్యాప్తి నమోదైంది. బంగ్లాదేశ్‌లో ఈ ఏడాది భారీగా కేసులు నమోదవడంతో పాటు 900 మందికి పైగా మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. రాజకీయ అస్థిరత కారణంగా టీకాల కొనుగోలు, సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం పరిస్థితిని మరింత దిగజార్చింది. గావి వంటి అంతర్జాతీయ సంస్థలకు నిధులు తగ్గితే తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాలకు టీకాలు అందించడం మరింత కష్టమయ్యే అవకాశం ఉంది. అమెరికా ఖండంలోనూ పరిస్థితి తీవ్రంగా మారింది. ఒకప్పుడు మీజిల్స్ రహిత ప్రాంతంగా గుర్తింపు పొందిన అమెరికా ఖండం ఇప్పుడు మళ్లీ వ్యాప్తిని ఎదుర్కొంటోంది. కెనడా తన మీజిల్స్ నిర్మూలన హోదాను కోల్పోగా, మెక్సికో, అమెరికా కూడా అదే పరిస్థితికి చేరువయ్యాయి. గ్వాటెమాలాలో ఈ ఏడాదిలో 30 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. తక్కువ టీకా కవరేజీ ఉన్న కొన్ని మతపరమైన, సంప్రదాయవాద వర్గాల్లో వ్యాధి వేగంగా వ్యాపించింది. ఒక ప్రాంతంలో ప్రారంభమైన వైరస్ ఇతర సమాజాలకు, దేశాలకు చేరడంతో పరిస్థితి మరింత క్లిష్టమైంది.

## వినికిడి లోపం.. మెదడును బలహీనపరుస్తుందా?

వయసు పెరిగే కొద్దీ వినికిడి తగ్గడం చాలామందిలో కనిపించే సాధారణ సమస్య. అయితే దీనిని కేవలం చెవులకు సంబంధించిన సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. వినికిడి లోపానికి, జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యం దెబ్బతినడం, డిమెన్షియా వంటి సమస్యలకు మధ్య సంబంధం ఉండొచ్చని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.



వినికిడి సరిగా లేకపోతే ఇతరులు మాట్లాడే మాటలను అర్థం చేసుకోవడానికి మెదడు ఎక్కువగా శ్రమించాల్సి రావచ్చు. దీనికి తోడు కొంతమంది సామాజిక కార్యక్రమాలు, కుటుంబ సమావేశాలు, స్నేహితులతో మాట్లాడటం వంటి వాటికి దూరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా ఒంటరితనం, సామాజిక సంబంధాలు తగ్గడం వంటి సమస్యలు రావచ్చు. ఇవన్నీ కలిసి మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. మెదడుపై అదనపు భారం: మాటలు స్పష్టంగా వినిపించనప్పుడు వాటి అర్థాన్ని తెలుసుకోవడానికి మెదడు అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఎక్కువగా విశ్లేషించాల్సి రావచ్చు. దీర్ఘకాలం ఇలా కొనసాగితే మెదడుపై మానసిక భారం పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు. వినికిడి సమస్య ఉన్నవారు ఇతరులతో మాట్లాడటంలో ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు. దీంతో కుటుంబ కార్యక్రమాలు, స్నేహితులతో కలవడం, ఇతర సామాజిక కార్యకలాపాలకు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీనివల్ల ఒంటరితనం పెరగవచ్చు. దీర్ఘకాలిక వినికిడి లోపం, పెరిగిన మానసిక శ్రమ, సామాజిక సంబంధాలు తగ్గడం వంటి అంశాలు మెదడు పనితీరు, నిర్మాణంలో కొన్ని మార్పులతో సంబంధం కలిగి ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. వినికిడి పరికరాలు వినికిడి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వీటి వల్ల ఇతరులతో మాట్లాడటం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, రోజువారీ పనులు సులభంగా చేయడం వంటివి మెరుగుపడవచ్చు. అయితే వినికిడి పరికరాలు డిమెన్షియాను నివారిస్తాయని కచ్చితంగా చెప్పడానికి ప్రస్తుతం సరిపడా ఆధారాలు లేవు.

## గాయాలకు పసుపు పెడుతున్నారా?

మన ఇళ్లలో ఎవరికైనా చిన్న గాయం అయినా వెంటనే పసుపు పెట్టడం చాలా కాలంగా వస్తున్న సంప్రదాయం. పసుపుకు గాయాలను మాన్పే గుణాలు ఉన్నాయని పెద్దలు చెబుతుంటారు. అయితే ప్రతి రకమైన గాయానికి పసుపు ఉపయోగించడం సురక్షితమేనా? గాయాల విషయంలో పసుపు ఎంతవరకు ఉపయోగపడుతుంది? ఎప్పుడు ఉపయోగించాలి? ఎప్పుడు వైద్యులని సంప్రదించాలి? తెలుసుకుందాం.. పసుపులో ప్రధానంగా ఉండే కర్కుమిన్ అనే పదార్థానికి వాపును తగ్గించే, కొన్ని రకాల సూక్ష్మజీవుల పెరుగుదలను అడ్డుకునే లక్షణాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. కొన్ని ప్రయోగశాల, జంతు అధ్యయనాల్లో కర్కుమిన్ గాయం మాన్పే ప్రక్రియకు సహాయపడొచ్చని తేలింది. అయితే మనుషుల్లో గాయాలపై పసుపును నేరుగా ఉపయోగించడం వల్ల కచ్చితంగా త్వరగా మానిపోతుందని చెప్పడానికి బలమైన ఆధారాలు పరిమితంగానే ఉన్నాయి. అందుకే పసుపును అన్ని గాయాలకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు.



చిన్న గాయాలకు సాధారణంగా ముందుగా గాయాన్ని శుభ్రంగా కడగడం ముఖ్యం. అయితే లోతైన గాయాలు, ఎక్కువగా రక్తస్రావం అవుతున్న గాయాలు, తీవ్రమైన కాలిన గాయాలు వంటి వాటికి పసుపు పెట్టుకుని ఇంట్లోనే చికిత్స చేసుకోవడం మంచిది కాదు. అలాంటి గాయాలకు సరైన ప్రథమ చికిత్సతో పాటు వైద్యుల సలహా అవసరం. గాయం లోతుగా ఉంటే కుట్లు అవసరమయ్యే అవకాశం కూడా ఉంటుంది. గాయంపై నేరుగా పసుపును పెట్టడం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉండొచ్చు.

కొందరికి పసుపు వల్ల చర్మంపై దురద, మంట లేదా అలర్జీ కూడా రావచ్చు. అందువల్ల గాయం అయిన వెంటనే పసుపు వేయడం కంటే ముందుగా శుభ్రమైన నీటితో గాయాన్ని కడగడం ముఖ్యం.

చిన్న గాయం అయితే ముందుగా చేతులను శుభ్రం చేసుకుని, గాయాన్ని శుభ్రమైన ప్రవహించే నీటితో కడగాలి. రక్తస్రావం ఉంటే శుభ్రమైన వస్త్రంతో స్వల్ప ఒత్తిడి ఇవ్వాలి. అనంతరం అవసరమైతే శుభ్రమైన బ్యాండేజ్‌తో కప్పుకోవచ్చు. పసుపును ఉపయోగించాలనుకుంటే వైద్యుల సలహాతో, గాయాల కోసం తయారు చేసిన శుభ్రమైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిది.

## సిగరెట్ తాగితే జ్ఞాపకశక్తి తగ్గిపోతుందా?



సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తులు మాత్రమే కాకుండా మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా ధూమపానం జ్ఞాపకశక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పరిశోధకులు గుర్తించారు. ధూమపానం, అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు కలిసి ఉంటే వృద్ధాప్యంలో డిమెన్షియా (మతిమరుపు) వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుందని అధ్యయనం పేర్కొంది. సిగరెట్ పొగ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్న విషయం చాలామందికి తెలుసు. అయితే ధూమపానం మెదడు పనితీరుపైనా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. జ్ఞాపకశక్తి తగ్గడం, ఇటీవల జరిగిన విషయాలను గుర్తుంచుకోలేకపోవడం వంటి సమస్యలు వయసు పెరిగేకొద్దీ ఎక్కువయ్యే అవకాశం ఉంది. అమెరికాలో నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం.. ధూమపానం, అధిక రక్తపోటు, మధుమేహం అనే మూడు ప్రమాద కారకాలు ఏవీ లేని 55 ఏళ్ల వ్యక్తుల్లో డిమెన్షియా లేకుండా ఉండే కాలం సగటున 30 ఏళ్లుగా ఉంది. అంటే 85 ఏళ్ల వయసు వరకు కూడా డిమెన్షియా లేకుండా ఉండే అవకాశం ఎక్కువగా కనిపించింది. ఇక ఈ మూడు ప్రమాద కారకాల్లో ఒకటి ఉన్నవారిలో డిమెన్షియా లేకుండా ఉండే కాలం సగటున 26 ఏళ్లుగా ఉంది. రెండు ప్రమాద కారకాలు ఉన్నవారిలో ఇది 21 ఏళ్లకు తగ్గింది. మూడు ప్రమాద కారకాలు ఉన్నవారిలో కేవలం 17.5 ఏళ్లుగా నమోదైంది. ప్రమాద కారకాలు పెరిగే కొద్దీ డిమెన్షియా వచ్చే వయసు తగ్గుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

## 4 ఏళ్లలోపు ఈ ఫిక్స్‌డ్ కాంబినేషన్ దగ్గు సిరప్‌లు వద్దు.. నిపుణుల హెచ్చరిక..


చిన్నారులకు దగ్గు, జలుబు వచ్చినప్పుడు వెంటనే సిరప్ ఇవ్వడం చాలామంది తల్లిదండ్రులకు సాధారణంగా మారిపోయింది. అయితే చిన్నారులకు కొన్ని దగ్గు, జలుబు మందుల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పష్టం చేసింది. ముఖ్యంగా నాలుగేళ్లలోపు



పిల్లలకు ఉపయోగించే కొన్ని ఔషధాలపై ఆంక్షలు విధించడంతో తల్లిదండ్రులు మందుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే కలుషితమైన దగ్గు సిరప్‌ల కారణంగా చిన్నారుల మరణాలు, కొన్ని ఔషధాలపై ఆంక్షలు, సిరప్ మందులను ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే విక్రయించేలా తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో తాజా చర్యలు వచ్చాయి. కేంద్రం తాజాగా క్లోర్‌ఫెనిరమైన్ మేలియేట్, ఫినైలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ అనే రెండు పదార్థాలు కలిగిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందులను నాలుగేళ్లలోపు పిల్లలకు ఉపయోగించడంపై ఆంక్షలు విధించింది. ఈ మందుల తయారీ, విక్రయం, పంపిణీని ఈ వయసు పిల్లల కోసం పరిమితం చేసింది. ఈ కాంబినేషన్ ఉన్న అన్ని మందుల ప్యాకేజీలు, లేబుల్స్, ప్యాకేజ్ ఇన్సర్ట్‌లు, ప్రచార సామగ్రిపై నాలుగేళ్ల లోపు పిల్లల్లో ఉపయోగించకూడదు అనే స్పష్టమైన హెచ్చరికను తప్పనిసరిగా ఉంచాలని ఆదేశించింది. క్లోర్‌ఫెనిరమైన్ మేలియేట్ ఒక యాంటీహిస్టమైన్‌గా పనిచేస్తుంది. ఫినైలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్‌ను డీకంజెస్టెంట్‌గా ఉపయోగిస్తారు. ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, తుమ్ములు, జలుబు లేదా అలర్జీకి సంబంధించిన కొన్ని లక్షణాల నుంచి ఉపశమనం కోసం ఈ పదార్థాలు కలిగిన మందులను ఉపయోగిస్తారు. అయితే నాలుగేళ్లలోపు పిల్లలకు ఈ కాంబినేషన్ వల్ల కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం ఉంటుంది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు సూచించడంతో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. ఈ వయసు పిల్లలకు మరింత సురక్షితమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని కూడా అధికారులు పేర్కొన్నారు. తాజా ఆంక్షలు ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదు. 2025 నుంచి భారత్‌లో దగ్గు, జలుబు మందుల విషయంలో వరుసగా పలు నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ఔషధాల కాంబినేషన్లపై ఆంక్షలు విధించడం, చాలా చిన్న వయసున్న పిల్లల కు దగ్గు, జలుబు మందులు ఇవ్వడంపై సూచనలు జారీ చేయడం, కలుషితమైన దగ్గు సిరప్‌ల కారణంగా చిన్నారుల మరణాల అనంతరం చర్యలు తీసుకోవడం, చివరకు సిరప్ ఆధారిత మందుల విక్రయాలపై ప్రిస్క్రిప్షన్ నిబంధనలు కఠినతరం చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2025లోనే క్లోర్‌ఫెనిరమైన్ మేలియేట్, ఫినైలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నాలుగేళ్లలోపు పిల్లలకు వీటిని ఉపయోగించకూడదని మందులపై హెచ్చరికలు ఉంచాలని అప్పట్లోనే ఆదేశాలు వచ్చాయి. తాజాగా ఆ కాంబినేషన్ ఉన్న అన్ని ఫార్ములేషన్లకు ఈ పరిమితిని వర్తింపజేస్తూ చర్యలు మరింత కఠినతరం చేశారు. 2025లో కలుషితమైన దగ్గు సిరప్‌ల వ్యవహారం కూడా దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. మధ్యప్రదేశ్‌లో కలుషితమైన దగ్గు సిరప్ సేవించిన తర్వాత చిన్నారులు మరణించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అనంతరం కొన్ని నోటి ద్వారా తీసుకునే లిక్విడ్ మందుల్లో డైఇథిలీన్ గ్లైకాల్ (డీఈజీ) అనే విషపూరిత రసాయనం ఉన్నట్లు గుర్తించారు. కోల్డ్‌రిఫ్, రేస్పిఫ్రెష్ టీఆర్, రిలైఫ్ వంటి కొన్ని మందుల విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా మెడికల్ ప్రొడక్ట్ అలర్ట్ జారీ చేసింది. డైఇథిలీన్ గ్లైకాల్ తీవ్రమైన కిడ్నీ నష్టానికి దారితీయడంతో పాటు ప్రాణాపాయానికి కారణమయ్యే విషపూరిత రసాయనం. ఈ ఘటనలతో పిల్లలకు మందులు ఇచ్చే విషయంలో తయారీ ప్రమాణాలు, నాణ్యత పరీక్షలు, వైద్యుల పర్యవేక్షణ, మందుల వినియోగంపై మరింత జాగ్రత్త అవసరమనే అంశం ముందుకు వచ్చింది.

## పెద్ద బైసెప్స్ కావాలంటే పాటించాల్సిన చిట్కాలు ఇవే..

జిమ్‌కు వెళ్లి క్రమం తప్పకుండా బైసెప్స్ వ్యాయామాలు చేస్తున్నా చేతి కండరాలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదా? ఎక్కువ బరువులు ఎత్తడం, ఎక్కువసార్లు కర్ల్స్ చేయడం మాత్రమే పెద్ద బైసెప్స్ పొందేందుకు సరిపోదు. వ్యాయామం చేసే విధానం, క్రమంగా బరువును పెంచడం, తగినంత ప్రోటీన్ తీసుకోవడం, శరీరానికి విశ్రాంతి ఇవ్వడం, క్రమం తప్పకుండా శిక్షణ కొనసాగించడం వంటి అంశాలు కండరాల పెరుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే చాలామంది తెలియక చేసే కొన్ని పొరపాట్లు బైసెప్స్ ఎదుగుదలకు అడ్డంకిగా మారుతాయని నిపుణులు చెబుతున్నారు. బైసెప్స్ వ్యాయామాల్లో ఎక్కువ బరువు ఎత్తడం ఒక్కటే లక్ష్యంగా పెట్టుకోవద్దు. డంబెల్‌ను పైకి



ఎత్తేటప్పుడు శరీరాన్ని ఊపుతూ లేదా నడుము, భుజాల సహాయంతో బరువును కదిలిస్తే బైసెప్స్‌పై పడాల్సిన ఒత్తిడి ఇతర కండరాలపై పడుతుంది. అందువల్ల సరైన ఫామ్‌తో నియంత్రణలో వ్యాయామం చేయగలిగే బరువును ఎంచుకోవాలి. చివరి కొన్ని రిపిటేషన్లు కష్టంగా అనిపించాలి కానీ వ్యాయామం చేసేటప్పుడు మొత్తం శరీరాన్ని ఊపాల్సిన పరిస్థితి రాకూడదు. కర్ల్ చేసేటప్పుడు మొండెం స్థిరంగా ఉంచి, కదలిక ప్రధానంగా మోచేయి జాయింట్ నుంచి జరిగేలా చూసుకోవాలి. బరువును పైకి ఎత్తడం ఎంత ముఖ్యమో, కిందికి దించేటప్పుడు కూడా నియంత్రణతో చేయడం అంతే ముఖ్యం. గురుత్వాకర్షణకు వదిలేసి బరువును కిందికి పడేయడం వల్ల వ్యాయామంపై నియంత్రణ తగ్గుతుంది. ఒకే రకమైన కర్ల్ వ్యాయామాన్ని మాత్రమే పదేపదే చేయడం కూడా సరైన విధానం కాదు. బైసెప్స్ వివిధ కదలికల్లో పనిచేస్తాయి కాబట్టి వ్యాయామాల్లో వైవిధ్యం ఉండటం ఉపయోగకరంగా ఉంటుంది. డంబెల్ కర్ల్స్, హ్యామర్ కర్ల్స్, ఇన్‌క్లైన్ కర్ల్స్, ప్రీచర్ కర్ల్స్ వంటి వివిధ వ్యాయామాలను చేర్చుకోవడం ద్వారా మోచేయిని వంచే కండరాలకు భిన్నమైన స్థితుల్లో శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుంది. బైసెప్స్ పెరగాలంటే కర్ల్స్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. పుల్‌అప్స్, చిన్‌అప్స్, రోయింగ్ వంటి వ్యాయామాల్లో కూడా బైసెప్స్ పనిచేస్తాయి. ఇవి వెన్ను కండరాలకు కూడా శిక్షణ ఇస్తాయి. వెన్ను కండరాలను బలోపేతం చేయడంతో పాటు బైసెప్స్‌కు కూడా పని కలగడం వల్ల పైభాగం శరీరానికి మరింత సమతుల్యమైన కండర నిర్మాణం ఏర్పడేందుకు సహాయపడుతుంది. నెలల తరబడి ఒకే బరువు, అదే రిపిటేషన్లు, అదే శిక్షణ పరిమాణంతో వ్యాయామం చేస్తూ ఉంటే కండరాలకు మరింతగా ఎదగాల్సిన అవసరం లేకుండా పోతుంది. కండరాల పెరుగుదలకు ప్రోగ్రెసివ్ ఓవర్‌లోడ్ ముఖ్యమైనది. అంటే క్రమంగా బరువును పెంచడం, రిపిటేషన్లు పెంచడం, వ్యాయామం చేసే పద్ధతిని మెరుగుపరచడం లేదా అవసరానికి అనుగుణంగా శిక్షణ పరిమాణాన్ని పెంచడం వంటివి చేయవచ్చు. అయితే ఈ మార్పులు క్రమంగా జరగాలి.

## జ్ఞాపకశక్తి, ఏకాగ్రత సమస్యలు తరచూ వస్తున్నాయా..



తరచూ పేర్లు మర్చిపోవడం, మాట్లాడుతున్నప్పుడు విషయాన్ని మరిచిపోవడం, ఏకాగ్రత కుదరకపోవడం వంటి సమస్యలు కనిపిస్తే చాలామందికి వెంటనే డిమెన్షియా గురించి ఆందోళన కలుగుతుంది. అయితే ప్రతి జ్ఞాపకశక్తి సమస్య డిమెన్షియా కారణంగా వస్తుందని భావించాల్సిన అవసరం లేదు. డిప్రెషన్, దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి వంటి కొన్ని పరిస్థితులు కూడా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యంపై ప్రభావం చూపిస్తాయి. గతంలో ఇలాంటి లక్షణాలను సూడోడిమెన్షియా అని పిలిచేవారు. అయితే దీన్ని వైద్యపరంగా ప్రత్యేకమైన నిర్ధారణగా పరిగణించరు. అయినప్పటికీ సూడో డిమెన్షియా అనే పదంతో చెప్పే లక్షణాలు కల్పితమైనవి కావు. డిప్రెషన్ కారణంగా మెదడులోని కొన్ని జ్ఞాన సంబంధిత సామర్థ్యాలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా ఏకాగ్రత, సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడం, జ్ఞాపకశక్తి, పనులను ప్రణాళిక చేసుకోవడం, ప్రాధాన్యతలను నిర్ణయించడం, ఒక పనిని ప్రారంభించి పూర్తి చేయడం వంటి ఎగ్జిక్యూటివ్ ఫంక్షన్లపై ప్రభావం పడుతుంది. ఏకాగ్రత సరిగా లేకపోతే కొత్త సమాచారాన్ని మెదడు సరిగ్గా నమోదు చేసుకోలేదు. దాంతో ఆ సమాచారాన్ని తర్వాత గుర్తు తెచ్చుకోవడం కూడా కష్టమవుతుంది. డిప్రెషన్‌కు సంబంధించిన జ్ఞానపరమైన సమస్యలు సాధారణంగా కొన్ని వారాలు లేదా నెలల వ్యవధిలో కనిపిస్తాయి. సమస్యను ఎదుర్కొంటున్న వ్యక్తులు తమలో జ్ఞాపకశక్తి తగ్గుతోందని స్వయంగా గుర్తించి ఆందోళన చెందడం తరచూ కనిపిస్తుంది. పరీక్షల సమయంలో కూడా వారు తమ పనితీరు గురించి బాధపడుతుంటారు. కొన్నిసార్లు సమాధానం చెప్పగల సామర్థ్యం ఉన్నప్పటికీ నాకు తెలియదు అని చెప్పే అవకాశం ఉంటుంది. వారి పనితీరులో హెచ్చుతగ్గులు కూడా కనిపిస్తాయి. అయితే అల్జీమర్స్ వంటి న్యూరో డీజెనరేటివ్ డిమెన్షియా సాధారణంగా నెమ్మదిగా, క్రమంగా అభివృద్ధి చెందుతుంది. ప్రారంభ దశలో కొత్త విషయాలను నేర్చుకోవడం, వాటిని గుర్తుంచుకోవడం వంటి సామర్థ్యాలు ఎక్కువగా ప్రభావితమవుతాయి. కాలక్రమేణా ఈ సమస్యలు మరింత స్పష్టంగా, నిరంతరంగా కనిపిస్తాయి. వ్యక్తిలో కనిపించే మానసిక లక్షణాలు కూడా కారణాన్ని గుర్తించడంలో వైద్యులకు కొన్ని ఆధారాలను అందిస్తాయి. ఎప్పుడూ బాధగా ఉండటం, జీవితంపై ఆసక్తి తగ్గిపోవడం, తీవ్రమైన అలసట, అపరాధ భావన, ఇతరులకు దూరంగా ఉండటం, నిద్ర లేదా ఆహారపు అలవాట్లలో మార్పులు వంటివి డిప్రెషన్‌కు సంబంధించిన ముఖ్యమైన హెచ్చరిక సంకేతాలుగా నిపుణులు చెబుతున్నారు.

## ఆఖరి గంటలో అమ్మకాలు... నాలుగో రోజూ తప్పని నష్టాలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాలను చవిచూశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలకు ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బజాజ్ ఆటో, టెక్ మహీంద్రా షేర్లు దాదాపు 2 శాతం మేర కుంగాయి. దీంతో నాలుగో రోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ ఉదయం 76,724.95 (క్రితం ముగింపు 76,570.35) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఆఖరి గంటలో మాత్రం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. ఇంట్రాడేలో 76,152.86 వద్ద కనిష్ఠాన్ని తాకగా.. చివరికి 417.49 పాయింట్లు పతనమై 76,152.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు కోల్పోయి 23,873.45 వద్ద ముగిసింది.




# బ్యాంకింగ్‌లో రూ.7.77 లక్షల కోట్ల మిగులు నిధులు




దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత (లిక్విడిటీ) అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం బ్యాంకుల్లో సుమారు రూ. 7.77 లక్షల కోట్ల మేర అదనపు నిధులు ఉన్నాయి. 2022 ఏప్రిల్‌లో రూ.7.93 లక్షల కోట్ల తర్వాత, దాదాపు నాలుగున్నరేళ్లలో ద్రవ్య లభ్యత ఈ స్థాయికి చేరడం ఇప్పుడే. ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ స్వాప్ సదుపాయం ద్వారా వచ్చిన విదేశీ కరెన్సీ ప్రవాహం దీనికి ప్రధాన కారణం. దీనికితోడు నెలాఖరున పింఛన్లు, జీతాల చెల్లింపుల కోసం ప్రభుత్వం చేసిన వ్యయాలూ తోడవడంతో బ్యాంకుల వద్ద నిధుల నిల్వలు పెరిగాయి. ఈ భారీ గణాంకాలు తాత్కాలిక మేనని, ఈ పరిస్థితి ఎంతో కాలం కొనసాగే అవకాశం లేదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నేడు ఉన్న నిధుల ప్రవాహం రేపు ఉండకపోవచ్చు. రానున్న రోజుల్లో ముందస్తు పన్ను చెల్లింపులు ప్రారంభం కానున్నాయి. ఐపీఓల్లో పెట్టుబడుల కోసం మదుపర్ల బ్యాంకు ఖాతాల్లో తాత్కాలికంగా నిలుపుదల చేసే నిధులు, షేర్లు మంజూరవ్వగానే బ్యాంకుల నుంచి బయటకు వెళ్తాయి. దీనివల్ల ప్రస్తుత మిగులు క్రమంగా తగ్గిపోతుంది. విదేశీ కరెన్సీని భారీగా ఆకర్షించిన ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) పథకం ఇప్పటికే ముగిసింది. కాబట్టి, కొత్తగా భారీగా నిధులు రావు. 'ప్రస్తుతం బ్యాంకుల రుణ వృద్ధి రేటు 17-18 శాతంగా ఉంది. ఇంత వేగంగా రుణాలు పెరుగుతున్నప్పుడు బ్యాంకులకే నగదు అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ భారీ గిరాకీ కారణంగానే, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిర్వహించిన తాజా వీఆర్‌ఆర్‌ఆర్ వేలంలో బ్యాంకుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ప్రస్తుత మిగులు నిధులు ఇప్పటికే వివిధ రుణాల కోసం కేటాయించినవే' అని కెనరా బ్యాంక్ గ్రూప్ ముఖ్య ఆర్థిక సలహాదారు మాధవన్‌కుట్టి వివరించారు. వ్యవస్థలో నిధులు ఎక్కువగా ఉన్నప్పటికీ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు లేవని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌర సేన్‌గుప్తా అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో డిపాజిట్ల వృద్ధితో పోలిస్తే, రుణాల వృద్ధి బలంగా ఉండటమే ఇందుకు కారణమన్నారు. కాబట్టి, ప్రస్తుత మిగులు నిధులు మార్కెట్లో అదనపు ద్రవ్య లభ్యతగా మారి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను సృష్టించలేవని స్పష్టం చేశారు. బాండ్ల రాబడి పెరగడం, ఈక్విటీ మార్కెట్ల పతనం వంటి పరిణామాల వల్ల ఆర్థిక పరిస్థితులు ఇప్పటికే కఠినతరంగా మారాయని, అందువల్ల ద్రవ్యోల్బణ ప్రభావం ఉండదని గౌర సేన్‌గుప్తా వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ సాక్షి గుప్తా స్పందిస్తూ.. అవసరాన్ని బట్టి, ఆర్‌బీఐ తాత్కాలికంగా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని పెంచే అవకాశముందని పేర్కొన్నారు. దీనివల్ల నగదు సమతుల్యత దెబ్బతినదని అభిప్రాయం వ్యక్తం చేశారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి దేశీయ బ్యాంకులు రికార్డు స్థాయిలో విదేశీ కరెన్సీని ఆకర్షించాయి. ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన ప్రత్యేక ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ల పథకం ఆగస్టు 31న ముగిసింది. స్వాప్ సదుపాయం కింద దాదాపు రూ.12.01 లక్షల కోట్ల (127.23 బిలియన్ డాలర్ల) విదేశీ కరెన్సీ నాన్ రెసిడెంట్ డిపాజిట్ల (ఎఫ్‌సీఎన్‌ఆర్-బి)ను ఇవి సమీకరించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య, విదేశీ మారకపు నిల్వలను బలోపేతం చేసేందుకు జూన్ 8న ఆర్‌బీఐ ఈ పథకాన్ని తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ గడువు సెప్టెంబరు 30 వరకూ ఉంది.

# పేపాల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు




ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ పేపాల్ భారత్‌లో భారీగా ఉద్యోగులను తొలగించింది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని కార్యాలయాల్లో పనిచేస్తున్న 600 మందికి ఉద్వాసన పలికినట్లు సమాచారం. భారత్‌లో ఈ సంస్థకు 6 వేల మందికిపైగా ఉద్యోగులు ఉండగా.. వారిలో దాదాపు 10శాతం కోత విధించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై భారత్‌లోని పేపాల్ సంస్థ అధికార ప్రతినిధి స్పందించారు. లేఆఫ్‌ల ప్రభావం 220 మందిపైనే పడినట్లు వివరణ ఇచ్చారు. సంస్థ కార్యకలాపాలను సరళీకరించడం, అమలు సామర్థ్యాన్ని మెరుగుపరచడం, దీర్ఘకాలిక వృద్ధిని నమోదు చేసే చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లుగా ఓ జాతీయ మీడియా సంస్థకు తెలిపారు. టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆపరేషన్స్, చెల్లింపులు, ఆర్థిక విభాగాల్లోని ఉద్యోగులపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడినట్లు తెలుస్తోంది. మరోవైపు, తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఆగస్టు 31న కాన్ఫరెన్స్ కాల్ నిర్వహించి తొలగింపు విషయాన్ని చెప్పారంటూ ఉద్యోగు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తర్వాత వెంటనే కంపెనీ వ్యవస్థలకు తమ యాక్సెస్‌ను నిలిపివేశారని వాపోతున్నారు. కొందరికి నేరుగా ఈ-మెయిల్ ద్వారా తొలగింపు సమాచారం అందించారు. ఉద్యోగులకు ఔట్‌బోర్డింగ్ ప్రక్రియతోపాటు, నెల జీతాన్ని అందిస్తామని ఆ సంస్థ తెలిపినట్లు సమాచారం. పేపాల్ ప్రపంచవ్యాప్తంగా చేపడుతున్న పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ ఉద్యోగాల కోత విధించినట్లు తెలుస్తోంది. 2025 డిసెంబరు నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 23,800 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో దాదాపు 20 శాతం ఉద్యోగాలను దశల వారీగా తగ్గించే ప్రణాళిక ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

# ఏటీఎం ఉచిత లావాదేవీలపై ఎస్‌బీఐ కొత్త రూల్స్




ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు షాకిచ్చింది. ఎస్‌బీఐ డెబిట్ కార్డును ఉపయోగించి ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి చేసుకునే ఉచిత నగదు ఉపసంహరణల పరిమితిని సవరించింది. దీన్ని 10 నుంచి 5కు తగ్గించింది. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంలు, డిపాజిట్ కమ్ విత్‌డ్రా మెషిన్ల ద్వారా నెలకు మొదటి 10 లావాదేవీలను ఉచితంగా పొందుతున్నారు. కానీ, అక్టోబర్ 1 నుంచి ఉచిత పరిమితి కేవలం 5 లావాదేవీలకే పరిమితం కానుంది. ఆ తర్వాత జరిపే ఆరో ట్రాన్సాక్షన్ నుంచి ఛార్జీలు వసూలు చేయనుంది. ఇది ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలకూ వర్తిస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది. అదనంగా చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్‌పై రూ.23 వసూలు చేయనుంది. దీనికి జీఎస్‌టీ అదనం. నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లపై రూ.11+ జీఎస్‌టీ ఛార్జీలు ఉండనున్నాయి. ఈ కొత్త నిబంధనలు కేవలం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు మాత్రమే. ఇతర ఎస్‌బీఐ ఖాతాదారులకు మాత్రం వర్తించదు. అదేవిధంగా ఎస్‌బీఐకి చెందిన సొంత ATM/ADWMలలో జరిపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై ప్రస్తుత కొనసాగుతున్న పరిమితులు, ఛార్జీలే వర్తిస్తాయి. అందులో ఎలాంటి మార్పూ చేయలేదు.

# లినక్స్ ఆధారిత 'జియోసరళ్' సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించిన ఎస్రి ఇండియా


భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) సాఫ్ట్‌వేర్, లొకేషన్ ఇంటెలిజెన్స్, మ్యాపింగ్ పరిష్కారాల రంగంలో అగ్రగామిగా ఉన్న ఎస్రి ఇండియా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'జియోసరళ్' అనే లినక్స్ ఆధారిత డెస్క్‌టాప్ జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌ను గురువారం ఆవిష్కరించింది. భారతదేశంలో జియోస్పేషియల్ సాంకేతికత వినియోగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది.సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ప్రొఫెషనల్ జీఐఎస్ వినియోగదారులు అధునాతన విశ్లేషణలు, 3డీ మ్యాపింగ్, నెట్‌వర్క్ విశ్లేషణ వంటి పనుల కోసం ArcGIS Proను వినియోగిస్తున్నప్పటికీ, మ్యాపింగ్, విజువలైజేషన్, డేటా క్వెరీలు, ఎడిటింగ్ వంటి సాధారణ అవసరాల కోసం తేలికపాటి డెస్క్‌టాప్ జీఐఎస్ సాఫ్ట్‌వేర్ అవసరం ఉందని సంస్థ పేర్కొంది. ఆ అవసరాన్ని తీర్చేందుకు జియోసరళ్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది.ప్రస్తుతం ఈ సాఫ్ట్‌వేర్ లినక్స్‌తో పాటు విండోస్‌లోనూ అందుబాటులో ఉందని, త్వరలో ఆండ్రాయిడ్‌కు కూడా మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించింది.ఈ సందర్భంగా ఎస్రి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగేంద్ర కుమార్ మాట్లాడుతూ... వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేయడం తమ సంస్థ లక్ష్యమన్నారు. జియోసరళ్ ఆవిష్కరణ తమ సాంకేతిక ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. తక్కువ వ్యయంతో లభించే లినక్స్ ఆధారిత జీఐఎస్ సాఫ్ట్‌వేర్ కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ArcGIS వాతావరణంలో మ్యాపింగ్, విజువలైజేషన్, ఎడిటింగ్, క్వెరీల వంటి సాధారణ పనులను సమర్థంగా నిర్వహించగలదని తెలిపారు. అధునాతన అవసరాల కోసం ArcGIS Proను యథావిధిగా ఉపయోగించుకోవచ్చని వివరించారు.జియోసరళ్ ప్రస్తుతం వినియోగదారులు ఉపయోగిస్తున్న ArcGIS వ్యవస్థలతో సమన్వయంగా పనిచేస్తుందని సంస్థ తెలిపింది. అలాగే Indo ArcGIS Living Atlasలోని డేటాను వినియోగించుకోవడంతో పాటు, ఇంటర్నెట్ అందుబాటులో లేకపోయినా స్థానికంగా భద్రపరిచిన జీఐఎస్ డేటా, బేస్ మ్యాప్‌లను వీక్షించడం, నిర్వహించడం, విశ్లేషించడం వీలవుతుందని పేర్కొంది. ఎంటర్‌ప్రైజ్ స్థాయి భద్రతా ప్రమాణాలతో దీనిని రూపొందించినట్లు వెల్లడించింది.పాలన, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, రక్షణ, యుటిలిటీలు, పట్టణాభివృద్ధి, సహజ వనరుల నిర్వహణ, విపత్తు నిర్వహణ తదితర రంగాల్లో జియోస్పేషియల్ సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, స్వదేశీ పరిష్కారాల అభివృద్ధి దేశ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఎస్రి ఇండియా పేర్కొంది. జియోసరళ్ ఆ దిశగా మరో ముందడుగని వెల్లడించింది.







## బ్యాటుతో మెరవాలి



మహిళల టీ20 ఆసియాకప్‌లో భారత జట్టు మరోసారి సమరానికి సిద్ధమైంది. గ్రూప్-ఎ పోరులో హాంకాంగ్‌ను ఢీకొంటుంది. పొట్టి ఫార్మాట్లో మూడుసార్లు ఆసియా టైటిల్‌ను గెలిచిన భారత్.. థాయ్‌లాండ్‌పై గెలిచి ప్రస్తుత టోర్నీలో శుభారంభం చేసింది. కానీ పసికూనపై సాధికారిక ప్రద ]ర్శన చేయలేకపోయింది. హర్మన్‌ప్రీత్ సేన బ్యాటుతో చాలా మెరుగుపడాల్సివుంది. థాయ్‌లాండ్‌పై 10 ఓవర్లలో 101/2తో నిలిచి, అలవోకగా 200పై స్కోరు చేసేలా కనిపించిన భారత్.. అనూహ్యంగా తడబడింది. 29 పరుగులకే చివరి ఏడు వికెట్లు కోల్పోయి, 159తో సరిపెట్టుకుంది. పసికూన హాంకాంగ్‌ను ఓడించడం కూడా భారత్‌కు పెద్ద కష్టమేమీ కాదు. కానీ పాకిస్థాన్‌తో మ్యాచ్ సహా పెద్ద మ్యాచ్‌లు ఆడాల్సివున్న నేపథ్యంలో జట్టు తన బ్యాటింగ్ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. స్మృతి, ప్రతీక ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలచాలి. హర్మన్‌ప్రీత్ కౌర్ పరుగుల బాట పట్టాలి. స్పిన్నర్లు శ్రీచరణి, దీప్తిశర్మ.. పేసర్లు నందని శర్మ, క్రాంతిగౌడ్‌లతో భారత బౌలింగ్ బలంగా కనిపిస్తోంది. ఇండియాకు హాంకాంగ్ ఏమాత్రం పోటీఇస్తుందో చూడాలి.

## ఇంపాక్ట్‌గా కాదు..
# పూర్తిస్థాయి ప్లేయర్‌గానే ధోని!

ఇంపాక్ట్ రూల్ వద్దు అని కొందరు.. కావాలని మరికొందరు వాదిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పది ఫ్రాంచైజీల కెప్టెన్ల అభిప్రాయాలను బీసీసీఐ తీసుకున్న సంగతి తెలిసిందే. వచ్చే సీజన్‌లో ఆ రూల్‌ను ఉంచుతారా? లేదా? అనేది బోర్డు నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఒకవేళ ఇంపాక్ట్ రూల్‌ను తీసేస్తే ఎంఎస్ ధోని ఐపీఎల్ భవితవ్యం కూడా ఇబ్బందుల్లో పడుతుందనే వాదన వినిపిస్తోంది. గత సీజన్‌లో గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. వచ్చే ఎడిషన్‌లో తప్పకుండా బరిలోకి దిగుతాడని సీఎస్‌కే అభిమానులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంపాక్ట్ రూల్ లేకపోతే పరిస్థితి ఏంటనేదీ పలువురిలో ఆందోళన కలిగిస్తోంది. అయితే, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు బద్రినాథ్ మాత్రం ధోని అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పాడు. ఐపీఎల్ 2027 సీజన్‌లో తలా తప్పకుండా ఆడతాడని వెల్లడించాడు. "ధోని నాతో వ్యక్తిగతంగా ఓ మాట చెప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా కాదు.. ఫుల్‌టైమ్ వికెట్ కీపర్‌గానే ఆడతానని అన్నాడు. దానర్థం 20 ఓవర్లూ అతడు మైదానంలో ఉంటాడు. ఒకవేళ నిజంగానే ధోని బరిలోకి దిగితే సీఎస్‌కేకు ప్రయోజనమే. కానీ, ధోని శరీరం అంత సమయం సహకరిస్తుందా? అనేది అనుమానం. గతంలో ఫ్లెమింగ్ ఇదే మాట అన్నట్లు గుర్తు. ధోని ఎక్కువగా 16 లేదా 17వ ఓవర్ తర్వాత బ్యాటింగ్‌కు వస్తుంటాడు. అతడి పాత్ర చాలా పరిమితంగానే ఉంటుంది" అని బద్రినాథ్ అన్నాడు. "శివమ్ దూబే బౌలింగ్ భారత్‌కు అవసరం కానీ.. సీఎస్‌కేకు కాదు. అతడి విషయంలో ఇంపాక్ట్ రూల్‌ను వినియోగించాల్సిన పనిలేదు. అలాగే అకీల్ హుసేన్‌ను తప్పకుండా ప్లేయింగ్ XIలో ఉంచాలి. సీఎస్‌కే మాత్రం అతడిని ఇంపాక్ట్‌గానే తీసుకొస్తోంది. ఒకవేళ బ్యాటింగ్‌లో ఇబ్బంది పడినప్పుడు అదనంగా మరో బ్యాటర్‌ను తీసుకొంటోంది. దీంతో అకీల్ సేవలను కోల్పోయిన పరిస్థితులను మనం చూశాం. ఇక్కడ ఇంపాక్ట్ రూల్‌ను తప్పుబట్టేందుకు ఏమీ లేదు. సరిగ్గా వినియోగించుకొనే వ్యూహం ఆయా జట్లకే ఉండాలి" అని బద్రినాథ్ వ్యాఖ్యానించాడు.




# అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుండు.. పాక్ 'లింక్డిన్ పోస్టు'పై బట్లర్ సెటైర్!




పాకిస్థాన్ క్రికెట్ తీరు విమర్శలకు గురవుతూనే ఉంది. ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమి, ఏడు గురిపై వేటు వేయడంతో ఆ జట్టు మాజీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం లింక్డిన్‌లో యాడ్ ఇవ్వడమూ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. నెటిజన్లు తీవ్ర స్థాయిలో తమ కామెంట్లతో రెచ్చిపోయారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు జాస్ బట్లర్ కూడా కాస్త సెటైరికల్‌గా స్పందించాడు. అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుంటుందని పాక్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించాడు. "పాకిస్థాన్ ప్రకటనను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నా. తమ కొత్త ఫీల్డింగ్ కోచ్ నియామకం కోసం పాక్ సంప్రదాయ, ఆధునిక వ్యూహాన్ని అనుసరించిందని అనుకుంటున్నా. అందుకోసమే లింక్డిన్‌లో పోస్టు చేసింది. ప్రస్తుత రోజుల్లో అన్ని జట్లూ ఇలాంటి జాబ్ ప్రకటనలు ఇవ్వాలి. ఇంగ్లాండ్ కూడా అదే చేస్తుందేమో నాకైతే తెలియదు" అని బట్లర్ వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ ఫీల్డింగ్ కోచ్‌గా షేన్ మెక్‌డార్మెట్ పదవీకాలం గత వారమే ముగిసింది. సాధారణంగా అధికారికంగా నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించడం పరిపాటి. కానీ, లింక్డిన్‌లో పోస్టు చేయడం మాత్రం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని పాక్ బోర్డు ఆ పోస్ట్‌లో పేర్కొంది.

## ఘోరంగా ఓడింది గాక..
# తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు!

ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డు (PCB) సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ మండిపడ్డారు. అయితే, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ మాత్రం తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకుంటున్నాడు. అదే సమయంలో జట్టు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న టీమ్‌ల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు. "మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. ఇటీవల కాలంలో చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతటితో అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా? మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. ఎవరైనా రాణించకపోతే లేదా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోతే మేమేం (PCB) చేయగలం? మాకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ఎంతో ముఖ్యం. కచ్చితంగా టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన దానిని తప్పుగా పరిగణించలేం. మేం ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాం. కానీ, దేవుని దయతో వన్డేలు, టీ20ల్లో మాదిరిగానే రాబోయే రోజుల్లో టెస్టుల్లో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా. నేను విమర్శలకు ఎప్పుడూ భయపడలేదు, ఇకపై కూడా భయపడను. నేను పీసీబీ చీఫ్‌గా వచ్చినప్పటి నుంచి క్రికెట్ నాశనమైందని అనేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మేం ఈ కోచింగ్ బృందాన్ని తీసుకురాకముందు జట్టు ర్యాంకింగ్స్ ఎలా ఉండేవో చూడండి. వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చాం" అని మోసిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు.



# మళ్లీ వీవీఎస్ లక్ష్మణ్‌కే అవకాశం.. కేంద్రం ఆమోదం

మరో రెండు వారాల్లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో టీమ్ ఇండియా తలపడనున్న సంగతి తెలిసిందే. నేరుగా క్వార్టర్ ఫైనల్‌లో తలపడనుంది. జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే, భారత జట్టుతోపాటు కోచ్‌గా వెళ్లేందుకు వీవీఎస్ లక్ష్మణ్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. ఈ మేరకు కేంద్ర క్రీడల శాఖ ఆమోదం తెలిపింది. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ జాబితాలో వీవీఎస్ లక్ష్మణ్ పేరూ ఉంది. టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ ఈ బాధ్యతలను నిర్వర్తిస్తాడు. దాదాపు అదే సమయంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో భారత్ తలపడనుంది. అందుకే, గంభీర్ స్వదేశంలోనే ఉంటాడని బీసీసీఐ పేర్కొంది. ఆసియా క్రీడలకు లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లడం ఇది వరుసగా రెండోసారి. 2023లో చైనా వేదికగా జరిగిన పోటీలకూ లక్ష్మణే మార్గదర్శకుడు. అప్పుడు టీమ్‌ఇండియా బంగారు పతకం నెగ్గింది. ఆ తర్వాత పలు సిరీస్‌లకూ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లాడు. ఈసారి ఆసియా క్రీడలకు తన కోచింగ్ బృందంలో మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్‌కు అవకాశం దక్కింది. మరూఫ్ ఫజందార్‌ను టీమ్ లీడర్‌గా కేంద్రం నియమించింది. ఇప్పటికే టీ20 జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా.. అతడికి డిప్యూటీగా తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు అవకాశం దక్కింది.



# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో షాహిద్ కపూర్, ఆలియా భట్..?



**వుదయం సినిమా:** ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న హై–వోల్టేజ్ యాక్షన్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈసినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, ప్రముఖ నటి ఆలియా భట్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించిన వార్తలు అటు బీ టౌన్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లో హాట్టాపిక్‌గా మారాయి.ఇందులో షాహిద్ కపూర్పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనుండగా, ఆలియా భట్ కీలకమైన పాత్రలో ఎన్టీఆర్ సరసన నటించనున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ,టాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ ప్రాజెక్ట్‌ను ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్, యువ సుధా ఆర్ట్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

వుదయం సినిమా

# 'జైలర్ 2' విడుదల తేదీ ఖరారు..



**వుదయం సినిమా:** మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల ఖరారైంది. 'జైలర్ 2' (Jailer 2) రిలీజ్ డేట్‌పై ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 15న దీన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. ప్రతి అడుగు పదిమంది మేలు కోసమే: పవన్‌కు చిరు శుభాకాంక్షలు 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.

# 'గజ' సాంగ్ లాంచ్ ఈవెంట్

**వుదయం సినిమా:** చలంశెట్టి సునీల్ సమర్పణలో సతీష్ జై ఫిల్మ్స్ బ్యానర్ మీద



సతీష్ జై, ఫర్నాజ్ శెట్టి ప్రధాన పాత్రల్లో డా. మైత్రి శరణ్ నిర్మించిన చిత్రం 'గజ'. ఈ సినిమాకి సతీష్ జై దర్శకత్వం వహించారు. ఈ మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాని మైత్రి మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ క్రమంలో గురువారం నాడు అల్లకల్లోలంగా పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. సాయి రాజేష్ మాట్లాడుతూ .. ''గజ' టీజర్ ఇంప్రెసివ్‌గా అనిపించింది. నాకు సతీష్‌తో ఎన్నో ఏళ్ల నుంచి బంధం ఉంది. ఎన్ని సవాళ్లు ఎదురైనా కూడా ఈ సినిమాని వదల్లేదు. కష్టపడి ఈ స్థాయికి తీసుకు వచ్చాడు. రామ్ మిర్యాల వాయిస్ అంటే నాకు ఇష్టం. మణిశర్మని, రామ్ మిర్యాలని కలిపి క్రెడిట్ తీసుకోవాలని అనుకున్నాను. కానీ అల్రెడీ సతీష్ ఆ క్రెడిట్ తీసుకున్నాడు. మళ్లీ మేం ముగ్గురం కలిసి ఓ గొప్ప పాటను చేయాలని అనుకుంటున్నాను. మా సతీష్‌గారికి సపోర్ట్ చేస్తున్న మైత్రి శరణ్ గారికి ధన్య వాదా లు. ఫర్నాజ్ తెలుగులో చక్కగా మాట్లాడారు. మణిశర్మ తో నాకు ఎన్నో బెస్ట్ మెమోరీస్ ఉన్నాయి. ఇకపై నేను మణి సార్‌తోనే ట్రావెల్ చేస్తాను. ఆయన ట్రాక్ క్వాలిటీని కూడా ఎవ్వరూ బీట్ చేయలేరు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.హీరో, నిర్మాత, దర్శకుడు సతీష్ జై మాట్లాడుతూ .. ''గజ' మూవీ కథను ముందుగా మిట్టపల్లి గారికి చెప్పాను. మణిశర్మ గారు మ్యూజిక్ అని చెప్పడంతో మిట్టపల్లి గారు మరింత ఎగ్జైట్ అయ్యారు. ఈ సినిమాకి, నాకు మణిశర్మ గారు బ్యాక్ బోన్‌లా నిల్చున్నారు. ఆయన్నుంచి నేను క్రమశిక్షణ, డెడికేషన్ గురించి తెలుసుకున్నాను. సాయి రాజేష్ గారు ఎప్పుడూ ఓ ఫ్రెష్ కంటెంట్‌ని తీసుకుంటారు. సాయి రాజేష్‌కి మంచి మ్యూజిక్ టేస్ట్ ఉంటుంది. ఈ రోజు మా కోసం ఆయన రావడం సంతోషంగా ఉంది. ఫర్నాజ్ మంచి నటి. ఈ సినిమాకి ఫర్నాజ్ హీరో. కమర్షియల్ అంశాలతో పాటు సెల్యూట్ కొట్టేలా మంచి మెసెజ్, ఎమోషన్ కూడా ఉంటుంది. మీ (మీడియా)లోని ఒకరి స్టోరీలానే ఈ సినిమా ఉంటుంది. క్లైమాక్స్ చూసి కంటతడి పెట్టుకుని థియేటర్ నుంచి బయటకు వస్తారు. నా భార్య మైత్రి శరణ్ నాకంటే చాలా ఫేమస్. ఆమె నాకు స్ఫూర్తి. సెవెన్ హిల్స్ సతీష్ నాకు ఎప్పుడూ సపోర్ట్ చేస్తూ ఉంటారు. మా సినిమాని అందరూ చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.మణిశర్మ మాట్లాడుతూ .. ''మా సతీష్ 'గజ' సినిమాని ఎన్నో కష్టాలు, సవాళ్లని ఎదుర్కొని చేశాడు. మూవీ అద్భుతంగా వచ్చింది. 'అల్లకల్లోలంగా' ట్యూన్ అద్భుతంగాకుదిరింది. ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. నిర్మాత మైత్రి శరణ్ మాట్లాడుతూ .. ''గజ' టీజర్ అందరికీ నచ్చింది. అంతటి ఆదరణ లభిస్తుందని మేం కూడా ఊహించలేదు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అన్నది ఆడియెన్స్ చూడటం లేదు.

# సుప్రియన్వి పిక్చర్ స్టూడియోస్ ప్రతిష్టాత్మక చిత్రం టైటిల్ 'దేవరాయ'

**వుదయం సినిమా:** అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ స్పెక్టాకిల్ 'దేవరాయ' టైటిల్ అనౌన్స్‌మెంట్ చేశారు మేకర్స్. విజయనగర సామ్రాజ్యంలోని దిగ్గజ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయగా కిచ్చా సుదీప్‌ను మేకర్స్ మజెస్టిక్ అవతార్‌లో పరిచయం చేశారు. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సుప్రియన్వి పిక్చర్ స్టూడియోపై ప్రియ సుదీప్ సమర్పిస్తున్నారు. 'దేవరాయ' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో సినిమా ప్రపంచాన్ని అద్భుతంగా పరిచయం చేస్తోంది. భారీ స్థాయిలో, చారిత్రక వైభవంతో తెరకెక్కుతున్న సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. విజువల్స్‌తో పాటు గౌర హరి అందించిన పవర్‌ఫుల్, మజెస్టిక్ స్కోర్ అనుభూతిని మరింత ఎలివేట్ చేసింది.రాజసంతో కూడిన అవతార్‌లో సుదీప్ అద్భుతమైన ఇంపాక్ట్ చూపించారు. అద్భుతమైన సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన ఆయన.. ప్రత్యేకంగా డిజైన్ చేసిన కిరీటం, ముత్యాల ఆభరణాలు, రాజసం ఉట్టిపడే అలంకరణలతో ఆకట్టుకున్నారు. ఆయన పదునైన చూపు, ప్రశాంతమైన హావభావాలు ఒక్క క్షణంలోనే అందరి దృష్టిని ఆకర్షించే రాజు ప్రతిరూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి.టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో, పోస్టర్‌లోని విజువల్ డీటెయిలింగ్ ఆకట్టుకుంటోంది. ఆ కాలం నాటి వైభవాన్ని, కథ మధ్యలో నిలిచే చక్రవర్తిని ప్రజెంట్ చేసే ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా డిజైన్ చేశారు. "చరిత్రను మలిచిన సామ్రాజ్యం. ఒక యుగాన్ని నిర్వచించిన రాజు. కాలాన్ని దాటి జీవించే ఒక లెజెండ్." అనే మూడు శక్తివంతమైన ఆలోచనలతో మేకర్స్ 'దేవరాయ' ను పరిచయం చేశారు. విజయనగర సామ్రాజ్యంలోని అత్యంత గొప్ప పాలకుల్లో ఒకరైన శ్రీకృష్ణదేవరాయ ప్రాధాన్యతను ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. తన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రల్లో ఇంటెన్సిటీని చూపించే నటుడిగా గుర్తింపు పొందిన సుదీప్.. ఈ పాత్ర కోసం మజెస్టిక్‌గా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఆయన ఫస్ట్ లుక్‌లో రాజసం, పవర్, గౌరవం అద్భుతంగా కనిపిస్తున్నాయి. గ్రాండ్ విజువల్ ట్రీట్‌మెంట్ మరింత వైభవంగా ఉంది.2027 డిసెంబర్‌లో ఈ చిత్రం థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది, మేకర్స్ ప్రమోషనల్ జర్నీని గ్రాండ్‌గా ప్రారంభించారు.




# మన ప్యానెల్ కీలక ప్రెస్ మీట్

**వుదయం సినిమా:** తెలుగు చిత్రం నిర్మాతల మండలి ఎన్నికలు సమీపించగా ఎన్నికలలో పోటీ చేస్తున్న ప్యానల్స్ లో ఒకటైన మన ప్యానెల్ సభ్యులు చక్కగా నేడు కీలక ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో మన ప్యానెల్ సభ్యులందరూ పాల్గొని ఎన్నికలకు సంబంధించిన విషయాలపై మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా... సి కళ్యాణ్ మాట్లాడుతూ : మన ప్యానెల్ తరపున అందరికీ నమస్కారం. నన్ను ఏకగ్రీవంగా ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నందుకు థాంక్స్. బండ్ల గణేష్ తో మాట్లాడటం జరిగింది. గిల్డ్ వారికి మేము పూర్తి సహకారం అందించాము కానీ వారు ఈ సంస్థకి వెన్నుపోటు పొడుస్తున్నారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ : మన ప్యానెల్ నుండి రెగ్యులర్ గా సినిమాలు తీస్తూ పోటీ చేస్తున్న అందరికీ ధన్యవాదాలు. దాసరి నారాయణరావుని మేము అనుసరిస్తున్నాము. బండ్ల గణేష్కి కృతజ్ఞతలు. సినిమా ఇండస్ట్రీలో రైతులా కష్టపడి పనిచేసే వ్యక్తి నిర్మాత. నిర్మాతల ఎన్నికలలో నామినేషన్ వేసిన అందరికీ కృతజ్ఞతలు .తుమ్మల ప్రసన్న కుమార్ మాట్లాడుతూ : గత ఎన్నికలలో చదలవాడ శ్రీనివాసరావు మాటకు విలువ ఇచ్చి ముందుకు వెళ్ళడం జరిగింది. గతంలో జరిగిన ఒక సందర్భంలో కూడా కొన్ని అవకతవకల వల్ల కొన్ని నిర్ణయాలు సమయస్ఫూర్తిగా ముందుకు వెళ్ళాము. రికార్డ్స్ లో మేము చేసిన సేవలు, అందించిన మెడిక్లెమ్ ఉన్నాయి. ఇబ్బందిలో ఉన్న వృద్ధులకు అండగా నిలబడి ఛారిటీగా పని చేస్తున్నాము.



# హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్న ప్రార్థనా చాబ్రియా

**వుదయం సినిమా:** ప్రార్థనా చాబ్రియా ఇక ఆకాశంలో విమానాన్ని నడిపే పైలట్‌గా మాత్రమే కాదు.. వెండితెరపై నటిగా కూడా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ట్రైనర్ గ్రేడ్ పైలట్‌గా పనిచేసిన ప్రార్థనా చాబ్రియా ఇప్పుడు సినీ రంగంలోకి నటిగా అడుగుపెడుతున్నారు. ఆమె నటిగా అరంగేట్రం చేస్తున్న 'చిరో' అనే తమిళ చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. నటన పరంగా ఆది శక్తి అనే యాక్టింగ్ స్కూల్ నుంచి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ప్రార్థనా చాబ్రియా.. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ఇప్పుడు వెండితెరపై తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. విమానాలను నడిపిన పైలట్‌గా నుంచి కెమెరా ముందు నటిగా మారిన ఆమె ప్రయాణం ఇప్పటికే సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.ప్రార్థనా చాబ్రియా నటనతో పాటు పోల్ డ్యాన్స్, బెల్లీ డ్యాన్స్‌లోనూ మంచి ప్రావీణ్యం కలిగి ఉన్నారు. దీంతో సంప్రదాయబద్ధమైన పాత్రలకు మాత్రమే కాకుండా విభిన్నమైన పాత్రలను పోషించే సామర్థ్యం ఆమెకు ఉందని తెలుస్తోంది. అలాగే సింధీ, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే ప్రార్థనా.. భవిష్యత్తులో పాన్ ఇండియా, సౌత్ ప్రాజెక్టులతో పాటు తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టే అవకాశాలున్నాయి.



# "జయహో రామానుజ" సాంగ్ లాంఛ్



**వుదయం సినిమా:** లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "జయహో రామానుజ". ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్ లో సాయి ప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా..సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 25న "జయహో రామానుజ" సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. బుధవారం ఈ చిత్ర సాంగ్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనిర్మాత, నటి ప్రవల్లిక మాట్లాడుతూ – "జయహో రామానుజ" సినిమాను నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నిర్మాణ బాధ్యతల వహిస్తూనే పాటు కృష్ణుడు, నారదుడు, రఘునాథస్వామి పాత్రల్లో నటించాను. ఈ చిత్రంతో సమ సమాజం కోసం పాటుపడిన రామానుజాచార్యుల వారి గురించి ఈ తరం వారికి మరింతగా తెలియజేసే ప్రయత్నం చేశాం. ఈ సినిమా జర్నీ నాకు ఎన్నో విషయాలు నేర్పింది. అదంతా నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. మీరంతా తప్పకుండా ఆదరించాలని కోరుకుంటున్నా. అక్టోబర్ 25న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కు తీసుకొస్తున్నాం అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.